V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం

09-11-2024

సంపుటి : 01 | సంచిక : 187 | పేజీలు : 12 | వెల : 5/-

తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD

# ఆర్యవైశ్యులకు అండగా ఉంటా..



- వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి కృషి చేస్తా
- అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొస్తా
- ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం గొప్ప నిర్ణయం
- తొలి ఛైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించడం నా అదృష్టం
- ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించిన కల్వ సుజాత

**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ ఉద్యమంలో, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆర్యవైశ్యుల పాత్ర ఎనలేనిదని, తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఆర్యవైశ్యుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం గొప్ప నిర్ణయమని తెలంగాణ ఆర్యవైశ్య కార్పోరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత అన్నారు. తనను తొలి ఛైర్ పర్సన్ గా నియమించడం అదృష్టమని అన్నారు. శుక్రవారం లక్డికాపూల్ లోని అరణ్య భవన్ లోని ఆర్యవైశ్య కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర తొలి ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్‌గా...

మిగతా12లో...



తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ తొలి ఛైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కల్వ సుజాతను అభినందిస్తున్న వైశ్య వికాస వేదిక, వీ3 న్యూస్ ఛానల్ , విశ్వంభర దిన పత్రికల ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ

## నేనుండగా ఆర్టికల్ 370 పునరుద్ధరణ

# కుదరదు

పునరుద్ధరించే ప్రయత్నాలను దేశం అంగీకరించదు

కశ్మీర్‌లో కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేదు

డ్రైవర్ సీటు కోసం ఎ'గాడీ'లో పొట్లాడుకుంటున్నారు

మహాయుతి కూటమి మాత్రమే రాష్ట్రంలో సుపరిపాలనను అందించగలదు

ధూలే ఎన్నిక ప్రచార సభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



2



# ఎవరు అడ్డొచ్చినా.. లెక్కచేయం

## మూసీ ప్రక్షాళనకు దుర్మార్గులు అడ్డొస్తున్నారు

వారిలో బీఆరెస్ నేతలు ముందున్నారు

30 రోజుల్లో తుదిరూపం తీసుకువస్తాం

జనవరి తొలివారంలో పాదయాత్ర ప్రారంభిస్తా

మూసీ పునరుజ్జీవ యాత్ర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2

**విశ్వంభర, హైదరాబాద్:**

మూసీ ప్రక్షాళనకు కొంతమంది దుర్మార్గులు అడ్డొస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. అడ్డుపడే వారిలో బీఆరెస్ ముందుందని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఉత్పత్తులను ఎవరూ కొనట్లేదని, ఈ ప్రాంతంలో కల్లు అమ్ముకునే పరిస్థితి కూడా లేదన్నారు. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం సంగెం నుంచి మూసీ పునరుజ్జీవ యాత్రకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం శ్రీకారం చుట్టారు. సంగెం నుంచి నాగిరెడ్డి పల్లె వరకు ధర్మారెడ్డి కాల్వ వెంబడి సుమారు 2.5 కి.మీ మేర పాదయాత్ర చేశారు.

మిగతా2లో...

## వృత్తిపరంగా సంతృప్తిగా ఉన్నా..

- రేపటి నుంచి తీర్పులివ్వ లేనన్నమాట వాస్తవం
- న్యాయవ్యవస్థపై నాకెంతో అభిమానం ఉంది
- వాదనలు, తీర్పుల ద్వారా ఎంతో నైపుణ్యాన్ని పొందాను
- నేను ఈ కోర్టును విడిచిపెట్టి నప్పుడు ఎలాంటి తేడా ఉండదు
- ఎవరినైనా బాధపడితే క్షమించండి
- సీజేఐగా చివరి రోజున చంద్రచూడ్



2

## ఇళ్లు కూల్చేసిన ప్రాంతంలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేయాలి

- కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటుంటే కేటీఆర్ యాక్టింగ్ చేస్తున్నారు
- బీజేపీకి స్పేస్ లేకుండా చేయాలనే కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు
- అందుకే కేటీఆర్‌ను అరెస్ట్ చేయడం లేదు
- మీడియాతో చిట్ చాట్‌లో బండి సంజయ్

2



## యాదాద్రి ఇకపై యాదగిరిగుట్ట

- ఇకపై అన్ని రికార్డుల్లో వ్యవహారంలోకి తీసుకురావాలి
- టీటీడీ స్థాయిలో ఆలయ బోర్డు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2



## అప్పీల్ చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదు

ఎమ్మెల్యేల అనర్హత కేసులో వాదనలు వినిపించిన బీఆర్ఎస్ పార్టీ న్యాయవాది

తదుపరి విచారణ 11కు వాయిదా



2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 120 | ₹ 142 |
| స్కిన్‌తో | స్కిన్‌లెస్ |
| ₹206 | ₹234 |

తుదిశ్వాస వరకు క్రియాశీల రాజకీయాల్లో

## పోరాడుతా

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకూ విశ్రాంతి తీసుకోను
- ఈ రాష్ట్రాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది
- ఇందుకోసం నా పరిమితికి మించి ప్రయత్నిస్తా
- మాజీ ప్రధాని దేవేగౌడ



2

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

## మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

* ఛైర్మన్‌గా ఉపముఖ్యమంత్రి భట్టి
* సభ్యులుగా కేకే, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

2



పాప పరిహార యాత్ర చేసినా

## కాంగ్రెస్ పాపం పోదు

హైదరాబాద్‌లో ఇళ్లు కూల్చి.. నల్గొండలో పాదయాత్రా?:

బీఆర్ఎస్ కార్యకర్తలను గృహ నిర్బంధం చేస్తే ప్రజల మద్దతు లభించదు

పాదయాత్ర కూడా నిర్బంధాల మధ్య కొనసాగడం దురదృష్టకరం

ఎక్స్ వేదికగా మండిపడ్డ హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్ :**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ పాదయాత్ర సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేస్తున్న అక్రమ అరెస్టులను ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను గృహ నిర్బంధం చేస్తే ప్రజల మద్దతు..

మిగతా2లో...



## వృత్తిపరంగా సంతృప్తిగా ఉన్నా..

### సీజేఐగా చివరి రోజున చంద్రచూడ్

**ఢిల్లీ:** భారత ప్రధాన న్యాయమూర్తిగా డీవై చంద్రచూడ్‌కు శుక్రవారం చివరి పనిదినం. ఈనెల 10న ఆయన సీజేఐగా పదవీ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సుప్రీంకోర్ర్టు ధర్మాసనం చంద్రచూడ్‌కు ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, సహోద్యోగులను ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడుతూ.. తన న్యాయ ప్రయాణం ఎంతో కృతజ్ఞత, వినయంతో సాగిందని చెప్పారు. ఈ పదవీ కాలంలో ఎవరైనా తన వల్ల బాధ పడితే క్షమించాలని కోరారు. రేపటి నుంచి సర్వోన్నత న్యాయస్థానం నుంచి తీర్పులు ఇవ్వలేనన్న మాట వాస్తవమని.. అయినప్పటికీ తాను వృత్తిపరంగా పూర్తి సంతృప్తిగా ఉన్నానని చెప్పారు.

'గురువారం సాయంత్రం, నా రిజిస్ట్రార్ జ్యుడిషియల్ నన్ను వేడుక ఎప్పుడు చేయాలని నన్ను అడిగారు. నేను మధ్యాహ్నం 2 గంటలకు అని చెప్పాను. అప్పటి వరకు కేసులు వాదించవచ్చని అనుకున్నా. తరువాత అనిపించింది శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎవరైనా ఈ కోర్టులో ఉంటారా లేదా నన్ను నేను మాత్రమే తెరపై నన్ను చూసుకుంటానా?' (చిరునవ్వుతో) అని అన్నారు జస్టిస్ చంద్రచూడ్ న్యాయవ్యవస్థ సంప్రదాయం పట్ల తనకున్న అభిమానాన్ని తెలియజేస్తూ.. 'మేము ఇక్కడ పనిచేసేందుకు ఒక భక్తుడిలా ఉన్నాము. న్యాయవ్యవస్థపై నాకెంతో అభిమానం ఉంది. వాదనలు, తీర్పుల ద్వారా ఎంతో నైపుణ్యాన్ని పొందాను. విలువైన కోర్టు మెలకువలను నేర్చుకున్నాను. మేం ఇచ్చే తీర్పులు కొన్ని కేసులను గొప్పగా ముగించవచ్చు. లేదా విచ్ఛిన్నం చేయవచ్చు. ఇక్కడ ఎంతో గొప్ప న్యాయమూర్తులు ఉన్నారు. నేను ఈ కోర్టును విడిచిపెట్టినప్పుడు ఎలాంటి తేడా ఉండదు. ఎందుకంటే జస్టిస్ ఖన్నా వంటి గౌరవమైన వ్యక్తి బాధ్యతలు స్వీకరిస్తారు. తన సారథ్యంలోఎన్నో కేసులకు గొప్ప పరిష్కారాలు లభిస్తాయని ఆశిస్తున్నా. చివరి రోజు చూసిన 45 కేసుల్లో కూడా చట్టం, జీవితం గురించి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణంలో నేను ఎవరినైనా బాధపడితే క్షమించండి. ఎవరినీ ఉద్దేశించి బాధపెట్టకపోయినా క్షమించమని కోరుతున్నా' అని పేర్కొన్నారు.

సీజేఐగా చివరి తీర్పు ఇదే..

అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి మైనార్టీ హోదా విషయంలో జస్టిస్ డీవై చంద్రచూడ్ చివరి తీర్పు ఇచ్చారు. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని ఏడుగురు ధర్మాసనం నాలుగు రకాల తీర్పులను వెలువరించింది. ఏఎంయూ కేసులో నాలుగు రకాల అభిప్రాయాలు ఏర్పడ్డాయని, దీంట్లో మూడు వ్యతిరేక తీర్పులు ఉన్నట్లు సీజే చంద్రచూడ్ తెలిపారు. విద్యా సంస్థ నియంత్రణ, పరిపాలన విషయంలో పార్లమెంట్‌లో చట్టం చేసినా.. ఆ విద్యాసంస్థకు ఉన్న మైనార్టీ హోదాను రద్దు చేయరని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. పార్లమెంట్ చట్టంతో అలీగఢ్ ముస్లిం వర్సిటీ మైనార్టీ హోదా రద్దు అయినట్లు 1968లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టిపారేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ తెలిపారు. అడ్మినిస్ట్రేషన్‌లో మైనార్టీ సభ్యులు లేనంత మాత్రాన.. ఆ వర్సిటీ మైనార్టీ హోదా పోదు అని సుప్రీంకోర్టు చెప్పింది.

కాగా నవంబర్ 8 2022న న ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ పదవీకాలం ప్రారంభమైంది. ఈ నెల 10తో ముగియనుంది. సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులైన సంగతి తెలిసిందే. నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణస్వీకారం చేయనున్నారు.. 2025 మే 13 వరకు ఆయన సీజేఐగా కొనసాగనున్నారు.

## ఎవరు అడ్డొచ్చినా.. లెక్కచేయం

### మూసీ పునరుజ్జీవ యాత్ర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. "మూసీ నదిలో చేపలు బతుకుతున్నాయా? ఈ నది ఒడ్డున పెంచిన గొర్రెలను ఎవరూ కొనడం లేదు. మూసీ నది కలుషితం కావడంతో వ్యవసాయం చేయడం లేదు. మూసీ కాలుష్యం కారణంగా పట్టణాలు, గ్రామాలు నాశనం అవుతున్నాయి. కాళేశ్వరం పేరుతో బీఆరెస్ నేతలు రూ.లక్ష కోట్లు దోచుకున్నారు. బీఆరెస్ నేతల మాదిరిగా గారడీ చేయడం మాకు రాదు.

మూసీ ప్రక్షాళన, బుల్డోజర్‌కు ఎవరు అడ్డొచ్చినా లెక్కచేయం. ఈ ప్రాజెక్టును చేపట్టాలని నిశ్చయించుకున్నాం. మరో 30 రోజుల్లో తుదిరూపం తీసుకొస్తాం" అని సీఎం తెలిపారు. జనవరి తొలివారంలో వాడపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని రేవంత్ ప్రకటించారు. మూసీ పునరుజ్జీవ సంకల్పయాత్రలో భారీగా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి. సంగెం గ్రామస్థులు పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. మూసీ వల్ల కలిగే సమస్యలను సీఎంకు వివరించారు.


### ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

## మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛైర్మన్‌గా, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీనియర్ నేత కె.కేశవరావు సభ్యులుగా కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఉద్యోగుల జేఏసీ నేతలు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమై పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేబినెట్ సబ్ కమిటీ వేసి.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి సీఎం హామీ ఇచ్చారు. కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుపై తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నేతలు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. త్వరగా సమావేశాలు ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## తుదిశ్వాస వరకు క్రియాశీల రాజకీయాల్లో పోరాడుతా

### మాజీ ప్రధాని దేవేగౌడ



**బెంగళూరు:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకూ విశ్రాంతి తీసుకోనని మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత దేవెగౌడ పేర్కొన్నారు. తన తుది శ్వాస వరకూ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉంటానని ఉద్ఘాటించారు. చన్నపట్న అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు.

"నా వయసు 92. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకూ పోరాడతా. నిఖిల్ కుమారస్వామి గెలిచిన తర్వాత నేను ఇంట్లో నిద్రపోతా అనుకోవద్దు. చివరి శ్వాస విడిచేవరకు రాజకీయాల్లో పోరాడుతూనే ఉంటా. రాజకీయాల నుంచి వైదొలగుతానని నేనెన్నడూ చెప్పలేదు. నా 62 ఏళ్ల జీవితంలో ఇటువంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు. ఈ రాష్ట్రాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం నా పరిమితికి మించి ప్రయత్నిస్తా" అని దేవెగౌడ పేర్కొన్నారు. చన్నపట్న అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న మనవడు నిఖిల్ కుమారస్వామి తరఫున ప్రచారం నిర్వహించిన మాజీ ప్రధాని.. ఇది ప్రచారం మాత్రమే కాదని, రాజకీయ యుద్ధంలో భాగస్వామ్యమయ్యానని అన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పై నిప్పులు చెరిగారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ధనబలం ఉపయోగించి తన కుమారుడు కుమారస్వామిని ఓడించాలని ప్రయత్నించారని ఆరోపించారు. మాజీ ప్రధాని వ్యాఖ్యలపై ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ.. "కుమారస్వామి మాజీ సీఎం, మాజీ ప్రధాని కుమారుడు. కానీ, నేను మాత్రం రైతు కుమారుడిని. నాకు, కుమారస్వామికి మధ్య పోలిక ఉండదు" అని అన్నారు.

# నేనుండగా ఆర్టికల్ 370 పునరుద్ధరణ కుదరదు

- ధూలే ఎన్నిక ప్రచార సభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



**ముంబయి:** తానుండగా జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 పునరుద్ధరణ కుదరదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధూలేలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో మహారాష్ట్ర ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. జమ్ముకశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వం స్వయం ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 ని రద్దు చేసింది. ఈ క్రమంలో ఇటీవల అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కార్ఫరెన్స్, కాంగ్రెస్ పార్టీల కూటమి గెలిచింది. అంతేగాక ఆర్టికల్ 370ని పునరుద్ధరించడానికి జమ్ముకశ్మీర్ శాసనసభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దాంతో ఆ పార్టీ తీరును మహారాష్ట్రలో బీజేపీ నాయకులు ఎండగడుతున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. తాను ఉన్నంత వరకు కశ్మీర్‌లో కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేదని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం మాత్రమే పరిపాలిస్తుందని చెప్పారు. ఆర్టికల్ 370ని ఎవరూ తిరిగి తీసుకురాలేరని, జమ్ముకశ్మీర్‌లో కాంగ్రెస్ ఉద్దేశాలను మహారాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. ఆర్టికల్ 370ని పునరుద్ధరించే ప్రయత్నాలను దేశం అంగీకరించదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇండియా కూటమి అక్కడ అధికారంలోకి వచ్చిన వెంటనే కశ్మీర్‌పై వారి కుట్రను ప్రారంభించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370ని పునరుద్ధరించడానికి శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించారని.. అది ఎప్పటికీ జరగని పని అని మోదీ పునరుద్ఘాటించారు. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి మాత్రమే రాష్ట్రంలో సుపరిపాలనను అందించగలదని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రజలను ఏది అడిగినా హృదయపూర్వకంగా బీజేపీ ఇచ్చేస్తారని వ్యాఖ్యానించారు. ప్రజల్లో విష బీజాలు నాటి దేశంలో ఉన్న గిరిజన వర్గాలను విభజించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. వారంతా ఐక్యంగా ఉన్నంతకాలం బలంగా ఉంటారని.. ఏ శక్తీ వారిని అడ్డుకోలేదని అన్నారు.

**డ్రైవర్ సీటు కోసం అ'గాడీ'లో కొట్లాటలు : మోదీ వ్యంగ్యాస్త్రాలు..**

ముంబయి: డ్రైవర్ సీటు కోసం మహా వికాస్ అ'గాడీ' నేతలు పోట్లాడుకుంటున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతిపక్ష కూటమిలో ముఖ్యమంత్రి ఎవరు అవుతారనే విషయంపై అంతర్గత పోరు జరుగుతోందని విమర్శించారు. మహాయుతి అధికారంలో కొనసాగితేనే రాష్ట్రంలో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అయితే.. దానికి విరుద్ధంగా కొందరు మాత్రం ప్రజలను లూటీ చేసేందుకే రాజకీయాల్లో ఉంటారని.. రాష్ట్ర అభివృద్ధికి ఆటంకాలు సృష్టిస్తారని దుయ్యబట్టారు.

ఆర్టికల్ 370ని తిరిగి తీసుకొచ్చే ప్రసక్తే లేదు : అమిత్ షా

జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ చేసిన డిమాండ్‌పై అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'శివాజీ పుట్టిన మహారాష్ట్ర గడ్డ మీద నుంచి చెబుతున్నా.. మీ నాలుగు తరాలు వచ్చి అడిగినా ఆర్టికల్ 370ని తిరిగి తీసుకొచ్చే ప్రసక్తే లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. దీని గురించి జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం తీర్మానం ఆమోదించడాన్ని వ్యతిరేకించారు.

# యాదాద్రి ఇకపై యాదగిరిగుట్ట

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**విశ్వంభర, యాదగిరిగుట్ట:** ఇకపై అన్ని రికార్డుల్లో యాదాద్రి బదులు యాదగిరిగుట్టగా వ్యవహారంలోకి తీసుకురావాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. యాదాద్రి జిల్లా పర్యటనలో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో సీఎం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. టెంపుల్ బోర్డు ఏర్పాటు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట బోర్డుకు టీటీడీ స్థాయిలో ప్రాధాన్యత ఉండేలా అధ్యయనం చేసి టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు.

యాదగిరి గుట్ట విశేషాలు ఇవే!

గోశాలలో గోసంరక్షణకు ప్రత్యేక పాలసీ తీసుకురావాలని అధికారులకు సూచించారు. గోసంరక్షణకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. కొండపై నిద్ర చేసి మొక్కులు తీర్చుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు విమాన గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను పూర్తి చేయాలని చెప్పారు. అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయానికి సంబంధించి పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిందేనని అధికారులకు తేల్చి చెప్పారు. మరో వారం రోజుల్లో పూర్తి వివరాలు, ప్రతిపాదనలతో రావాలని ఆదేశించారు. పెండింగ్ పనులు, ఇతర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక అందించాలన్నారు.

# సీఎం పర్యటన సమయంలో గందరగోళం

### ముఖ్యమంత్రితో పాటు ఆలయంలోనికి వెళ్లేందుకు యత్నించిన కాంగ్రెస్ నాయకులు

### నియంత్రించలేక ఇబ్బందులు పడ్డ పోలీసులు




**విశ్వంభర, యాదగిరిగుట్ట:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట పర్యటన సమయంలో కాసేపు గందరగోళం ఏర్పడింది. ఆయనను చూసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజా ప్రతినిధులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు సీఎంతో పాటు ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని భద్రతా సిబ్బంది ఆపడంతో తోపులాట జరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి తూర్పు రాజగోపురం ముందు నుంచి ప్రధాన ఆలయంలోకి వెళ్లారు. ఆ సమయంలో ఆయనతో ఉన్న కొందరు నాయకులు, కార్యకర్తలు కూడా లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారికి అనుమతి లేదంటూ భద్రతా సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు. తాము కూడా లోనికి వెళ్లాలంటూ వారంతా తోసుకురావడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

**మంత్రులకు సైతం తిప్పలు :**

ఈ సమయంలో సీఎంతో పాటే వస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కూడా ఆలయం లోనికి వెళ్లేందుకు కాస్త ఇబ్బంది పడాల్సి వచ్చింది. పోలీసులు కార్యకర్తలను నియంత్రించి అతి కష్టం మీద మంత్రులను లోనికి పంపించారు. చివరకు పోలీసులు క్యూలైన్ గేట్లు మూసేసి కార్యకర్తలను అడ్డుకున్నారు. అప్పటికే కొందరు నాయకులు, కార్యకర్తలు లోనికి బలవంతంగా వెళ్లారు.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తన పుట్టినరోజు సందర్భంగా యాదాద్రి ఆలయానికి వచ్చారు. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లా, ఇతర ప్రాంతాల నుంచి భారీగా ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యాదాద్రికి తరలివచ్చారు. దీంతో ఆలయం కిక్కిరిసిపోయింది. దర్శనం అనంతరం ముఖ్యమంత్రి వైటీడీఏ (యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ) అధికారులతో సమీక్ష నిర్వహించారు.



### సనాతన ధర్మం గొప్పదనాన్ని

## విద్యార్థులంతా చాటి చెప్పాలి

### ధర్మగిరి వేద పాఠశాల సమస్యలు పరిష్కరిస్తాం

### టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

**విశ్వంభర, తిరుమల**: తిరుమలలోని ధర్మగిరి వేద పాఠశాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు శుక్రవారం సందర్శించారు. వేద పాఠశాలలో ఆయనకు పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం అక్కడ మాట్లాడారు. తిరుమల ధర్మగిరి వేద పాఠశాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సనాతన ధర్మం గొప్పదనాన్ని విద్యార్థులంతా చాటి చెప్పాలన్నారు. తిరుమలలోని గోశాలను సైతం ఛైర్మన్ సందర్శించారు. ఏకాంత సేవలో వినియోగించే వెన్నను ఆయన.. శ్రీవారి సేవకులకు అందించారు.

### ఇళ్లు కూల్చేసిన ప్రాంతంలో

## రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేయాలి

### మీడియాతో చిట్ చాట్‌లో బండి సంజయ్



**విశ్వంభర, హైదరాబాద్:** జన్వాడ ఫాంహౌస్ కేసులో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బీజేపీ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. మూసీ నది పక్కన ఇళ్లు కూల్చేసిన ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేయాలని.. నల్గొండలో కాదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్ చాట్‌లో బండి సంజయ్ మాట్లాడారు.

"ఆరు గ్యారంటీలపై సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేయాలి. ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు కాకుండా.. ఎన్నికలు వచ్చినప్పుడు బయటకు వస్తే లీడర్ అవుతారా? రేవంత్, బండి సంజయ్ ఒక్కటేనని కేటీఆర్ పదే పదే చెబుతున్నారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా రేవంత్, నేను కొట్లాడామని.. అందుకే తామిద్దరం కేటీఆర్‌కు కలలోకి వస్తున్నాం. డైవర్షన్, కాంప్రమైజ్ పాలిటిక్స్ చేసే అలవాటు కేటీఆర్‌కే ఉంది. బీజేపీకి స్పేస్ లేకుండా చేయాలనే కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయి. ప్రజా నిర్ణయం ప్రకారం ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నా. రేవంత్.. మిమ్మల్ని జైలుకు పంపిన విషయం మరిచిపోయారా?

బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటుంటే ఆయన కుమారుడు కేటీఆర్ యాక్టింగ్ చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆ పార్టీకి అభ్యర్థులు దొరకడం లేదు. ప్రధానిని కూడా కేటీఆర్ ఏక వచనంతో విమర్శిస్తున్నారు. ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదు. రేవంత్, బండి సంజయ్ ఒక్కటేనంటూ సోషల్ మీడియాలో బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. నేను, రేవంత్ ఒక్కటే అని చెప్పడానికి ఒక్క ఉదాహరణ చెప్పండి. కన్న బిడ్డ పెళ్లికి కూడా వెళ్లకుండా రేవంత్‌ను ఇబ్బంది పెట్టారు. జైలుకు పంపించిన విషయాన్ని ఆయన మరిచిపోయారా? అలాంటి వారితో కాంప్రమైజ్ అవుతున్నారా? ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు కేసులపై హంగామా చేశారు. రేవంత్, కేటీఆర్ మధ్య ఒప్పందం ఉంది. అందుకే కేటీఆర్‌ను అరెస్ట్ చేయడం లేదు" అని బండి సంజయ్ ఆరోపించారు.

## పాప పరిహార యాత్ర చేసినా కాంగ్రెస్ పాపం పోదు

(మొదటి పేజీ తరువాయి)

లభించదన్నారు. పాదయాత్ర కాదు.. పాప పరిహార యాత్ర చేసినా కాంగ్రెస్ పాపం పోదని ఎద్దేవా చేశారు. పేదల గూడు కూల్చింది ఒక చోట, పాదయాత్ర మరో చోట అని చెప్పారు. హైదరాబాద్‌లో ఇళ్లు కూల్చి నల్గొండలో పాదయాత్ర చేస్తారా అని ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి పాదయాత్ర మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల మద్దతు ఉంటే నిర్బంధాలు, అక్రమ అరెస్టులు ఎందుకన్నారు. పాదయాత్ర కూడా నిర్బంధాల మధ్య కొనసాగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూసీ మురికి కూపంగా మారడానికి 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన కారణం కాదా? అని హరీశ్‌రావు నిలదీశారు.

## అప్పీల్ చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించిన కేసులో హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌పై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. బీఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది మోహన్ రావు వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీల్ చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదన్నారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌కు విచారణ అర్హత లేదన్నారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ సకాలంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ మేరకు పలు కోర్టుల తీర్పులను మోహన్ రావు చదివి వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను 11వ తేదీకి వాయిదా వేసింది.



# అద్భుత ఘట్టం.. విలువలకు పట్టం





- ఆదర్శాలను చాటిచెప్పిన ప్రదర్శన
- కన్యావందనం.. ప్రకృతి వందనం... నారీ వందనాలతో శోభిల్లిన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ప్రాంగణం

**విశ్వంభర, హైదరాబాద్:** విలువలతో కూడిన సమున్నత భావి భారత సమాజ నిర్మాణమే లక్ష్యంగా హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటైన హిందూ ఆధ్యాత్మిక & సేవా ఫౌండేషన్ (హెచ్ ఎస్ ఎస్ ఎఫ్) బృహత్ మేళా సేవా ప్రదర్శిని 2వ రోజైన శుక్రవారం నాటి కార్యక్రమం ఆద్యంతం ఆదర్శవంతమైన వాతావరణంలో సాగింది. ఉదయం కన్యావందనం, మధ్యాహ్నం ప్రకృతి వందనం, సాయంత్రం నారీ వందన కార్యక్రమాలు బాలబాలికలకే కాక పెద్దలకు సైతం సామాజిక విలువలను నిలబెట్టుకోవలసిన ఆవశ్యకతను చాటి చెప్పాయి. జంటనగరాల నుంచి విచ్చేసిన వందలాది మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ సేవా ప్రదర్శినిలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.

**బాలికలకు పాదపూజలు**

స్త్రీని దైవంగా భావించి గౌరవించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ ఉదయం జరిగిన కన్యావందన కార్యక్రమం చూడటానికి రెండు కళ్లూ చాలవన్నంత మనోహరంగా సాగింది. దేశంలో బాలికలు, స్త్రీల పట్ల జరుగుతున్న అవమానాలను నిరోధించి, వారి ప్రాధాన్యతను గుర్తించి గౌరవించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పేలా నిర్వాహకులు ఈ వేడుకను నడిపించారు. బాలికలందరినీ కుర్చీలలో కూర్చోబెట్టి, వేదమంత్రాలు, స్తుతుల మధ్య వారికి బాలురతో పసుపు కుంకుమలు, పూలతో పాదపూజ చేయించారు. పూజలందుకుంటున్న బాలికలను సోదరిగా, తల్లిగా, దైవంగా భావించాలని బాలురకు హితవు చెప్పారు. ఈ కార్యక్రమం నడుస్తున్నంత సేపూ లోకంలో సృష్టికి మూలమైన స్త్రీ ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యాయులు, ఇతర పెద్దలు ఆనందంతో తిలకిస్తుండగా పూజలందుకున్న బాలికలు తమకు లభిస్తున్న ఈ గౌరవానికి గాను ఆనందంతో భావోద్వేగాలకు లోనయ్యారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి తమ ప్రసంగంలో స్త్రీ ప్రాముఖ్యత, ప్రాధాన్యతలను వివరించారు.

**ప్రకృతిని కాపాడుకోవాలి**

పశుపక్ష్యాదులు, మానవులు సహా సహా జీవకోటి మనుగడకు అత్యంత కీలకమైన వృక్షసంపదను కాపాడుకోవలసిన అవసరాన్ని తెలియజేస్తూ ఇదే వేదికపై మధ్యాహ్నం జరిగిన ప్రకృతి వందన కార్యక్రమం సమాజ బాధ్యతను తట్టిలేపింది. విద్యార్థులందరికీ మొక్కలను అందజేసి, పువ్వులు, పసుపు కుంకుమలతో ఓం వృక్షదేవతాయై నమః అంటూ అర్చన చేయించారు. ప్రాణవాయువునిచ్చి మనకి ఊపిరిపోస్తున్న వృక్షాలను కాపాడుకోవడం మన కర్తవ్యమని బోధించారు. పుట్టినవేడుకలకు గుర్తుగా మొక్కను పెంచాలనే సంకల్పం తీసుకోవాలని హితవు చెప్పారు. పూజానంతరం విద్యార్థులు ఆ మొక్కలను తమతో తీసుకువెళ్లారు. ప్రకృతికి ప్రతిరూపమైన మొక్కలు, వృక్షాలు, గోమాత, నాగులు, జలం, భూమాతను కాపాడతామని, పూజిస్తామని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆరాధిస్తామని, స్త్రీలను, సైనికులను గౌరవిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అరబిందో అంతర్జాతీయ విద్యాలయం డైరెక్టర్ చలమాయి రెడ్డి మాట్లాడుతూ ఈ సేవా ప్రదర్శినిలో ప్రకృతి ఆరాధనకు స్థానం కల్పించి మహత్కార్యం చేశారని కొనియాడారు. మొక్కలలోని ఔషధ విలువలను, ఇతర అంశాలను తెలిపారు. విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి ఆర్ శోభ ప్రసంగిస్తూ విద్యార్థుల మధ్యలోకి వెళ్లి విద్యార్థుల అనుభవాలను చెప్పించారు. వృక్ష సంపద, జలంతో కూడిన ప్రకృతిని మనకిస్తున్న లాభాలను తెలిపారు. వృథా చేయకుండా వనరులను రక్షించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమానికి వనజీవి రామయ్య దంపతులు విచ్చేసి వృక్షో రక్షతి రక్షితః అంటూ తమ ప్రసంగం ద్వారా విద్యార్థులను ఉత్తేజపరిచారు. రామయ్యతో పాటుగా వృక్ష రక్షకుడు దూసర్ల సత్యనారాయణ ప్రసంగిస్తూ ప్రకృతి పరిరక్షణ అవసరాన్ని స్పష్టం చేశారు.

**మహిళలను గౌరవించాలి**

రెండవ రోజున చివరి కార్యక్రమంగా నారీ వందన్ (మహిళా సమ్మాన్) కార్యక్రమం జరిగింది. కుటుంబ వ్యవస్థకు, సామాజిక వ్యవస్థకు మూలమైన స్త్రీని గౌరవించాల్సిన ఆవశ్యకతను గుర్తించాలని, స్త్రీని పరిహసించడం, అవహేళన చేయడం తగదని ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మేనేజ్ సంస్థ పూర్వ డైరక్టర్ జనరల్ ఉషారాణి పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మానవహక్కుల చైర్‌పర్సన్ ఎస్ విజయభారతి మాట్లాడుతూ సర్వే భవంతు సుఖినః అన్న ఆర్యోక్తిని అనుసరించి హ్యూమన్ రైట్స్ సంస్థ పని చేస్తోందన్నారు. ఈ వేదికపై చేపట్టిన కార్యక్రమాలే తమకు ఫిర్యాదులుగా వస్తాయంటూ సంస్థ పనితీరును వివరించారు. సమాజంలోని వివిధ రంగాల్లో స్త్రీల భాగస్వామ్యాన్ని ప్రస్తావించారు. ముఖ్య వక్త, భగవద్గీత ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ గంగాధర శాస్త్రి మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలలో ఇమిడి ఉన్న సామాజిక బాధ్యతను వివరించారు. హిందూధర్మం ఎంతో శక్తిమంతమై ఉండగా హిందువులు మాత్రం బలహీనులై ఉన్నారని ఆవేదన చెందారు. భారతదేశంలో పుట్టినందుకు ఒక భగవద్గీత శ్లోకం, తెలుగువారిగా పుట్టినందుకు పోతన పద్యం ఒక్కటైనా రాకపోతే మన ఉనికికి అర్థమేంటని ప్రశ్నించారు. మాతృభూమి పట్ల శ్రీరాముని గల గౌరవాన్ని తెలియజేస్తూ దేశభక్తిని చాటిన రాముని బాటలో నడవాలని పిలుపునిచ్చారు. వేదాలు, భగవద్గీత, ఉపనిషత్తులు రిటైర్మెంట్ పుస్తకాలు కావని, అనునిత్యం ఆచరించాల్సినవని తెలిపారు.





# రాహుల్‌కు కాంగ్రెస్ చరిత్ర తెలియదు

- సామాజిక న్యాయం గురించి కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరం
- బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికి మోడల్ అవుతుందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరంగా ఉందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు సామాజిక న్యాయం గురించి మాట్లాడటం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"రాహుల్ గాంధీ ముందు వారి తాత, ముత్తాతల వైఖరి తెలుసుకోవాలి. చరిత్ర తెలుసుకొని బడుగు బలహీనవర్గాలకు ఆయన క్షమాపణ చెప్పాలి. కాంగ్రెస్ చరిత్ర రేవంత్ రెడ్డికి తెలియదు. కులాల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించవద్దని అప్పట్లోనే రాష్ట్రాలకు నెహ్రూ లేఖలు రాశారు. బీసీల అభ్యున్నతి కోసం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎటువంటి బీసీ కమిషన్ ఏర్పాటు చేయలేదు. మండల కమిషన్‌ను ఇందిరాగాంధీ పక్కన పెట్టారు. కుల ఆధారిత రిజర్వేషన్ల వల్ల దేశం బాగుపడదని రాజీవ్ గాంధీ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీల పట్ల ఎనలేని ప్రేమ ఒలక బోస్తున్నారు. అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ రిజర్వేషన్లు ఎత్తివేస్తామని చెప్పి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు.










# సంచలన తీర్పులు... సామాజిక మార్పులు..

## సుప్రీం న్యాయమూర్తిగా, చీఫ్ జస్టిస్‌గా ఎన్నో చారిత్రక తీర్పులిచ్చిన డీవై చంద్రచూడ్

(రేపు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ సందర్భంగా)

“ అయోధ్య రామమందిర వివాదం, ఆర్టికల్ 370 రద్దు, ఎలక్టోరల్ బాండ్స్ కేసు, బాలికల అబార్షన్ హక్కు, తాజాగా ప్రైవేటు ఆస్తుల స్వాధీనం...ఇలా ఎన్నో..ఎన్నెన్నో సంచలన, చారిత్రక తీర్పులు ఇచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ధనుంజయ యశ్వంత్(-డీవై) చంద్రచూడ్ ఆదివారం (నవంబర్ 10) సీజేఐగా పదవీ విరమణ చేయనున్నారు.ఈ క్రమంలో శుక్రవారం ఆయనకు చివరి పనిదినం కావడంతో సుప్రీం ధర్మాసనం ఘనంగా వీడ్కోలు పలికింది. డీవై చంద్రచూడ్..భారతదేశ చరిత్రలో ఎక్కువ కాలం సీజేఐగా పని-చేసిన యశ్వంత్ విష్ణు చంద్రచూడ్ తనయుడు. తండ్రికి తగ్గ తనయుడిగానే కాదు.. చీఫ్ జస్టిస్‌గా తండ్రి ఇచ్చిన తీర్పులనే తిరగరాశారు.2016లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎన్నికైనప్పటి నుంచి ఎన్నో కేసుల పరిష్కారాల్లో డీవై చంద్రచూడ్ తనదైన ముద్ర వేశారు. అనేక మైలురాళ్లైన తీర్పులు వెల్లడించారు. 2022 నవంబర్ 9న సుప్రీంకోర్టు ప్రధాన న్యా-యమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రచూడ్..రెండేళ్ల పాటు సేవలందించారు. ఆయన పదవీకాలంలో ఎన్నో చారిత్రక తీర్పులు వెల్లడించారు. ఈనేపథ్యంలో డీవై చంద్రచూడ్ జీవిత విశేషాలు, ఆయన ఇచ్చిన కీలక తీర్పులపై విశ్వంభర ప్రత్యేక కథనం..








డీవై చంద్రచూడ్ అసలు పేరు ధనంజయ చంద్రచూడ్ 1959 నవంబరు 11న మహారాష్ట్ర రాజధాని ముంబైలో జన్మించాడు. తండ్రి యశ్వంత్ విష్ణు చంద్రచూడ్, భారతదేశ చరిత్రలో ఎక్కువకాలం పనిచేసిన ప్రధాన న్యాయమూర్తి. అతని తల్లి ప్రభ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు. డీవై చంద్రచూడ్ ముంబైలోని కేథడ్రల్ అండ్ జాన్ కానన్ స్కూల్, ఢిల్లీలోని సెయింట్ కొలంబస్ స్కూల్ లలో చదివిన తర్వాత, 1979లో సెయింట్ స్టీఫెన్స్ కాలేజ్ (ఢిల్లీ) నుండి ఆర్థికశాస్త్రం, గణితంలో పట్టభద్రుడయ్యారు. 1982లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఫ్యాకల్టీ ఆఫ్ లా నుండి బ్యాచిలర్ ఆఫ్ లాస్ డిగ్రీని, 1983లో హార్వర్డ్ లా స్కూల్ నుండి మాస్టర్ ఆఫ్ లాస్ డిగ్రీని పొందారు. విదేశాలలో గ్రాడ్యుయేట్ విద్యను అభ్యసిస్తున్న భారతీయ పౌరులకు అందించే ప్రతిష్టాత్మకమైన ఇన్‌లాక్స్ స్కాలర్‌షిప్‌పై చదువుకున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుండి జోసెఫ్ హెచ్. బీల్ బహుమతిని అందుకున్నాడు. 1986లో హార్వర్డ్‌లో ఉంటూ డాక్టరేట్ ఆఫ్ జురిడికల్ సైన్స్ పూర్తిచేశారు. ధనంజయ 1982లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించాడు, ఆ సమయంలో యువ లా గ్రాడ్యుయేట్‌లకు ఉన్న కొన్ని ఉద్యోగాలలో ఫాలీ నారిమన్ కోసం కొన్ని బ్రీఫ్‌లను రూపొందించడంతో సహా న్యాయవాదులు, న్యాయమూర్తులకు సహాయం చేసే జూనియర్ న్యాయవాదిగా కొంతకాలం పనిచేశాడు. హార్వర్డ్ నుండి పట్టభద్రుడయ్యాక, చంద్రచూడ్ మొదట సుల్లివన్ అండ్ క్రోమ్‌వెల్ అనే న్యాయ సంస్థలో పనిచేశారు. భారతదేశానికి వచ్చి భారత సుప్రీంకోర్టు, బాంబే హైకోర్టులో న్యాయవాద వృత్తిని అభ్యసించాడు. 1998 జూన్ నెలలో బాంబే హైకోర్టులో సీనియర్ న్యాయవాదిగా నియమించబడ్డారు. ఆ సంవత్సరమే అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాగా నియమితులై, న్యాయమూర్తిగా నియమించబడే వరకు పనిచేశారు.2000 మార్చి 29 నుండి అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యే వరకు బొంబాయి హైకోర్టులో న్యాయమూర్తి పనిచేశాడు. ఈ సమయంలో, మహారాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీకి డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. 2013 అక్టోబరు 31 నుండి 2016 మే 13న భారత సర్వోన్నత న్యాయస్థానానికి నియమితులయ్యే వరకు అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశాడు. 2021 ఏప్రిల్ 24నుండి భారత సుప్రీంకోర్టు కొలీజియంలో భాగమయ్యారు, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా కూడా ఉన్నారు. భారత 50వ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.చంద్రచూడ్ ముంబై విశ్వవిద్యాలయం, యునైటెడ్ స్టేట్స్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఓక్లహోమా కాలేజ్ ఆఫ్ లాలో తులనాత్మక రాజ్యాంగ చట్టం విజిటింగ్ ప్రొఫెసర్‌గా కూడా ఉన్నారు. ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ, డీకిన్ యూనివర్సిటీ, మెల్బోర్న్ లా స్కూల్, హార్వర్డ్ లా స్కూల్, యేల్ లా స్కూల్, హవాయి విశ్వవిద్యాలయంలోని విలియం ఎస్. రిచర్డ్సన్ స్కూల్ ఆఫ్ లా, దక్షిణాఫ్రికాలోని విట్వాటర్‌స్రాండ్ విశ్వవిద్యాలయంలో ఉపన్యాసాలు అందించారు..


### కీలక తీర్పులలో సభ్యునిగా..

రాజ్యాంగపరమైన ప్రశ్నలకు సంబంధించిన విషయాలను వినడానికి ఏర్పాటు చేయబడిన అత్యధిక సంఖ్యలో రాజ్యాంగ ధర్మాసనాల్లో (ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది న్యాయమూర్తులు) బాధ్యతలు నిర్వర్తించారు. సుప్రీంకోర్టులో తన పదవీకాలంలో, భారత రాజ్యాంగ చట్టం, తులనాత్మక రాజ్యాంగ చట్టం, మానవ హక్కులు, లింగ న్యాయం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం, వాణిజ్య చట్టం,ఆధార్ కేసు, క్రిమినల్ చట్టాలపై అనేక తీర్పులు ఇచ్చారు. అయోధ్య భూవివాదం, గోప్యత హక్కు సహా పలు కీలక కేసులపై తీర్పులిచ్చిన ధర్మాసనాల్లో జస్టిస్ డీవై చంద్రచూడ్ సభ్యులుగా ఉన్నారు.

### కీలక ప్రసంగాలు చేసిన డీవై చంద్రచూడ్

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కోసం ఐక్యరాజ్య సమితి హైకమిషన్, అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం, ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ తోసహా ఐక్యరాజ్యసమితి సంస్థలు నిర్వహించిన సమావేశాలలో జస్టిస్ ధనంజయ వక్తగా తన ప్రసంగాలను వినిపించారు. 2018 జూన్ 6న హవాయి సుప్రీం కోర్టు, యూనివర్సిటీ ఆఫ్ హవాయి నిర్వహించిన "మానవ హక్కులలో అంతర్జాతీయ న్యాయ సంభాషణల యుగంలో గ్లోబల్ కాన్స్టిట్యూషనలిజం" అనే పేరుతో ఒక ఉపన్యాసాన్ని అందించారు. భారతదేశంలోని ప్రధాన న్యాయ సంస్థలతోపాటు పౌర సమాజం నిర్వహించిన కార్యక్రమాలలో అనేక ప్రసంగాలు చేశారు.





### సీజేఐగా తండ్రి తీర్పులనే తోసిపుచ్చిన డీవై చంద్రచూడ్

తండ్రి వైవీ చంద్రచూడ్ శివకాంత్ శుక్లా వర్సెస్ ఏడీఎం జబల్‌పూర్ కేసుల్లో తీసుకున్న నిర్ణయాలను కుమారుడు డీవై చంద్రచూడ్ తోసిపుచ్చారు.1976 లో శివకాంత్ శుక్లా వర్సెస్ ఏడీఎం జబల్‌పూర్ కేసులో, గోప్యతను ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు పరిగణించలేమని పేర్కొన్నది. ఈ బెంచ్‌లో అప్పటి సీజేఐ వైవీ చంద్రచూడ్ ఉన్నారు. కాగా, 2017 లో గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తించింది. ఈ బెంచ్‌లో డీవై చంద్రచూడ్ ఉన్నారు. 1985లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్ ధర్మాసనం.. సౌమిత్ర విష్ణు కేసులో ఐపీసీ సెక్షన్ 497ను సమర్థించింది. సంబంధం కలిగి ఉండటానికి ప్రలోభాలకు లోనయ్యే వ్యక్తి పురుషుడే కానీ, స్త్రీ కాదని సాధారణంగా అంగీకరించబడింది అని ధర్మాసనం తన తీర్పులో రాసింది. ఈ నిర్ణయాన్ని 2018 లో జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం రద్దు చేసింది. 'వ్యభిచార చట్టం అనేది పితృస్వామ్య నియమం. లైంగిక స్వయంప్రతిపత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని ధర్మాసనం చెప్పింది.

డీవై చంద్రచూడ్ నేతృత్వంలో కీలక తీర్పులు..

### ఎలక్టోరల్ బాండ్స్ కేసు :

రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల చెల్లుబాటు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల జారీని బ్యాంకులు తక్షణమే నిలిపివేయాలని సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది.రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల వివాదంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. 2018 నుంచి అమలులో ఉన్న ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని కేంద్రం రద్దు చేసింది. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని, ఏకపక్షమని వాదించింది. రాజకీయ పార్టీలు, దాతల మధ్య క్విడ్ ప్రోకో ఏర్పాటుకు దారితీయవచ్చని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ మేరకు జస్టిస్ బిఆర్ గవాయ్, సంజీవ్ ఖన్నా, జెబి పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. ఎలక్టోరల్ బాండ్ల జారీని తక్షణమే నిలిపివేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. అలాగే ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా రాజకీయ పార్టీలు పొందిన విరాళాల వివరాలను ప్రచురించాలని భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

### ప్రైవేటు ఆస్తుల స్వాధీనం :

ప్రైవేటు ఆస్తులను ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొనే విషయంలో సుప్రీంకోర్టు ఇటీవల చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ప్రైవేటు వ్యక్తుల యాజమాన్యంలోని ఆస్తులన్నీ సమాజ ఉమ్మడి వనరులు కాబోవని.. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు వాటిని ఏకపక్షంగా పంపిణీ చేయజాలవని స్పష్టం చేసింది. అయితే, కొన్నింటిలో మాత్రం మినహాయింపు ఉంటుందని 7:2 మెజారిటీతో వెలువడిన తీర్పులో పేర్కొంది.

### అవివాహితల అబార్షన్ హక్కు :

ఒక కేసులో పెళ్లికాని మహిళలకు తమ 20 నుంచి 24 వారాల గర్భాన్ని తొలగించుకోవడానికి జస్టిస్ చంద్రచూడ్ అనుమతించారు. భర్త బలవంతంగా సంభోగంలో పాల్గొని భార్యను గర్భవతిని చేస్తే.. ఆమెకు కూడా 24 వారాల పాటు అబార్షన్ చేసే హక్కు ఉంటుందన్నారు. అబార్షన్ కేసు, చట్టంలో మొదటిసారిగా వైవాహిక అత్యాచారాన్ని గుర్తించారు.

### ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమే :

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించేలా రాజ్యాంగంలోని 'ఆర్టికల్ 370' రద్దు రాజ్యాంగబద్ధమేనని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. ఈ అంశంపై పిటిషనర్ల వాదనను తోసిపుచ్చిన రాజ్యాంగ ధర్మాసనం.. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది.

### 'స్వలింగ' వివాహాల చట్టబద్ధతకు 'నో'

స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత కల్పించే అంశాన్ని సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చుతూ సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం నాలుగు వేర్వేరు తీర్పులను ఇచ్చింది. LGBTQIA+ కమ్యూనిటీకి చెందిన వ్యక్తుల వివాహానికి సమానత్వ హక్కులు ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ.. వారు సహజీవనంలో ఉండొచ్చని తెలిపింది. అంతేగాక, స్వలింగ సంపర్క జంటలపై ఎలాంటి వివక్ష చూపించొద్దని, వారి హక్కులను కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

### జైళ్లలో కుల వివక్ష :

జైళ్లలో ఖైదీల మధ్య కులవివక్ష చూపడం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఖైదీలతో ఆయా రాష్ట్రాలు ప్రవర్తిస్తున్న తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. కారాగారంలో కులం ఆధారంగా వివక్ష, పని విభజన ఉందంటూ ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం..కులవివక్ష చూపడం సరికాదని పేర్కొంది.

### సెక్షన్ 6ఎ :

పౌరసత్వ చట్టం 1955లోని సెక్షన్ 6ఎ రాజ్యాంగ బద్ధతను సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది. సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం 4:1 మెజార్టీతో తీర్పును వెలువరించింది.

### రామమందిరంపై సంచలన తీర్పు:

500 ఏళ్ల చరిత్ర కలిగిన అయోధ్యలోని రామజన్మ భూమి కేసులో ఆయన సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం చేస్తూ 2019లో తీర్పు ఇచ్చారు. 5 మందితో కూడిన న్యాయమూర్తుల బెంచ్ ఈ తీర్పు ఇవ్వగా.. ఇందులో డివై చంద్రచూడ్ ఒకరు. ఆ సమయంలో ఆయన ప్రధాన న్యాయమూర్తిగానే కాకుండా ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్న బెంచ్‌లో భాగమయ్యారు. ఇది దేశ చరిత్రను మార్చబోతోందని ఈ సందర్భంగా చంద్రచూడ్ వ్యాఖ్యానించారు.

### ఎస్సీ వర్గీకరణ:

ఎస్సీలలో ఉపవర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు 2024 ఆగస్టు 1న సంచలన తీర్పు చెప్పింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 మెజార్టీతో ఈ తీర్పు చెప్పింది. ధర్మాసనంలోని ఆరుగురు న్యాయమూర్తులు ఈ వర్గీకరణను సమర్థించగా, ఒకరు వ్యతిరేకించారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పుచెప్పడం ద్వారా ఎస్సీ కోటాలో ఉప వర్గీకరణ ఉండదని 2004లో ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్ ఇచ్చిన తీర్పును ధర్మాసనం తోసిపుచ్చింది. ఎస్సీ వర్గంలోని రెండు కులాలకు సగం సీట్లలో తొలి ప్రాధాన్యం ఇస్తూ తెచ్చిన చట్టాన్ని పంజాబ్ ప్రభుత్వం 2006లో ఆమోదించింది. షెడ్యూల్డ్ కులాలకు సగం సీట్లను రిజర్వ్ చేసే మునుపటి చట్టాన్ని పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు కొట్టివేయడంతో ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. షెడ్యూల్డ్ కులాల్లో ఉప కులాలను 'హోమోజీనస్ క్లాస్' (ఒకే సమూహంగా భావించలేమని) కాదని, వారి జనాభా గణాంకాలు, సామాజిక ఆర్థిక పరిస్థితుల వంటి డేటా ఆధారంగా రాష్ట్రాలు వర్గీకరించవచ్చని జస్టిస్ చంద్రచూడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను అమలు చేస్తున్న పంజాబ్, తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాల చట్టాలను కోర్టు సమర్థించింది.

### కార్యాలయంలో లైంగిక వేధింపులు:

కార్యాలయంలో లైంగిక వేధింపులకు సంబంధించి తీర్పును ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వెలువరించింది. ఇది మహిళల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని ధర్మాసనం పేర్కొంది. ఇది మహిళలను పని చేయడానికి ఎలా ప్రోత్సహిస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది.

### ఢిల్లీ ప్రభుత్వం vs కేంద్రం:

ఢిల్లీ ప్రభుత్వ పరిపాలన, అధికారుల వివాదం, బదిలీ పోస్టింగ్‌పై ఎవరి తుది నిర్ణయం చెల్లుబాటు అవుతుందనే దానిపై సుప్రీంకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది. దీనిపై కోర్టు తన పరిధిలోకి వచ్చే ఇలాంటి కేసులపై నిర్ణయం తీసుకునే హక్కు ఢిల్లీలోని ఎన్నికైన ప్రభుత్వానికి మాత్రమే ఉందని పేర్కొంది.

### మతం మారడం అనేది గోప్యత హక్కు:

కేరళకు చెందిన ప్రముఖ హదియా వివాహ కేసులో తీర్పు వెలువరించిన ధర్మాసనంలో డీవై చంద్రచూడ్ కూడా ఉన్నారు. ఒక అమ్మాయి మేజరైతే ఆమె ఎవరిని పెళ్లి చేసుకోవాలనేది ఆమె హక్కు అని బెంచ్ పేర్కొంది. అంతేకాకుండా తన మతాన్ని ఇష్టపూర్వకంగా మార్చుకున్నట్లయితే దానికి ఎవరూ అభ్యంతరం చెప్పలేరని పేర్కొన్నారు. మతం మారడాన్ని గోప్యత హక్కుగా ఆయన పేర్కొన్నారు.

### శబరిమలలో మహిళల ప్రవేశం:

కేరళలోని ప్రతిష్టాత్మకమైన శబరిమల ఆలయంలోకి రుతుక్రమం ఉన్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని వ్యతిరేకిస్తూ తీర్పు వెలువరించిన తీర్పుపై చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని అనేక ఆర్టికల్స్ దీనిని నిషేధించాయి. అలాంటి పద్ధతిని కొనసాగించడం తప్పు అని అన్నారు.

### అర్నాబ్ గోస్వామికి బెయిల్:

సీనియర్ జర్నలిస్టు అర్నాబ్ గోస్వామి అరెస్ట్ విషయంలో కూడా జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కోర్టు అతనికి బెయిల్ మంజూరు చేస్తూ ఈ విషయాన్ని నొక్కి చెప్పింది. ప్రైవేట్ వ్యక్తులు, వ్యవస్థలు కాకుండా కోర్టులు మాత్రమే ఈ విషయంలో నిర్ణయాలు తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. వారు బెయిల్ దరఖాస్తులపై సకాలంలో నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

### బుల్డోజర్ చర్యపై తన ముద్ర:

యూపీ ప్రభుత్వ బుల్‌డోజర్ చర్యపై సుప్రీంకోర్టు పెద్ద తీర్పునిచ్చింది. మీరు ఇలా ప్రజల ఇళ్లను కూల్చివేయడం ఎలా ప్రారంభిస్తారని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒకరి ఇంట్లోకి చొరబడడం అరాచకం. ఇది పూర్తిగా ఏకపక్షం. మా వద్ద అఫిడవిట్ ఉందని, ఎలాంటి నోటీసు జారీ చేయలేదని, మీరు సైట్‌కి వెళ్లి ప్రజలకు తెలియజేశారని ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. తుది నిర్ణయం వచ్చే వరకు బుల్డోజర్ చర్యను నిషేధించడమే కాకుండా కూల్చివేస్తే నష్టపరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు కోరింది. ఇల్లు కూలిన వ్యక్తికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని చంద్రచూడ్ తీర్పు ఇచ్చారు.

### డ్రైవింగ్ లైసెన్స్ విషయంలో:

లైట్ మోటర్ వెహికల్ అంటే ఎల్‌ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వ్యక్తులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 7500 కిలోల కంటే తక్కువ బరువున్న ఎల్‌ఎంవి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నారని పేర్కొంది. రవాణా వాహనాన్ని నడపడానికి అర్హులు. దీని ఆధారంగా బీమా కంపెనీలు బీమా క్లెయిమ్‌లను తిరస్కరించలేవని ధర్మాసనం పేర్కొంది.

### ఒమర్ ఖలీద్ బెయిల్ పై స్పష్టత:

ఉమర్ ఖలీద్, స్టాన్ స్వామి, జీఎన్ సాయిబాబాలకు బెయిల్ అంశంలోనూ చంద్రచూడ్ కీలకంగా వ్యవహరించారు. మావోయిస్టులతో సంబంధాల ఆరోపణలతో అరెస్టయిన ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబాకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 90 శాతం అంగవైకల్యంతో వీల్ చైర్‌కే పరిమితమైన సాయిబాబా పట్ల మహారాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును తప్పుబట్టింది.

### మదర్సాలు చట్టబద్ధమే :

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఏర్పాటైన 16వేలకు పైగా మదర్సాబడులు చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ పాఠశాలలు లౌకికవాద సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. దీంతో యూపీలోని మదర్సాలలో చదువుకునే లక్షల మంది విద్యార్థులకు ఊరట లభించింది.

### సీజేఐగా చివరి తీర్పు :

జస్టిస్ డీవై చంద్రచూడ్ తన లాస్ట్ వర్కింగ్‌డే రోజు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి మైనార్టీ హోదా విషయంలో కీలక తీర్పు వెలువరించారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నాలుగు రకాల తీర్పులను వెలువరించింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని ఏడుగురు ధర్మాసనం ఈ తీర్పుల గురించి

తెలిపింది. ఏఎంయూ కేసులో నాలుగు రకాల అభిప్రాయాలు ఏర్పడ్డాయని, దీంట్లో మూడు రకాల వ్యతిరేక తీర్పులు ఉన్నట్లు సీజే చంద్రచూడ్ తెలిపారు. మెజారిటీ తీర్పు తనతో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రా రాసినట్లు సీజే వెల్లడించారు. జస్టిస్ సూర్యకాంత్, దీపాంకర్ దత్త, సతీశ్ చంద్ర శర్మలు సపరేట్ తీర్పులను ఇచ్చినట్లు జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు.విద్యా సంస్థ నియంత్రణ, పరిపాలన విషయంలో పార్లమెంట్‌లో చట్టం చేసినా.. ఆ విద్యాసంస్థకు ఉన్న మైనార్టీ హోదాను రద్దు చేయరని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. పార్లమెంట్ చట్టంతో అలీఘడ్ ముస్లిం వర్సిటీ మైనార్టీ హోదా రద్దు అయినట్లు 1968లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టిపారేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ తెలిపారు. అడ్మినిస్ట్రేషన్‌లో మైనార్టీ సభ్యులు లేనంత మాత్రాన.. ఆ వర్సిటీ మైనార్టీ హోదా పోదు అని సుప్రీంకోర్టు చెప్పింది.

### కొన్ని సందర్భాల్లో న్యాయవాదులపై ఆగ్రహించిన చంద్రచూడ్..

కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటనపై సుప్రీంలో విచారణ జరుగుతున్న సమయంలో ఓ లాయర్ తన వాదనలు వినిపిస్తూ బిగ్గరగా అరిచారు. అప్పుడు చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకున్నారు. స్వరాన్ని తగ్గించుకోవాలంటూ ఆ లాయర్‌కు వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఆ లాయర్ క్షమాపణలు చెప్పారు.

### 'లాయర్లకు అవగాహన ఉందా లేదా?'

డీవై చంద్రచూడ్ ఒక సందర్భంలో ఒక న్యాయవాదిని మందలించారు. కోర్టు మాస్టర్ నుంచి ఆర్డర్ గురించి సమాచారం తీసుకున్నట్లు సుప్రీంకోర్టులోని ఒక న్యాయవాది చెప్పడంతో, చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ మండిపడ్డారు. “కోర్టులో నేను ఏ ఉత్తర్వు ఇచ్చానో కోర్టు మాస్టర్‌ని అడగడానికి మీకు ఎంత ధైర్యం? రేపు నువ్వు నా ఇంటికి వచ్చి నా పర్సనల్ సెక్రటరీని నేను ఏం చేస్తున్నావని అడుగుతావా? న్యాయవాదులకు అవగాహన ఉందా లేదా?” అని మండిపడ్డారు.

### జస్టిస్ చంద్రచూడ్‌లో ఒక ప్రత్యేకత ఏమిటంటే..

ఆయన ముఖంలో ఎప్పుడూ మృదువైన చిరునవ్వు ఉంటుంది. పేరున్న లాయర్లతో సమానంగా జూనియర్ లాయర్ల పట్ల కూడా గౌరవంగా వ్యవహరిస్తారు. ఒక కేసును కొట్టివేసేటప్పుడు కూడా మర్యాదపూర్వక స్వరంలో లాయర్‌కి కారణాన్ని వివరంగా వివరించడం ఆయన ప్రత్యేకత.కరోనా కాలంలో ఆక్సిజన్, మందుల లభ్యతపై జస్టిస్ చంద్రచూడ్ అనేక ఆదేశాలు ఇచ్చారు. ఆయన కరోనా సోకినా కూడా ఇంటి నుంచి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణకు హాజరయ్యారు. కొద్దిరోజుల క్రితం రాత్రి 10గంటల వరకు కోర్టు కార్యకలాపాలు నిర్వహించి.. ఆ రోజు తన ముందున్న కేసులన్నింటినీ పరిష్కరించారు.

### కొలీజియంపై చంద్రచూడ్ అభిప్రాయం ముఖ్యమైనది:

జాతీయ న్యాయ కమిషన్ వర్సెస్ కొలీజియం చర్చకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ కూడా ముఖ్యమైన అభిప్రాయాన్ని తెలిపారు. కొలీజియం వ్యవస్థ అని ఆయన అన్నారు. పూర్తిగా పారదర్శకంగా ఉంటుంది. కొలీజియం వ్యవస్థ పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. సుప్రీంకోర్టుకు జడ్జిని సిఫార్సు చేస్తున్నప్పుడు హైకోర్టులో ఆయన కెరీర్ ఎలా ఉందో చూస్తున్నామని అన్నారు. నా స్వాతంత్ర్యంపై ప్రశ్నలు తలెత్తాయి చంద్రచూడ్ జస్టిస్ చంద్రచూడ్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. 'న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం ఉండటం అంటే ఎల్లప్పుడూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వాలని కాదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇస్తే నేను స్వేచ్ఛగా ఉన్నాను.. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇస్తే నేను అవినీతికి పాల్పడ్డాను అనే ప్రశ్నలు లేవనెత్తారు. మీడియా ద్వారా న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకురావడం సరైనది కాదు. కొన్ని వర్గాలు తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకోనప్పుడు న్యాయవ్యవస్థలో ప్రభుత్వ జోక్యం ఉందన్న కథనాన్ని ప్రచారం చేయడం దారుణం అని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు.



పోతుగంటి వెంకటరమణ
బ్యూరో చీఫ్, విశ్వంభర దినపత్రిక

# హైదరాబాద్‌లో 16వ ఎడిషన్ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో



**విశ్వంభర, హైదరాబాద్:** దక్షిణాసియాలోనే అతిపెద్ద, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ పౌల్ట్రీ ప్రదర్శన అతి త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ "16వ సంచిక పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో-2024" ను నవంబర్ 27 నుంచి 29, 2024 వరకు నిర్వహించనున్నట్లు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ)/ పౌల్ట్రీ ఇండియా వెల్లడించాయి. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ కాంప్లెక్స్‌లో జరుగుతుంది. దీనికి అనుబంధంగా ముందు రోజు నవంబర్ 26, 2024న హోటల్ నోవాటెల్ (ఎచ్ఐసీసీ) హైదరాబాద్ నందు నాలెడ్జ్ డే టెక్నికల్ సెమినార్ ఉంటుంది. "అన్‌లాకింగ్ పౌల్ట్రీ పొటెన్షియల్" అనే అంశంపై నెట్‌వర్కింగ్, విజ్ఞానాన్ని పంచుకునేందుకు, అంతర్జాతీయ పౌల్ట్రీ పరిశ్రమలో వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శించడానికి ఈ అంతర్జాతీయ పౌల్ట్రీ పరిశ్రమ ఒక వేదిక కానుంది. 50కి పైగా దేశాల నుంచి సుమారు 400 మంది ప్రదర్శకులు ఇందులో పాల్గొనే అవకాశం ఉంది. కోళ్ళ పరిశ్రమ రైతులు, ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ఇంటిగ్రేటర్లు, ప్రపంచ పౌల్ట్రీ నిపుణులు సహా దాదాపు 40,000 మంది సందర్శకులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. దక్షిణాసియాలో అతిపెద్ద పౌల్ట్రీ ప్రదర్శనగా ఈ సంవత్సరం పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో.. కోళ్ళ పరిశ్రమ నిర్వహణ, ఆరోగ్యం, పోషణ, ఉత్పత్తి సాంకేతికతలలో తమ ఆవిష్కరణలను ప్రదర్శించడానికి జాతీయ, అంతర్జాతీయ, ప్రదర్శనకారులను ఒక్క చోటకి చేర్చుతోంది. ఈ ప్రదర్శనను 27,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఆరు ఎగ్జిబిషన్ హాళ్లలో ఏర్పాటు చేయనున్నారు. ఉదయ్ సింగ్ బయాస్, ఐపీఈఎంఏ/ పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు, భారతదేశంలో పౌల్ట్రీ పరిశ్రమకు పెరుగుతున్న ప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పారు. భారతదేశ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధి, పోషకాహార సంక్షేమానికి మూలస్తంభమైన పౌల్ట్రీ రంగానికి అండగా నిలవాలని మరియు బలోపేతానికి కృషి చేయాలని లక్షలాది పౌల్ట్రీ రైతుల తరపున ప్రభుత్వానికి ఐపీఈఎంఏ విజ్ఞప్తి చేస్తోంది. ఏటా ఆర్థిక వ్యవస్థకి రూ. 1.35 లక్షల కోట్ల సహకారాన్ని, లక్షలాది మందికి అవసరమైన ప్రొటీన్‌లను అందిస్తున్న పౌల్ట్రీ పరిశ్రమ.. ముడిసరుకు వ్యయాలు పెరగడం, ముఖ్యంగా మొక్కజొన్న, సోయా వంటి దాణా ఉత్పత్తులకుబీ సోయా మీల్, పౌల్ట్రీ పరికరాలపై జీఎస్టీ భారం కారణంగా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ధరలను స్థిరీకరించడానికి, అందుబాటు ధరలో దాణా లభ్యతకు, ప్రాధాన్యతా రంగ రుణ పరిమితిని విస్తరించడం ద్వారా రుణాలను మరింత సులువుగా పొందేలా వీలు కల్పించేందుకు తక్షణ విధానపరమైన జోక్యాలు అవసరం, ఆర్థిక ఒత్తిడిని తగ్గించడానికి సోయా మీల్, ప్రాసెసింగ్ మెషినరీపై జీఎస్టీ మినహాయింపు, రబీ మొక్కజొన్న సాగు పెంచడం, దాణా వ్యయాలను స్థిరీకరించడానికి ఇథనాల్ ఉత్పత్తి కోసం చేస్తున్న మొక్కజొన్న దిగుమతులను నియంత్రించాలని కోరుతున్నాము అని అన్నారు. ఐపీఈఎంఏ నిర్వహిస్తున్న 16వ విడత పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో %-% 2024.. విజ్ఞానం, ఆవిష్కరణలను పంచుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులను ఒక్క చోటకి చేర్చడం ద్వారా పౌల్ట్రీ నిపుణులకు ఒక ప్రధాన కేంద్రంగా మారుతుంది. పౌల్ట్రీ సైన్స్, ఫీడ్ ఎక్విప్‌మెంట్, బ్రీడింగ్ టెక్నాలజీస్, యానిమల్ హెల్త్ సొల్యూషన్స్, పోషకాల పరిశోధనలో అత్యంత అధునాతన మార్పులకు ప్రదర్శనగా ఉపయోగపడుతుంది. అవగాహన, ఆవిష్కరణల ద్వారా పౌల్ట్రీ పరిశ్రమను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తూనే.. పౌల్ట్రీ నిర్వహణ, ఉత్పత్తిలో ఉత్తమ ప్రమాణాలు, వినూత్న ధోరణులను అన్వేషించడానికి ఒక ప్రధాన వేదికగా నాలెడ్జ్ డే టెక్నికల్ సెమినార్ నిలుస్తుందని అన్నారు.

## ఛట్ పూజలో పాల్గొన్న దేవేందర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్



**విశ్వంభర, కొత్తూరు:** ఉత్తర్ రాష్ట్ర ప్రాంతాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, జార?ండ్ రాష్ట్ర ప్రజలు కార్తీక మాసంలో నిర్వహించే పూజా వేడుకలు కొత్తూర్ లో జరిగాయి. కొత్తూర్ లో నిర్వహించిన ఛట్ పూజలో దేవేందర్ యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, శివ చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చట్ పూజ విశిష్టతను వారిని అడిగి తెలుసుకున్నారు. ఉత్తర రాష్ట్ర ప్రజలు చేసుకునే అతి పవిత్రమైన చాట్ పూజలో తాను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రపంచానికి వెలుగు ప్రసాదించే ఆ సూర్యభగవానున్ని ప్రార్థించడమే చట్ పూజ ప్రత్యేకత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర రాష్ట్ర పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పంచకూట శివాలయ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న చల్లా దంపతులు



**విశ్వంభర, ఆత్మకూరు:** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండల కేంద్రంలోని పంచకూట పార్వతీదేవి సమే మహాదేవ స్వామి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవంలో పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి జ్యోతి దంపతులు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతుల కళ్యాణోత్సవానికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితులు చల్లా దంపతులకు ఆశీర్వచనం చేయగా, ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. 11వ శతాబ్దపు కాలం నాటి ఈ ఆలయాన్ని పునః నిర్మాణం చేయాలనే సంకల్పంతో 5 ఏండ్లు కృషిచేసిన ఆలయ పునః నిర్మాణ కమిటీని అభినందించారు. సహకరించిన దాతలకు, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ పరమేశ్వరుని దీవెనలతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీశ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కోడి శ్రీనివాసులును సన్మానించిన రాష్ట్ర ప్రయివేట్ పాఠశాలల సమాఖ్య

అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం



**విశ్వంభర, చండూరు :** సామాజిక సేవ రంగంలో ముందుంటూ, ఇటీవల కాలంలో మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు-2024 ను అందుకున్న గాంధీజీ ఫౌండేషన్ మరియు గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులును శుక్రవారం నాడు స్థానిక గాంధీజీ విద్యాసంస్థల యందు రాష్ట్ర ప్రైవేట్ పాఠశాల సమాఖ్య ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాధ్యులు శ్రీపతి శేఖర్ రెడ్డి, గోపిడి నారాయణరెడ్డి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు ఏ సమస్యలు వచ్చిన తన సమస్యగా భావించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ.. విద్యాసంస్థలను నిర్వహిస్తూ సామాజిక సేవా రంగంలో ముందుంటూ, మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు 2024ను సాధించడం గర్వంగా భావిస్తున్నామని, మునుముందు మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గంట్ల అనంతరెడ్డి, పుచ్చకాయల వెంకటరెడ్డి, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గోన వెంకటేశ్వరరావు, కోశాధికారి మట్ట చెన్నయ్య గౌడ్, దయాకర్ రెడ్డి, సత్యం, శ్రీనివాస్, యోగేశ్వరరావు, నల్లగొండ ఉపాధ్యక్షులు శిరంశెట్టి శ్రీధర్ బాబు, నల్లగొండ టౌన్ అధ్యక్షులు అజీజ్, జవహర్, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డి, సూర్యాపేట ప్రధాన కార్యదర్శి పగడాల ఉపేందర్ రెడ్డి, ఎలినేని రాధాకృష్ణ, యాదాద్రి భువనగిరి ప్రధాన కార్యదర్శి మిర్యాల దుర్గాప్రసాద్, సింగిరెడ్డి ప్రభాకర్, సరికొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## జడ్జీలు, న్యాయవాదుల అవగాహన ర్యాలీ

- లోక్ అదాలత్ ను ఉపయోగించుకోండి
- రాజీమార్గమే రాజ మార్గం




**విశ్వంభర, మహబూబాబాద్:** లోక్ అదాలత్ ను ఉపయోగించుకోండి కేసులను రాజీ చేసుకోండి, రాజీమార్గమే రాజ మార్గమనే నినాదాలు గల ప్లకార్డులు చేబూని మహబూబాబాద్ కోర్టుకు చెందిన జడ్జీలు, న్యాయవాదులు కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు సిబ్బంది జిల్లా కోర్టు ప్రాంగణము నుండి కూరగాయల మార్కెట్, రైల్వే స్టేషన్, నెహ్రూ చౌరస్తా మీదుగా తాసిల్దార్ కార్యాలయం అక్కడి నుండి తిరిగి కోర్టు వరకు నవంబరు 9న జరుగు జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జడ్జి సురేష్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఉచిత న్యాయవాదులను నియమిస్తూ వారికి న్యాయసహాయం అందించి ఆదుకోవడం జరుగుతుందని, అదే విధంగా దిక్కు లేని జైల్లలో మగ్గుతున్న అనేకమంది ఖైదీలకు ఉచితంగా న్యాయవాదులను నియమించి వారిని జైల్లో నుండి విడిపించడం జరుగుతుందని, జాతీయస్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి లోక్ అదాలత్ లు నిర్వహించి వేలల్లో కేసులను పరిష్కరించి ముద్దాయిలకు విముక్తి కల్పించడమే గాక అనేక రకాల సేవలను అనగా ఆన్లైన్లో దరఖాస్తులను స్వీకరించడం, ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 15100 ద్వారా బాధితులకు న్యాయ సలహాలు, న్యాయ సహాయము అందించడం వంటి సేవలను అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ చూరగొన్న జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ దినోత్సవాన్ని జిల్లా న్యాయ సేవా సమితి వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది వెంకటస్వామి, సీనియర్ న్యాయవాది కొంపెల్లి వెంకటయ్య, మహబూబాబాద్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవేందర్, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది మొదలైన వారు పాల్గొన్నారు.

## సొంతనిధులతో సూర్యభగవాన్ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

- దేశంలోనే అత్యంత భారీ స్థాయిలో సూర్య దేవాలయం నిర్మాణం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**విశ్వంభర, పటాన్ చేరు:** ఉత్తర భారతీయుల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, గతంలో ఇచ్చిన హామీ మేరకు రెండు కోట్ల రూపాయల సొంత నిధులతో పటాన్ చేరు సాకి చెరువు కట్టపైన అత్యంత సుందరంగా, అన్ని సౌకర్యాలతో సూర్య భగవాన్ దేవాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఉత్తర భారతీయులు సూర్య భగవానుడిని ఆరాధిస్తూ నిర్వహించే చట్ పూజ ఉపవాస దీక్షల ముగింపు సందర్భంగా పటాన్ చేరు పట్టణంలోని సాకి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.ఎం.ఆర్ ముఖ్యఅతిథిగా హాజరై సూర్య భగవానుడి దేవాలయం నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పటాన్చెరు ప్రాంతం నిలుస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో నివసిస్తున్న ఉత్తర భారతీయుల సంక్షేమానికి, ఆర్థిక అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో తగు ప్రాధాన్యత అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ వారి అభివృద్ధికి అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయ కుమార్, గూడెం విక్రం రెడ్డి, పృథ్వీ రాజ్, శ్రీధర్ చారి, సందీప్ శా, కిషన్, సంజయ్ సింగ్, ఉత్తర భారతీయులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరుల ఆశయ సాధనకై ఉద్యమిద్దాం

- సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పిలుపు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కొరివి మండలం బంచరాయి తండాలో అమరవీరుల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. అమరుల అమరవీరుల ఆశయ సాధనకై ఉద్యమిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మండల వెంకన్న పిలుపునిచ్చారు. 2024 నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల సంస్మరణ సభ ల వారోత్సవం లో భాగంగా అమరుల సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యం లో కురవి మండలం బంచరాయి తండా గ్రామంలోని కామ్రేడ్ వాంకుడోత్ హచ్చు స్మారక స్తూపం వద్ద గ్రామ సీనియర్ నాయకులు భూక్య హత్య, కామ్రేడ్ రుణావత్ నునవత్ లింగ్యా స్మారక స్తూపం వద్ద గ్రామ కార్యదర్శి కామ్రేడ్ బానోతు రూప్లా లు జెండాలు ఎగురవేశారు. అనంతరం జరిగిన సభకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా నాయకులు కామ్రేడ్ సామ పాపయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ మండల వెంకన్న మాట్లాడుతూ భూమి భుక్తి ముక్తి కోసం సాగుతున్న విప్లవ ఉద్యమంలో నవంబర్ మాసంలోనే అనేకమంది అమర వీరులు రాజ్యం చేతిలో బూటకపు ఎన్కౌంటర్ల పేరా, మాఫియాలు గుండాల చేతిలో, రివిజనిస్టుల, అతివాదుల చేతిలో అనేకమంది అమరులయ్యారు. పీడిత ప్రజల రాజ్యం రావాలని లక్ష్యంతో సాగుతున్న విప్లవ ఉద్యమంలో అమరులైన వారి ఆశయం తుద కంట ముందుకు తీసుకుపోతామని స్మరించుకుంటూ సంస్మరణ సభలను నిర్వహిస్తున్నామని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు ఊడగం చేస్తూ పేద ప్రజలను విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను బహుళ జాతి కంపెనీలకు దారా దత్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంట్ల పేరుతో అధికారంలోకి నేటికీ సంవత్సరం పూర్తి కావస్తున్నా వాటి అమలుకు పూనుకోవడం లేదని, ఏ పాలకవర్గ పార్టీ అయినా ప్రజల్ని వంచించి మోసం చేయడం తప్ప ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలం అవుతున్నాయని విమర్శించారు. దేశంలోని విప్లవకర పరిస్థితిలు ముందుకు వస్తున్నాయని, అందుకు పాలకవర్గాల నియంతృత్వమే కారణమని, అందుకోసం విప్లవకారులు ఐక్యతతో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ హలావత్ లింగన్న, జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్, డివిజన్ నాయకులు బానోతు లచ్చిరాం గ్రామ నాయకులు హోఫ్లా, కేస్లి, సూక్యా, తావు భిక్రీ, అనసూయ వీరన్న బిచ్చ, వెంకన్న, భీమా, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో దొంగల బీభత్సం



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లోని దుబ్బగూడెం (మజీద్ పల్లి) లో దొంగలు బీభత్సం చేశారు. దుబ్బగూడెం కు చెందిన బద్ది లక్ష్మి ఇంట్లో గత రెండు రోజుల క్రితం దొంగలు పడ్డారు. బద్ది లక్ష్మి నాలుగు రోజుల క్రితం మంచిర్యాల బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి రాగా, ఇంటి వెనుకలో ఉన్న డోర్ తీసి ఉండటం తో అనుమానం వచ్చి బీరువాను చూడగా, బీరువా తాళం పగుల కొట్టి ఉంది. అందులో చూడగా 80 తులాల వెండి, అరతులం బంగారం, 22 వేల నగదు పోయింది. కాళేశ్వరం ఎస్ ఐ చక్రపాణి కి తెలుపడం తో సంఘటన స్థలం పరిశీలన చేసి, కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో భూపాలపల్లి జిల్లా ఫింగర్ ప్రింట్ బ్యూరో టీమ్ రాజ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం వచ్చి ఫింగర్ ప్రింట్స్ లు తీసుకున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ సి. నారాయణ రెడ్డి ఆకస్మితిగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ తో మాట్లాడుతూ ఆస్పత్రి ముందు, ఆసుపత్రి పార్కింగ్ ఏరియా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఆసుపత్రిలో ఓపీ సేవలను పరిశీలించారు. ఇన్ వార్డు పేషంట్లను, డయాలసిస్ సెంటర్ ను సందర్శించారు. ఆసుపత్రిలోని ప్రతి ఒక్క సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లకు మెరుగైన సేవలు అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డికి తెలియజేశారు. ప్రతినెలా షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 300 కాన్పులు అయ్యేటట్లుగా చూడాలని చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలను ఆస్పత్రిలో ఇంప్రూవ్ చేయాలని తెలియజేశారు. ఆరోగ్యశ్రీ సేవలను మెరుగుపరచడానికి ఆరోగ్యశ్రీ కింద వచ్చే ఫండ్ ను ఉపయోగించుకోమని చెప్పారు. తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ కి ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లకు కావలసిన యొక్క పరీక్షల నిమిత్తం ఎక్కువ శాంపిల్స్ ని కలెక్ట్ చేసి పంపాలని చెప్పారు. ఆస్పత్రుల్లో మందుల కొరత ఉందని సూపరింటెండెంట్ తెలియచేసినప్పుడు, ఆసుపత్రి డెవలప్మెంట్ సొసైటీ లో ఉన్న డబ్బుల నుండి ఎమర్జెన్సీ మెడిసిన్ కొనమని తెలియచేశారు. కలెక్టర్ సూపరింటెండెంట్ తో మాట్లాడుతూ నేను మళ్ళీ వచ్చేనెల ఆసుపత్రి విజిట్ చేసేసరికి ఆసుపత్రిలో అన్ని సేవలు మెరుగు పర్చి చూపించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ డివిజన్ ఆర్డీఓ సరిత, ఎమ్మార్వో పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, షాద్ నగర్ స్పెషల్ ఆఫీసర్ వెంకట్, ఆస్పత్రి సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఆస్పత్రి వైద్య అధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు, ఆస్పత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

## కొండారెడ్డిపల్లిలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

హాజరైన జిల్లా కలెక్టర్ సంతోష్, ఎనుముల కృష్ణారెడ్డి



**విశ్వంభర, కల్వకుర్తి:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామమైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి శుక్రవారం నాగర్ కర్నూలు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ కు వేద పండితులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామంలో వారి స్వంత నిధులతో ఆంజనేయ స్వామి ఆలయాన్ని అత్యంత అద్భుతంగా పున్నర్ నిర్మించి నేడు నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన సొంత నిధులు రూ.3 కోట్లతో పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారనీ, గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాలను మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. శుక్రవారం ఆలయ గర్భగుడిలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. వేద పండితులు మంత్రోచ్ఛారణలతో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా కనుల పండుగగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణారెడ్డి, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే పెండింగ్ బిల్లు చెల్లించండి



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు గత సంవత్సరం ఆరు నెలల నుండి బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో మహబూబాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ బాధ్యులు మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ కి కాంట్రాక్టర్లకు బకాయి పడిన బిల్లులు వెంటనే చెల్లించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోయినపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ గత సంవత్సరం ఆరు నెలల నుండి మున్సిపాలిటీలో పని చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని వెంటనే సదరు బిల్లులను చెల్లించాలని మహబూబాద్ మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి మరియు 14 ఫైనాన్స్ 15 ఫైనాన్స్ ఎస్ డి ఎఫ్ టీఎఫ్ఐడీసీ జనరల్ ఫండ్ గ్రాండ్స్ ద్వారా పనిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాక ఆఫీస్ చుట్టూ చెప్పులు అరిగెల తిరుగుతున్నారని కాంట్రాక్టర్లు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి వడ్డీలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్టర్లకు బకాయి పడ్డ బిల్లులు 15 రోజులలో చెల్లించాలని, లేనట్లయితే మహబూబాబాద్ మున్సిపాలిటీలో నిరవధికంగా కాంట్రాక్టర్లు పనులు నిలుపుదల చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాద్ మున్సిపాలిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ బాధ్యులు రావుల సతీష్ రెడ్డి, మారినేని రఘు, రామకృష్ణారెడ్డి, ఉపేందర్, గోగుల రాజు, రాజేష్, సమద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా అందరూ బాధ్యత వహించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అలాగే బాధ్యతగా మెలగాలని మహాదేవపూర్ సమీకృత సలహా పరీక్ష కేంద్రం (ఐసీటీసీ) కౌన్సిలర్ గాదె రమేష్ అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాళేశ్వరం పీ హెచ్ సీ వైద్యాధికారిని డాక్టర్ సుస్మిత అధ్యక్షతన ఆశ డే సందర్భంగా ఏఎన్ఎం లకు, ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చాప కింద నీరు లాగా ఎయిడ్స్ వ్యాపిస్తుందన్న విషయాన్ని గ్రహించి, ఆ వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలను పాటించాలని ఐసీటీసీ కౌన్సిలర్ గాదె రమేష్ సూచించారు. రిస్క్ పాపులేషన్ సమూహాలైన ట్రక్ డ్రైవర్లు కాళేశ్వరం ప్రాంతానికి ఇతర పట్టణాల నుంచి ఇసుక క్వారీల వద్దకు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో హెచ్ఐవీ ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల గ్రామాల్లో సాధారణ ప్రజానీకం తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రతి గర్భిణీ స్త్రీ రక్త పరీక్షలను చేయించుకోవాలని అన్నారు. టీబీ, సుఖరోగాలు ఇతర అవకాశవాద రోగాలు కలిగిన వ్యక్తులు హెచ్ఐవీ బారిన పడే పరిస్థితులు అధికంగా ఉన్న తరుణంలో, ముందస్తుగా రక్త పరీక్షలు చేయించుకోవాలని, అలాగే తగిన జాగ్రత్తలను పాటించాలని సూచించారు. హెచ్ఐవీ పాజిటివ్ బాధిత వ్యక్తులను సమాజంలో అందరి మాదిరిగానే వారిని ఆదరించాలని కోరారు. హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తుల కుటుంబ సభ్యులు రక్త పరీక్షలను చేయించుకోవాలని కోరారు. హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తులు ఏ ఆర్ టీ మందులను క్రమం తప్పకుండా వాడుకోవాలని సూచించారు. అనుమానాలు సందేహాల నివృత్తికి 1097 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి కూడా సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత, ఎంఎల్ హెచ్ పీ డాక్టర్ రమ్య, పీ హెచ్ ఎన్ సూపర్వైజర్ నీరజ, హెల్త్ అసిస్టెంట్ ఆడప రాజా రమణయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వెల్దండ మండలంలో సీఎం సతీమణికి తిరుపతి ప్రసాదం అందజేత

# ఘనంగా రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు


కడ్తాల్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో..

**రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ శ్రేణులు ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల రేవంత్ చిత్రాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పాలాభిషేకాలు చేశారు. కేకులు కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలను అభినందించారు.**


నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ...


సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు పట్టణ పరిధిలో


గాంధీభవన్‌లో ...

**విశ్వంభర, వెల్దండ:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని వెల్దండ మండల సింగిల్ విండో డైరెక్టర్,మట్ట వెంకటయ్యగౌడ్‌లు తిరుపతి తిరుమల దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తిరుపతి తిరుమల దేవస్థాన ప్రసాదాన్ని ముఖ్యమంత్రి సతీమణి గీతారెడ్డికి ఆయన స్వగ్రామం కొండారెడ్డిపల్లి గ్రామంలో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా మహాసభ అధ్యక్షుడు బచ్చు రామ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు శశిపాల్ రెడ్డి, రషీద్, కిష్టాలు, భరత్ గౌడ్,పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నీలం మధు**



**విశ్వంభర, సంగారెడ్డి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని జుబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చమిచ్చి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**విశ్వంభర, సంగారెడ్డి జిల్లా:** పటాన్ చేరు పట్టణ పరిధిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా పటాన్ చేరు డివిజన్ పరిధిలోని ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి కాంగ్రెస్ నాయకులు జలగరి ఎట్టయ్య పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు జలగరి ఎట్టయ్య, తెలంగాణ యువజన కాంగ్రెస్ ప్రోటోకాల్ ఛైర్మన్ ఆదిత్య రెడ్డి, సడబోయిన రవి, నాగసాని వెంకటేష్, శివానగరం నాగేష్, బోడ శ్రీశైలం, సాయిలు, వేణు, నరేష్,పాల్గొన్నారు.

**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను చౌరస్తాలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి, జిల్లా డీసీసీ కార్యవర్గ సభ్యులు అంజయ్య గుప్తా, గ్రామ అధ్యక్షులు రమేష్, తాలూకా సోషల్ మీడియా ఇంచార్జ్ ఎండి అజీమ్,పాల్గొన్నారు.

**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ జిల్లాలో రెండో డివిజన్ వంగపహాడ్ గ్రామంలో హనుమకొండ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు అరికెళ్ల సుమన్ ఆధ్వర్యంలో వంగపహాడ్ గ్రామంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెరుగు కొమరయ్య, చెన్నె సుధాకర్, ఆలేటి స్వామి, మంద రాజు, నర్మెట సునీల్, ములకలపల్లి శ్రీనివాస్, మండల అశోక్, అరకిల్లా రాని,రాణి, పొన్నాలఉదయ పాల్గొన్నారు.

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ నాయకులు రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్ వారి సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, సూదిని రామ్ రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో దాదాపు 200 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మాజీ మండల అధ్యక్షుడు మంగ్లీ రాములు, గుజ్జల మహేష్, అధ్యక్షులు జగన్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, పట్టణ అధ్యక్షుడు మానయ్య, కాలే మల్లయ్యపాల్గొన్నారు.

**విశ్వంభర, నాగారం:** నాగారం మండల కేంద్రంలోని సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్మకంటి సోమయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ నాగారం మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కొలిపాక సాయిబ కుమార్, నాయకులు పానుగంటి నరసింహారెడ్డి, కన్నెబోయిన వెంకట భిక్షం, ఆలకుంట్ల బాలకృష్ణ, పాల్వాయి పరుష రాములు, మంగదుడ్ల దశరథ, చిత్తలూరు వెంకన్న,లింగాల నర్సయ్య,హుస్సేన్, ఆవుల వెంకన్న, గుండేటి సురేష్, గద్దల సైదులు, చిలుక నరేందర్ రెడ్డి, నరేష్, చేను ఉమేష్, కన్నెబోయిన నాగరాజు జానీ, రమేష్, మహేష్, శ్రీను పాల్గొన్నారు.

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుల కేక్ కట్ చేసి సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

**విశ్వంభర, మహబూబాబాద్:** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చంద్రారెడ్డి, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య భారీ సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**విశ్వంభర, భీంగల్:** భీంగల్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొదిరే స్వామి, పట్టణ అధ్యక్షులు జె. జె నర్సయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు అనంత్ రావ్, యూత్ మండల అధ్యక్షుడు అవినాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విశ్వంభర, కడ్తాల్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా కడ్తాల్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో కడ్తాల్ మండల్ కేంద్రంలో కేక్ కటింగ్, పండ్లు స్వీట్లు పంచడం జరిగింది. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు ఆయిలా శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీఖ్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాట నరసింహ,రేవంత్ మిత్రమండలి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆసిఫ్ అలీ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, సేవా రాష్ట్ర కార్యదర్శి లక్పతి నాయక్, రాజు, ఇమ్రాన్ బాబా, రామకృష్ణ, పాల్గొన్నారు.

**విశ్వంభర, హైదరాబాద్:** గాంధీభవన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వందలాది మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, రేవంత్ రెడ్డి అభిమానుల సమక్షంలో గాంధీభవన్ లో సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మెట్టు సాయి ఆధ్వర్యంలో భారీ కేకు కటింగ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుమార్ రావ్, యువజన కాంగ్రెస్ మాజీ జాతీయ కార్యదర్శి ఊట్ల వర ప్రసాద్ పాల్గొన్నారు.

**విశ్వంభర, భూపాలపల్లి:** శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మొగుళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి కేక్ కట్ చేసి, మండల కేంద్రంలో స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు.

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్న గారిలక్ష్మారెడ్డితుక్కుగూడ కాంగ్రెస్‌కార్యాల యంలో రేవంత్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ శ్రేణులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో ఆరు గ్యారెంటీలు, ట్రిబుల్ ఆర్ ఫోర్త్ సిటీ ఎంతో దోహదపడుతాయన్నారు. హైడ్రా, మూసీ పునర్జీవం కార్యక్రమాలతో పర్యావరణ పరిరక్షుడిగా మారిన రేవంత్ మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.

**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ లో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రీ ఖిల్లా మైసమ్మ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు చిలుకఉపేందర్‌రెడ్డి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మధుసూదన్, దక్కియర్ నాయక్, శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం ఛైర్మన్ కూంచారపు సురేంద్ర కుమార్ (సురేష్), గట్ల రవీంద్ర, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, పెద్దవూర సైదులు, పగిళ్ళ భూపాల్ రెడ్డి, లింగ స్వామి పాల్గొన్నారు.

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకొండుర్ మండలం కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీ జన్మదిన వేడుకలను అంబెడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్, పట్టణ ప్రెసిడెంట్ ఆనంతుల నవీన్ రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిరహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సిరబోయిన మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ బుగ్గ శ్రీశైలం, ఉపసర్పంచ్ రేగు శ్రీనివాస్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు కంబోజు నాగరాజు, కాంగ్రేస్ పార్టీ నాయకులు పల్లె శ్రీనివాస్, గజారాజు పాల్గొన్నారు.

**విశ్వంభర, ఎల్బీనగర్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు దిల్ సుక్ నగర్ రాజీవ్ చౌక్ దగ్గర బద్ధుల వేణు యాదవ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నిరుపేదలకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ యం.సునీల్ బాబు, బద్ధుల వెంకటేశ్ యాదవ్, వేణు యాదవ్ సాకలి సత్యనారాయణ, చందర్, రవీందర్, వేణు, విజయ స్వామి, సురేష్, కృష్ణారెడ్డి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

**విశ్వంభర, పరిగి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా పరిగి పట్టణంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఏజాజ్, కాంగ్రెస్ నాయకులు చిన్న నరసింహులు, ఆంజనేయులు, తౌరియా నాయక్, వెంకటేష్, యువజన కాంగ్రెస్ నాయకులు జగన్, రామకృష్ణారెడ్డి, నాగవర్ధన్, పాల్గొన్నారు.

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం సీఎం నివాసానికి వెళ్లి ముఖ్యమంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సోదరుడు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే పెద్ద శంకరంపేట మండలంలోని కొత్తపేట గ్రామంలో మాజీ సర్పంచ్ అనంతరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

**విశ్వంభర, చైతన్యపురి:** చైతన్యపురి డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాము మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె. శశిధర రెడ్డి, దయాకర్, గంధం రవికేశవ్, కృష్ణ రెడ్డి, సతీష్ గౌడ్, ప్రభాకర్ రావు, మహేష్ గౌడ్, వెంకటేష్ చారి, అశోక్ రెడ్డి, సతష్ మాదిగ, చిన్ని, లక్మన్, విజయ్, నరేష్, రాహుల్ జైన్, గిరి, రెడ్డి గూడం శ్రీను, రామ్ బాబు పాల్గొన్నారు.


తలకొండపల్లి మండల కేంద్రంలో ..


భూపాలపల్లి జిల్లాలో ...


వంగపాడు గ్రామంలో..


తుక్కుగూడ కే ఎల్ ఆర్ కార్యాలయంలో..


రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండల కేంద్రంలో...


మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్‌లో..


నాగారం మండల కేంద్రంలో..


యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకొండూర్ మండలం కేంద్రంలో...


మహేశ్వరం మండల కేంద్రంలో...


దిల్ సుక్ నగర్ లో ..


మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో..


పరిగి పట్టణంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నివాసం వద్ద...


భీంగల్ మండల కేంద్రంలో...


నారాయణఖేడ్ ఎమ్మెల్యే సోదరుడు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో..


యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో...


షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండలంలో..


చైతన్యపురి డివిజన్‌లో...

# నాణ్యమైన సేవలకు చిరునామా పటాన్‌చెరు పెద్దాసుపత్రి

- సేవల్లో దేశంలోనే ఏడవ స్థానంలో నిలవడం ప్రశంసనీయం
- త్వరలో 1.5 కోట్ల రూపాయలతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరొందిన పటాన్ చేరు పట్టణంలో గల టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నాణ్యమైన సేవలకు చిరునామాగా నిలుస్తోందని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆసుపత్రిని ఆధునిక సౌకర్యాలతో ఆధునికీకరించడంతోపాటు, రోగులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణం తో పాటు చుట్టుపక్కల శానిటేషన్ సరిగా చేయడం లేదని సంబంధిత కాంట్రాక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంవో, వైద్యులు, సలహా సంఘం కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ఆరోగ్య శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో పటాన్ చేరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి నాణ్యమైన సేవల విభాగంలో జాతీయస్థాయిలో ఏడవ స్థానం లభించడం పట్ల ఆసుపత్రి వైద్యులను సిబ్బందిని అభినందించారు. త్వరలోనే అవార్డు రావడంలో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరిని సన్మానించ బోతున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం 1500 కు పైగా ప్రసూతి ఆపరేషన్లు నిర్వహించడంతోపాటు, 2 లక్షలకు పైగా రోగులకు ఔట్ పేషెంట్ విభాగంలో సేవలు అందించడం గర్వనీయ మన్నారు. అన్ని విభాగాల్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందించడంతోపాటు, అన్ని రకాల ల్యాబ్ టెస్టులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్, మురుగునీటి సమస్య, పెయింటింగ్, నీటి సంపు మోటార్లు, లిఫ్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రభుత్వం అందించే నిధులతోపాటు స్థానిక పరిశ్రమల సహకారంతో పైన పేర్కొన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వీటితోపాటు అతి త్వరలో మరో అంబులెన్స్ కొనుగోలుకు నిధులు కేటాయిస్తానని తెలిపారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సేవల్లో లోపం ఉండకూడదని ఆదేశించారు. సౌకర్యాలు లేవంటూ రోగులను వేరే ఆసుపత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే దయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ అధికారి సంగారెడ్డి, ఆస్పత్రి సూపరిండెంట్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఎంవో ప్రవీణ, కమిటీ సభ్యులు గాయత్రి పాండు, కంకర సీనయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

## సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ను ప్రారంభించిన ఎస్పీ



**విశ్వంభర, భూపాలపల్లి:** గంజాయి, డ్రగ్స్, ఆర్థిక నేరాలు, దొంగతనాలు, ప్రభుత్వ నిషేధిత అక్రమ వ్యాపారాల నియంత్రణే లక్ష్యంగా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ను జిల్లా కేంద్రంలో ప్రారంభించినట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్మడ్ రిజర్వు ప్రధాన కార్యాలయ సమీపంలో సీసీఎస్ ను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ నేరగాళ్లు ఎప్పటికప్పుడు నేరం చేసే విధానాన్ని మార్చుతూ, ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు సమస్యలు తలెత్తితే, పోలీసులను ఆశ్రయించాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో భాదితులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా పోలీసు శాఖ కృషిచేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. సీసీఎస్ లో ప్రస్తుతం ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, హెడ్‌కాన్స్టేబుల్, కానిస్టేబుళ్లు ఉన్నారని, సీసీఎస్ అధికారులు నేరాల నియంత్రణ, సమాచారం సేకరణ, కేసుల దర్యాప్తు చేయనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్) బోనాల కిషన్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీసీఎస్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్, ఎస్బీ ఇన్స్పెక్టర్ వసంత్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్, నగేశ్, రత్నం, సీసీఎస్, ఎస్ఐలు రమేష్, సాంబమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ నమోదుకు ప్రత్యేక క్యాంపుల ఏర్పాటు



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం 2025 లో భాగంగా 01 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు నూతన ఓటరు నమోదు చేసుకోవడానికి శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపుల్లో నూతన ఓటరు నమోదుకు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు సరి చేయుట మరణించిన వ్యక్తుల వివరాలు తొలగించడంతో పాటు ఈ ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి నివాసాన్ని మారిన ప్రతి ఓటరు జాబితాలో మార్పుకు దరఖాస్తు చేసుకోవడానికి 9వ తేదీ శనివారం, 10వ తేదీ ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం స్పెషల్ క్యాంపెన్ డేస్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తెలిపారు. కావున ఇట్టి అవకాశాన్ని ఓటర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూతు స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

## వయోజనులందరూ ఓటరు నమోదు చేసుకోవాలి

తహసిల్దార్ బ్రహ్మయ్య



**విశ్వంభర, నాగారం:** 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని నాగారం తాసిల్దార్ బ్రహ్మయ్య అని అన్నారు. శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో ఓటర్ నమోదు ప్రత్యేక కార్యక్రమం పై సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం 2025 లో భాగంగా 01 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు నూతన ఓటరు నమోదు చేసుకోవడానికి శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఈ ప్రత్యేక క్యాంపుల్లో నూతన ఓటరు నమోదుకు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు సరి చేయుట, మరణించిన వ్యక్తుల వివరాలు తొలగించడంతో పాటు ఈ ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి నివాసం మారిన ప్రతి ఓటరు జాబితాలో మార్పుకు దరఖాస్తు చేసుకోవడానికి 9వ తేదీ శనివారం, 10వ తేదీ ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం స్పెషల్ క్యాంపెన్ డేస్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తెలిపారు. కావున ఇట్టి అవకాశాన్ని ఓటర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూతు స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకుఅందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎస్ఓ చింతమల్ల రమేష్, మండల విద్యవనరుల అధికారి వాసం ప్రభాకర్, మహేశ్వరి, శోభ, ఆర్ ఐ నాగరాజు, బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో మరొకరికి ప్రాణదాతలు అవుతారు




**విశ్వంభర, ఎల్బీనగర్:** రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదాతలు అవుతారని సొసైటీ అధ్యక్షుడు ఎండి ముస్తఫా అన్నారు. పంజాగుట్ట లోని అరోరా పీజీ కళాశాల, ఆబిడ్స్ లోని అరోరా పీజీ కళాశాలలో షైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల కొంతమందిలో అపోహలు ఉన్నాయని, 30 రోజుల్లోనే తిరిగి రక్తం మన బాడీలో రికవరీ అవుతుందని తెలిపారు. నేటికీ రక్తం కొరత ఉన్నదని, ఆ కొరతను భర్తీ చేయాలంటే ప్రతి ఒక్కరు రక్తం దానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుష్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెన్నంపల్లిలో ఎంపీడీవో పర్యటన



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం చెన్నంపల్లి గ్రామంలో స్థానిక ఎంపీడీవో కుసుమ మాధురి పర్యటించారు. ఆమె గ్రామంలో జరుగుతున్న ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే లో భాగంగా స్టిక్కరింగ్ నిర్వహిస్తున్న ఎన్యుమారేటర్లతో మాట్లాడి సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం స్థానిక నర్సరీని సందర్శించారు. హార్టికల్చర్ ప్లానింగ్ ప్రక్రియ గుర్తింపులో భాగంగా గ్రామంలోని భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నూతన బస్సు సర్వీస్ ప్రారంభం




**విశ్వంభర, సంగారెడ్డి:** జిన్నారం మండలంలో సికింద్రాబాద్ నుండి జిన్నారం శివనగర్ బస్సు ఏర్పాటుకు కృషిచేసిన జిన్నారం తాజా మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ కి మండలంలోని వావిలాల, లక్ష్మీ గూడెం, జిన్నారం, ఉట్ల, దాది గూడెం, సోలక్ పల్లి రాళ్లకత్వ శివనగర్ గ్రామల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన బస్సును వావిలాల జిన్నారం గ్రామంలో పూలమాల వేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఏర్పడి గ్రామాలకు, పట్టణాలకు వెళ్లలేకుండా ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న మాజీ ఎంపీపీ జీడిమెట్ల డిపో అధికారులతో మాట్లాడి నూతనంగా 3 బస్సులను ఏర్పాటు చేయడం జరిగింది. బస్సు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మూడు ట్రిప్పులు సికింద్రాబాద్ జిన్నారం శివనగర్ రూట్లల్లో తిరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఏలాంటి అసౌకర్యం లేకుండా తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ జిన్నారం మండలంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి తన వంతు కృషి ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వావిలాల జిన్నారం గ్రామ నాయకులు మాజీ సర్పంచ్, మాజీ వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## భీంగల్ మండలంలో అదనపు కలెక్టర్ ఆకస్మిక పర్యటన



**విశ్వంభర, భీంగల్:** జిల్లా అదనపు కలెక్టర్ భీంగల్ మండలంలోని చెంగల్, బడా భీంగల్ గ్రామాలలో శుక్రవారం సమగ్ర సర్వే ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయ అని సంబంధిత ఎన్యుమరేటర్ లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్, మండల రెవెన్యూ అధికారి, సంబంధిత సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలి



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి మునిసిపాలిటీ పరిధి లోని ఎనిమిదవ వార్డులో చేపట్టిన సమగ్ర కులగణన సమగ్ర సర్వే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శుక్రవారం పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులతో కలిసి పలు ఇళ్లకు కలెక్టర్ స్వయంగా స్టిక్కర్ అతికించారు. సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. ఫారంలో అడిగిన అంశాల ఆధారంగా అన్ని అంశాలకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని సమాచారం లో తప్పులు లేకుండా ఇవ్వాలన్నారు. సర్వే వివరాలను ఏరోజుకారోజు డేటా ఎంట్రి చేయడం జరుగుతుందని అందుకు సంబంధించి డేటా ఎంట్రి సిబ్బందిని, కంప్యూటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. డేటా ఎంట్రి జరిగినప్పుడు ఎన్యుమరేటర్స్ తప్పక ఉండాలని అధికారులు అన్ని విషయాలను సేకరించాలని సూచించారు.

## బీఆర్ఎస్వీ నాయకుల అక్రమ అరెస్ట్ అప్రజాస్వామికం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం యాదాద్రి జిల్లా పర్యటన సందర్భంగా తెల్లవారు జామున నుండి యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్వీ నేతలను ముందస్తు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అని బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్ రెడ్డి అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గారంటీలు అమలు చేయడం చేత కాక ప్రతిపక్ష నాయకులను పోలీస్ ల చేత అణచివేయాలి అని చూస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక జిల్లాకు చేసింది శూన్యం అని, కనీసం మంజూరు అయినా మెడికల్ కాలేజీని కూడా మొదలు పెట్ట పోవడం, రైతులకు రైతు బంధు వేయకుండా మూసి ప్రక్షాళన అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని విమర్శయించారు. అందులో భాగంగానే శుక్రవారం ఖప్రయిపల్లి గ్రామంలో దేవరపల్లి ప్రవీణ్ రెడ్డిని అరెస్టు చేశారని. అదేవిధంగా యువజన విభాగం మండల అధ్యక్షులు ప్రతి కంఠం శంతన్ రాజు, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు చుంచు నాగరాజులని అరెస్టు చేయడం జరిగిందని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని అన్నారు.

## ఎలిగంట్ బ్యూటీ సేలున్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, ఎల్బీనగర్:** గడ్డి అన్నారం డివిజన్ పరిధిలోని జెడ్.సి. ఆఫీస్ రహదారి నందు నూతనంగా నెలకొల్పిన ఎలిగంట్ బ్యూటీ సేలున్ ను ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలని తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట మాజీ కార్పొరేటర్ సాగర్ రెడ్డి, రాహుల్ గౌడ్, ఉదయ్, యసీన్, జోగు నగేష్, నిర్వాహకులు ప్రియాంక, సంతోష్ బొజ్జ, హరీష్, శేఖర్, వీరేశ్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**విశ్వంభర, మర్పల్లి:** మర్పల్లి మండల పరిధిలోని పంచలింగాల్ గ్రామంలో బీరప్ప స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న బీరప్ప గడ్డ వద్ద పట్లూర్ చెందిన పురోహితులు సర్వోత్తమ శర్మ, పెద్దగొల్ల రాములు దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ చేశారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆవో సీకో - గరీబీ హఠాహెూ - జల్ పల్లి బచావో

స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఉద్యోగాలు: కేఎల్ఆర్




**విశ్వంభర, మహేశ్వరం:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. జల్ పల్లి మున్సిపాలిటీలో మైనార్టీ ఛైర్మన్ యూసుఫ్ ఖాద్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేఎల్ఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందు చూపుతో ఫోర్త్ సిటీలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందన్నారు. పేదరికం పోవాలంటే మంచి విద్య – ఉద్యోగం ఉండాలని సూచించారు. కే ఎల్ ఆర్ జల్ పల్లి మున్సిపాలిటీ హైదరాబాద్ లో విలీనమైతే రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అంతా బాగుపడుతుందన్నారు. ఇక్కడి పేదలు, టాక్సులు కట్టలేని పరిస్థితిలో ముస్లింలు ఉన్నారని అందువల్ల భవిష్యత్ లో పిల్లలను స్కిల్ యూనివర్సిటీలో జాయిన్ చేసి మంచి ఉద్యోగాలు పొందేలా చేయాలని లక్ష్మారెడ్డి కోరారు. ఆవో, సీకో, గరీబీ హఠాహెూ అన్నారు కేఎల్ఆర్. ఈ సందర్భంగా పేదలకు సహాయం చేస్తున్న యూసుఫ్ ఖాద్రీని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అభినందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, యూసుఫ్ పటేల్, కౌన్సిలర్ బుడమల యాదగిరి, నవీన్ గౌడ్, షేక్ ఫజల్, మహమ్మద్ వసీం, మతీన్, ఇస్మాయిల్, సల్మాన్, అర్బల్ బీన్ ఖలీఫా, మహమ్మద్ అక్రమ, రవి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు బొక్క భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు ఎప్పుడు ?




**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి పట్టణంలోని బాతల రాజన్న భవన్ లోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో (టీఎస్ యూఎస్)కార్మిక సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి టీఎస్ సింగరేణి ఉద్యోగుల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య, కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి మాట్లాడుతూ సింగరేణి ఎన్నికలకు ముందు కార్మిక సంఘాల నాయకులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులపై మేనిఫెస్టోలలో చేర్చి కార్మిక క్షేత్రాలకు వచ్చి ఓట్లు దండుకొని గెలుపొంది గుర్తింపు పొందిన ఏఐటీయూసీ, ఐ ఎన్ టీ యూ సీ సంఘాలు కార్మికుల కు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి తమ ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రభుత్వం యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల హక్కులను తాకట్టు పెడుతున్నారని అన్నారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలు పరిష్కరింప బడతాయని, అటు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి ఎన్నికలలో నిలబడ్డ కార్మిక సంఘాలు కార్మికులకు హామీ ఇవ్వడం జరిగింది అని అన్నారు. అటు అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని కార్మిక వర్గం గెలిపించడం జరిగిందని, సింగరేణి ఎన్నికలు జరిగి దాదాపు సంవత్సరం కాలం అవుతుంది. ఇప్పటివరకు కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సింగరేణి వ్యాప్తంగా కలిసొచ్చే కార్మిక సంఘాలను కలుపుకొని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకత్వంలో కార్మికుల హక్కుల కోసం, సింగరేణి పరిరక్షణ కోసం పోరాడుతామని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మ రాజయ్య, దాసరి జనార్ధన్, ఇరేంటి శ్రీధర్, నామల శ్రీనివాస్, కాసర్ల ప్రసాద్ రెడ్డి, ఎండి సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్




**విశ్వంభర, చింతపల్లి:** వరి ధాన్యం అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాలలో రెండు రోజుల్లో డబ్బులు జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. చింతపల్లి మండల కేంద్రంలో మార్కెట్ యార్డ్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. తేమశాతం ఎక్కువగా లేకుంటే వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను సూచించారు. ముఖ్యంగా రైతులు ధాన్యం అమ్మిన డబ్బులు వారి ఖాతాలో రెండు రోజుల్లో జమ అయ్యేందుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలు కొనుగోలు కేంద్రాల్లోనే అందజేస్తే రెండురోజుల్లోనే వారి అకౌంట్లో నిధులు జమ చేస్తామని ఆమె తెలిపారు. సన్నధాన్యానికి, దొడ్డు ధాన్యానికి వేరువేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తున్నదని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, అవసరమైతే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇంకా ఎక్కువ లారీలను పంపించడం జరుగుతుందని, అలాగే గోదాములలో ధాన్యం అన్లోడ్ జాప్యం జరగకుండా తక్షణమే అన్లోడ్ చేసుకోవాలని ఆమె మిల్లర్లను కోరారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యం కొనుగోలు వేగవంతంతో పాటు, ట్యాబ్ ఎంట్రీ వెంటనే పూర్తి చేయాలి. తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని బస్తాలలో ఎందుకు నింపారని అధికారులను ఆమె మందలించారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, జిల్లా సహకార శాఖ అధికారి పత్యా నాయక్ తదితరులు ఉన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**విశ్వంభర, పరిగి:** మండల పరిధిలోని గడిసింగాపూర్ గ్రామంలో శుక్రవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సివిల్ సప్లై అధికారిని విజయలక్ష్మితో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్ రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోని విక్రయించాలని, రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తెలిపారు. సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ అందజేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గోనెసంచుల కొరత లేకుండా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ పరిగి మేనేజర్ వెంకటయ్య, గ్రామస్తులు శ్రీనివాస్, రాంరెడ్డి, ప్రవీణ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పేలిన సిలిండర్: గృహ సామాగ్రి ధ్వంసం



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి లోని హనుమాన్ నగర్ లో రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ ఖలీలుల్ రెహమాన్ ఇంట్లో అర్ధరాత్రి నిండు గ్యాస్ సిలిండర్ పేలడంతో పెను ప్రమాదం తప్పగా, ఇల్లు ధ్వంసం కావడంతో పాటు ఇంట్లో ఉన్న సామాగ్రి మొత్తం దగ్ధమైంది. బుక్ చేసిన గ్యాస్ సిలిండర్ రెండు రోజుల క్రితం రావడంతో ఇంట్లో వాడకుండా సిలిండర్ ను అట్లే పెట్టారు. అయితే అర్ధరాత్రి సమయంలో కుటుంబ సభ్యులందరూ నిద్రిస్తున్న క్రమంలో ఒక్కసారిగా సిలిండర్ నుంచి పొగలు, మంటలు వస్తున్నాయన్న విషయం గమనించి కుటుంబ సభ్యులంతా ఇంటి బయటకి వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. కొద్దిసేపట్లోనే సిలిండర్ పేలడంతో ఇంట్లో గోడలు కూలి, మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న ఫర్నిచర్ దగ్ధమైంది, ఫైర్ ఇంజన్ వాళ్లు వచ్చేలోపే జరగాల్సిన నష్టమంతా జరిగిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

## సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి, ఇతర పనులపై గ్రామాల వారిగా సామాజిక తనిఖీ బృందాలకు ఈజీఎస్ సిబ్బంది సహకరించాలని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృంద సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాలలో గ్రామసభలను నిర్వహించి పనులపై నివేదికలను అందజేస్తారన్నారు. ఈజీఎస్ సిబ్బంది, ప్రజలు వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ విఠల్రెడ్డి, ఏపీఓ నవాజుద్దీన్ తదితరులున్నారు.

విశ్వంభర V3 NEWS

## బస్సుల కోసం విన్నపం



**విశ్వంభర, యాకుత్పురా:** యాకుత్పురా సీనియర్ కాంగ్రెస్ లీడర్ ముత్యం యాదవ్ గత కొంతకాలంగా తల్లిదండ్రులు పడుతున్న బాధను తన కళ్లారా చూసి శుక్రవారం ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఒక్కరి కి ఈరోజు గుర్తుండిపోయే విధంగా ఫలక్ నూమ డిపో మేనేజర్ రమేష్ గారికి లాల్ దర్వాజా మోడ్ నుంచి గౌలిపుర మీదుగా చంద్రాయన గుట్ట వరకు బస్సును నడప వలసిందిగా కోరారు. ఆ కోరికకు సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్ మీ యొక్క కోరిక త్వరలో నెరవేరుస్తామని తెలిపారు.

## 16వ జిల్లా అదనపు న్యాయస్థానం ప్రారంభం



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ లో 16వ జిల్లా అదనపు న్యాయస్థానాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జ్, సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్, షాద్ నగర్ బార్ అసోసియేషన్ కమిటీ, సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, జూనియర్ న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది, మరియు పోలీసు సిబ్బంది వున్నారు.




తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 55 వ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మున్సిపల్ అధ్యక్షులు జండాగూడెం సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి సుభిక్షంగా ఉండాలని స్థానిక నారాయణగూడ కాలనీలో మందోని బాయి మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



త్రిపురారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చి రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి ఘనంగా నిర్వహించారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని డిండి మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు ,స్వీట్లు పంపిణీ చేశారు.



ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ మున్సిపల్ మామిండ్ల ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేయడం జరిగింది.



వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు నివాసం నందు, వర్ధన్నపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువ నాయకులు తో కలిసి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు గనంగా జరుపుకున్నారు.

# నూతన ఉపాధ్యాయులకు పుస్తకాల పంపిణీ



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పీ ఆర్ టీ యూ టీ ఎస్ శంకరంపేట శాఖ ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయులకు సేవ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సేవ పుస్తకాలను పీ ఆర్ టీ యూ టీ ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగా మహేందర్ రెడ్డి సౌజన్యంతో పీ ఆర్ టీ యూ టీ ఎస్ శంకరంపేట మండల శాఖ నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్ లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీ జీ హెచ్ ఎం కంది రాజేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల పీ ఆర్ టీ యూ టీ ఎస్ సంఘం కృషి మరువలేనిదని పీ ఆర్ టీ యూ సంఘం నూతన సర్వీస్ రిజిస్టర్ లను ఉచితంగా అందించడం శుభ పరిణామమని అన్నారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పేద బడుగు బలహీన వర్గాల పిల్లల విద్యాభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు. పీ ఆర్ టీ యూ టీ ఎస్ జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు రామచంద్ర చారి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు విట్టల్, రామకృష్ణ గౌడ్, చంద్ర ప్రకాష్ జిల్లా ఉపాధ్యక్షులు సత్య కుమార్, మండల అధ్యక్షులు గోపి, ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, మహిళా ఉపాధ్యక్షురాలు సుమంగళ, మండల కార్యవర్గ సభ్యులు పాండురంగం, రాములు, సంతోష్ కుమార్, సుజిత్, ప్రవీణ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తూ పత్తి కొనుగోలు చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** నిబంధనలు పాటిస్తూ పత్తి కొనుగోలు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్న శ్రీ బాల మురుగన్ కాటన్ ఇండస్ట్రీస్, శ్రీ ఆంజనేయ ఆగ్రో ఇండస్ట్రీస్ లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వే బ్రిడ్జి పని తీరు, పత్తిలో తేమ శాతం పరీక్షలు నిర్వహించే తీరు, పత్తి మిల్లుల పని తీరును పరిశీలించి పత్తి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల మేరకు పత్తి కొనుగోలు ప్రక్రియ జరపాలని తెలిపారు. పత్తి అమ్మకానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు పత్తిని విక్రయానికి వచ్చే సందర్భంలో వ్యవసాయ లేదా రెవెన్యూ శాఖల నుంచి జారీ చేసిన ధృవీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. రైతులకు ఏదైనా ఇబ్బంది కలిగితే "కాట" యాప్ లో ఛాటింగ్ ద్వారా రైతుల సమస్యలను తెలియచేయాలని తెలిపారు. పత్తి విక్రయించిన రైతులకు స్వల్ప వ్యవధిలోనే డబ్బును వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు నాణ్యమైన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి కనకశేఖర్, తహసిల్దార్ హేమ, సీసీఐ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ వైస్ చైర్మన్ నటరాజన్ రాజీనామా

### వార్డు కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా



**విశ్వంభర, షాద్ నగర్:** 16వ వార్డ్ కౌన్సిలర్ పదవికి, మునిసిపల్ వైస్ చైర్మన్ పదవికి సొంత కారణాలవల్ల నటరాజన్ శుక్రవారం రాజీనామా సమర్పించాడు. తన రాజీనామా పత్రాన్ని లోకల్ బాడీస్ అదనపు జిల్లా కలెక్టర్ కు ఇచ్చినట్టు తెలిపాడు. 1988 సంవత్సరం నుండి మానవసేవయే మాధవ సేవ అని విశ్వసించి రాజకీయాన్ని ప్రవృత్తిగా భావించి పనిచేసిన ఆయన 50 ఏళ్ల వయసులో ఆయనను మొదటిసారిగా క్రిస్టియన్ కాలనీ ప్రజలు (16 వార్డు ప్రజలు) అక్కున చేర్చుకొని కౌన్సిలర్ గా గెలిపించినందుకు వారికి, క్రిస్టియన్ కాలనీ పెద్దలకు, ఆయనకు సహకరించిన నాయకులకు, ఆయనతో పని చేసిన యువకులకు, ధన్యవాదాలు తెలియజేశారు. ఆయనను కౌన్సిలర్ తో పాటు వైస్ చైర్మన్ గా నియమించినందుకు అప్పటి శాసనసభ్యుడు అంజయ్య యాదవ్ కు మరొక్కసారి ఆయన సేవలను గుర్తించి వైస్ చైర్మన్ గా చేసినందుకు ధన్యవాదాలు తెలియజేసుకున్నారు. ప్రస్తుతం ఆయన సొంత కారణాలవల్ల ఈ రెండు పదవులకు రాజీనామా చేస్తున్నట్టు, బాధ్యతగల బీఆర్ఎస్ కార్యకర్తగా పార్టీలో కొనసాగుతనని ఇట్టి రాజీనామా ప్రతులను సీడీఎంఏ హైదరాబాద్ కు, కలెక్టర్ రంగారెడ్డి జిల్లాకు, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) రంగారెడ్డి కు పంపించినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

**- జిల్లా కార్యదర్శి మేక అశోక్ రెడ్డి**




**విశ్వంభర, రామన్నపేట:** ఎప్పటికీ ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి.జహంగీర్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ఎస్ఎల్ఎన్ఎస్ మినీ ఫంక్షన్ హాలులో సీపీఎం ఎనిమిదవ మండల మహాసభ ఘనంగా జరిగింది. మహాసభల ప్రారంభ సూచికంగా పార్టీ జిల్లా కార్యదర్శి మేక అశోక్ రెడ్డి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులు సీతారాం ఏచూరి, పిట్టల శ్రీనివాస్ లకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో నిస్వార్ధంగా, నిజాయితీగా ప్రజల పక్షాన పోరాడుతూ నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తున్న పార్టీ సీపీఎం అని అన్నారు. కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉన్నప్పుడు ప్రజల గొంతుకై నిలిచే వారిని పెట్టుబడిదారులు, పార్లమెంటరీ వ్యవస్థలోకి వచ్చాక డబ్బులు ఉన్నవారు మాత్రమే చట్టసభల్లోకి వెలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల గొంతు వినిపించేవారు కరువయ్యారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల పట్ల చిత్తశుద్ధిగా వ్యవరించడం లేదని, మతం పేరుతో వైశమ్యాలు సృష్టిస్తూ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని అన్నారు. దేశ సంపదను దోచుకుంటున్న శత కోటీశ్వరులకు లక్షల కోట్లు రాయితీలిస్తుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదలపై పెనుభారం మోపుతున్నారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు తెస్తూ, కార్పోరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీల అమలు చేయక కాలయాపన చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన పేదలందరికి అందివ్వాలని అన్నారు. రామన్నపేటలో కాలుష్య ఆదాని సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమపించాలని పిలుపునిచ్చారు. రామన్నపేట మండల వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం సంఘటిత ఉద్యమాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శి మేక అశోక్ రెడ్డి, కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్య, వనం ఉపేందర్, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మెడబోయిన మమత, మండల కార్యవర్గ సభ్యులు కూరేళ్ళ నర్సింహాచారి, బలగూరి అంజయ్య, బోయిని ఆనంద్, మీర్ ఖాజా అలీ, మండల కమిటీ సభ్యులు జంపాల అండాలు, మామిడి వెంకట్ రెడ్డి, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, గన్నెబోయిన విజయభాస్కర్, బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, వేముల సైదులు, రషీద్, గణేష్, గొరిగే సోములు, గంటపాక శివ కుమార్, గోగు మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినీ విద్యార్థులకు బూట్ల పంపిణీ



**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం విట్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి, అపాక్ ఛైర్ పర్సన్ లక్ష్మి చేతుల మీదుగా దాత రవీందర్ రెడ్డి సహకారంతో రిటైర్డ్ జీహెచ్ఎం సురేష్, టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ రిటైర్డ్ ఏ శ్యాంబాబు, క్రాంతి కుమార్, నాగరాజు, రామచంద్ర రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు కల్పన, ఎస్ మల్లికార్జున శర్మ, ఎస్ వెంకటరమణ, శేఖర్ విద్యార్థిని, విద్యార్థులకు బూట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బూట్ల దాత రవీందర్ రెడ్డి ని ఛైర్ పర్సన్ లక్ష్మిని ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు ఇతరులకు సహాయం చేసే లక్షణాన్ని పాఠశాల స్థాయి నుంచి అలవర్చుకోవాలని, విద్యార్థిని విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్యసాధనకు అనుగుణంగా కఠోర శ్రమ చేస్తూ ఆ కఠోర శ్రమలోనే సంతోషాన్ని పొందుతూ ఉంటే లక్ష్యాన్ని అవలీలగా చేరుకోవచ్చని ఆవుల రవి అన్నారు. లక్ష్యాన్ని చేరుకున్న తర్వాత వీలైనంత ఎక్కువ మందికి సహాయం చేస్తూ ఉంటే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అందరికీ ఆదర్శంగా ఉంటారని, సహాయం చేసినవారిని ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటూ రుణపడి ఉండాలని ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి తెలిపారు.

## సీఎం పర్యటనకు బీఆర్ఎస్ నాయకులు ముందస్తు అరెస్ట్



**విశ్వంభర, సంస్థాన్ నారాయణ పురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల బీఆర్ఎస్ నాయకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా యాదాద్రి పర్యటన లో భాగంగా బీ.ఆర్.ఎస్ నాయకులు అడ్డుకుంటారని ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరు ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ అడుగుజాడల్లో పోరాటాలను ఆపలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్,తెలంగాణ బిక్షం,ఏర్పుల అంజమ్మ,పానుగోతు పాండు నాయక్, చింతకింది ఉషా, పచ్చిపాల పాపయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రివెంట్ బ్రెస్ట్ క్యాన్సర్ బ్లాక్ ను ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి




**విశ్వంభర, మహేశ్వరం:** బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ సమీపంలో చౌహన్ హాస్పిటల్లో ప్రివెంట్ బ్రెస్ట్ క్యాన్సర్ బ్లాక్ ను మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. మోమోగ్రామ్ సేవలను అందుబాటులోకి తెచ్చినందుకు హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకి తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందించాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### - కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2025, స్పెషల్ క్యాంపెయిన్ ను అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు లేదా 1 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని కొత్త ఓటరు నమోదుకు ఫాంం 6, జాబితాలో అభ్యంతరాల కోసం ఫారం 7, ఓటరు వివరాలలో సవరణలు చేయడానికి ఫారం 8, ఇంటి చిరునామా మార్పు సవరణలు కొత్త ఎపిక్ దివ్యాంగుల గుర్తింపు మొదలైనవి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రత్యేక క్యాంపైనింగ్ 8 శుక్రవారం రేపు నవంబర్ 9, 10 తేదీలలో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు బూతు స్థాయి అధికారులు (బీ ఎల్ ఓ) ఆయా పోలింగ్ బూతుల వద్ద అందుబాటులో ఉంటారని ఏదైనా సమస్యలు ఓటరు సవరణలు వివరణలు సరి చేసుకోవాలని, కొత్త ఓటరుగా నమోదు చేసుకొనుటకు ఈ ప్రత్యేక క్యాంపైనింగ్ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు వెబ్సైట్ లేదా ఓటర్, హెల్ప్ లైన్, మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

## కమ్యూనిటీ హాల్‌కు వైస్ ఎంపీపీ రూ. 50వేల విరాళం



**విశ్వంభర, కడ్తాల్:** కర్తాల్ మండలంలోని నాయిబ్రాహ్మణుల కుల కమిటీ నిర్మించే కమ్యూనిటీ హాల్ కు కడ్తాల్ మాజీ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్ కుమార్ యాబై వేల రూపాయల ను కమ్యూనిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆనంద్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కానుగుల అంజయ్య, కానుగుల రాజు, వెంకటేష్, కానుగుల లక్ష్మణ్, కానుగుల శ్రీను, శివ, కానుగుల ధోని, కానుగుల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కంబోడియాకు నిరుద్యోగుల తరలింపు..

### కీలక నిందితుడు అరెస్టు

**విశ్వంభర, హైదరాబాద్:** ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను కంబోడియా దేశానికి పంపించి సైబర్ నేరాలు చేయిస్తున్న కేసులో కీలక నిందితుడిని సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన సదాకత్ ఖాన్ మాల్దీవుల నుంచి వస్తుండగా దిల్లీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకొని హైదరాబాద్ తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. తెలంగాణలోని సిరిసిల్లకు చెందిన యువకుడికి ఏజెంట్ సాయి ప్రసాద్ పరిచయం అయ్యాడు. కంబోడియాలో మంచి ఉద్యోగం ఉందని చెప్పి అతని వద్ద రూ.1.40 లక్షలు తీసుకున్నాడు. అతనికి ముంబయికి చెందిన మహ్మద్ అబిద్ అన్సారి, షాదాబ్ అలామ్‌లను పరిచయం చేశాడు. దుబాయ్‌లో ఉంటున్న సదాకత్ ఖాన్ సాయంతో బాధితుడిని కంబోడియా పంపించారు. అక్కడ బాధితుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. చైనాకు చెందిన సైబర్ నేరాలు చేసే కాల్ సెంటర్‌లో రోజుకు 16 నుంచి 17 గంటలు పనిచేయించారు. ఎదురు తిరిగితే చిత్రహింసలకు గురిచేశారు. ఎన్నో ప్రయత్నాలు చేసి చివరకు కంబోడియా నుంచి స్వగ్రామం చేరుకున్నాడు. బాధితుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఏజెంట్ సాయి ప్రసాద్, అబిద్ అన్సారి, షాదాబ్ అలామ్‌లను ఇప్పటికే అరెస్టు చేశారు. తాజాగా కీలక నిందితుడు సదాకత్ ఖాన్‌ను అరెస్టు చేశారు. సుమారు 500 నుంచి 600 మంది భారతీయులు కాంబోడియాలోని కాల్ సెంటర్లలో పనిచేస్తున్నట్లు పోలీసు దర్యాప్తులో తేలింది.

## మహిళల దుస్తులు పురుషులు కుట్టకూడదు: యూపీ మహిళా కమిషన్



**లక్నో:** పురుషుల దురుద్దేశాలను నిరోధించడంతో పాటు 'బ్యాడ్ టచ్' నుంచి మహిళలను రక్షించేందుకు గానూ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ కీలక ప్రతిపాదనలు చేసింది. మహిళల దుస్తులను పురుష దర్జీలుకుట్టకూడదని పేర్కొంది. అమ్మాయిల శిరోజాలను కత్తిరించే పనులు కూడా చేయకూడదని ప్రతిపాదించింది. ఈ మేరకు మహిళా కమిషన్ సభ్యురాలు హిమానీ అగర్వాల్ వెల్లడించారు. ఇటీవల జరిగిన సమావేశంలో కమిషన్ ఈ ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు."అమ్మాయిల దుస్తుల కొలతలు మహిళలు మాత్రమే తీసుకోవాలి. ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. ఇక సెలూన్‌లలో మహిళా కస్టమర్లకు అమ్మాయిలే సేవలందించాలి. ఇలాంటి వృత్తుల్లో ఉన్న పురుషులు అమ్మాయిలను అసభ్యంగా తాకుతూ వేధించేందుకు ప్రయత్నించే అవకాశాలున్నాయి. అలాంటి వాటి నుంచి మహిళలను రక్షించేందుకే ఈ ప్రతిపాదనలు చేశాం" అని హిమానీ అగర్వాల్ వెల్లడించారు.

ప్రస్తుతం తాము ప్రతిపాదనలు మాత్రమే చేశామని, త్వరలోనే వీటిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. ఈ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు చట్టం తీసుకొచ్చేలా యూపీ ప్రభుత్వాన్ని కోరనున్నట్లు పేర్కొన్నారు. ఏదేమైనా ప్రస్తుతం ఈ ప్రతిపాదనల అంశం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## తప్పుడు సమాచార వ్యాప్తి చేసినందుకు బీజేపీ ఎంపీ పై కేసు నమోదు

బెంగళూరు: బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యపై పోలీసు కేసు నమోదైంది. వక్ఫ్ భూముల సమస్యతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తుండటం వల్లే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కర్ణాటకలోని హావేరి జిల్లాకు చెందిన రైతు రుద్రప్ప చన్నప్ప బాలికై తన భూమిని వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని.. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, మంత్రి జమీర్ అహ్మద్ చర్యల వల్ల రైతులు కుంగిపోతున్నారని.. ఎంపీ సూర్య ఇటీవల సోషల్‌మీడియా వేదికగా ఆరోపించారు. అయితే 2022 జనవరిలో రైతు రుద్రప్ప పంట నష్టం, రుణ భారం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని, భూ సమస్యల వల్ల కాదని హావేరీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్పష్టంచేశారు. రైతు ఆత్మహత్యను వక్ఫ్ భూములకు ముడిపెడుతూ పోస్టు పెట్టి.. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారనే ఆరోపణలతో ఎంపీతో పాటు రెండు కన్నడ పత్రికల ఎడిటర్లపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వక్ఫ్ నోటీసులకు వ్యతిరేకంగా హావేరీలో రైతులు నిరసన తెలియజేస్తున్నారని, ఈ ఘటనతో రైతు రుద్రప్ప మానసిక క్షోభకు గురై ఆత్మహత్య చేసుకున్నారని వార్తాపత్రికలు పేర్కొన్నాయి. కాగా ఆ పోస్టును ప్రస్తుతం సూర్య డిలీట్ చేశారు.

# వైరల్ అవుతున్న ఆ మెమో నకిలీది

## 'భారత దౌత్యవేత్తలకు సీక్రెట్ మెమో'.. వార్తలపై స్పందించిన విదేశాంగ శాఖ




**దిల్లీ:** ఖలిస్థానీ సానుభూతిపరుడు నిజ్జర్ హత్య అంశంలో భారత్‌-కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ సామాజిక మాధ్యమాల్లో ఓ వార్త హల్‌చల్ చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారత దౌత్యవేత్తలకు కేంద్ర ప్రభుత్వం సీక్రెట్‌గా ఓ మెమో ఇచ్చారన్నది దాని సారాంశం. దీనిపై విదేశాంగశాఖ స్పందించింది. వైరల్ అవుతున్న ఆ మెమో నకిలీదని వెల్లడించింది. అసలేం జరిగిందంటే..భారత విదేశాంగ పేరు తో ఇటీవల నెట్టింట ఓ మెమో చక్కర్లు కొడుతోంది. 2023 ఏప్రిల్ తేదీతో ఉన్న ఆ మెమోను మాజీ విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా జారీ చేసినట్లుగా ఉంది. కెనడా లోని ఖలిస్థానీ వేర్పాటువాదులను అడ్డుకునేందుకు భారతీయ మూలాలున్న గ్రూప్‌లతో ఓ బలమైన దళాన్ని ఏర్పాటు చేయాలని భారత దౌత్యవేత్త లను ఆదేశించినట్లు అందులో ఉంది. దీంతో ఇది కాస్త వైరల్‌గా మారింది. ఈ క్రమంలోనే కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. 'అది నకిలీది. అలాంటి మెమో ఏదీ కేంద్ర ప్రభుత్వం జారీ చేయలేదు' అని విదేశీ వ్యవహారాలకు చెందిన ఎక్స్‌టర్నల్ పబ్లిసిటీ అండ్ పబ్లిక్ డిప్లొమసీ విభాగం వెల్లడించింది. భారత దౌత్యవేత్తలకు హింసాత్మక నేరాలకు అంటగడుతూ తప్పుడు ప్రచారం జరుగుతోందని తెలిపింది.

అయితే, భారత్‌-కెనడా మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ ఈ మెమో వార్తలు చర్చనీయాంశమయ్యాయి. ఖలిస్థానీ అనుకూలవాది నిజ్జర్ హత్య వెనుక భారత ప్రభుత్వ ఏజెంట్ల హస్తం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గతేడాది చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు భగ్గుమన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఇటీవల నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మ పేరును చేర్చడంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సంజయ్ వర్మ సహా ఆ దేశంలోని మన దౌత్యవేత్తలను భారత్ వెనక్కి రప్పించింది. అదే సమయంలో దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఇటీవల బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయంపై ఖలిస్థానీ సానుభూతిపరులు దాడి చేయగా.. భారత్ తీవ్రంగా ఖండించింది.

## ఎనిమిదో రోజూ అధ్వానంగానే గాలి నాణ్యత



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వరుసగా ఎనిమిదవ రోజూ గాలి నాణ్యత అధ్వానంగా మారింది. పలు చోట్ల ఏక్యూఐ లెవల్స్ 400గా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. శుక్రవారం ఉదయం ఢిల్లీ - ఎన్సీఆర్ ప్రాంతంలో గాలి సూచీ 383గా నమోదైంది. బవానా ప్రాంతంలో గాలి సూచీ 440గా, ముండ్కాలో 428, న్యూ మోతీ బాగ్‌లో 427, రోహిణి ప్రాంతంలో 439, పంజాబీ బాగ్‌లో 406, ఆర్‌కే పురంలో 406గా నమోదైంది. వీటితో పాటు ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ లెవల్స్ 400 కంటే ఎక్కువగానే నమోదైంది.మరోవైపు కాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడు తున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరోవైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యమునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో గురువారం ఉదయం 9 గంటలకు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 367కు చేరింది. కొన్ని ప్రాంతాల్లో ఇది 400కు చేరింది. ఇటీవలే కాలుష్యం కారణంగా శ్వాసకోశ వ్యాధులతో దవాఖానలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నదని వైద్యులు తెలిపారు.

### దిల్లీలో కాలుష్యం నేపథ్యంలో కేంద్రం చర్యలు...

దేశ రాజధాని నగరం దిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రంగా పతనమవుతుండటంతో కేంద్రం కఠిన చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పంట వ్యర్థాలు తగులబెట్టినవారికి విధించే జరిమానాను రెట్టింపు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, రెండు ఎకరాల కన్నా తక్కువ భూమి గల రైతులపై పర్యావరణ నష్టపరిహారం రూ.5 వేలు విధించవచ్చు. రెండెకరాల నుంచి ఐదు ఎకరాల లోపు భూమి కలవారికి రూ.10 వేలు, ఐదు ఎకరాల కన్నా ఎక్కువ భూమి కలవారికి రూ.30 వేల వరకు విధించవచ్చు.

## జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మళ్లీ గందరగోళం



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ శాసనసభ సమావేశాల్లో శుక్రవారం మళ్లీ అదే ఉద్రిక్తత కొనసాగింది.రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని పునరు ద్ధరించాలంటూ అసెంబ్లీలో చేసిన తీర్మానంపై బీజేపీ నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఈవిషయంలో ప్రాంతీ య పార్టీలు, కమలం పార్టీ అవలంబిస్తోన్న భిన్నవైఖరి సభలో గందరగోళానికి కారణమైంది. దాంతో అరుపులు, తోపులాటలు, వాకౌట్లతో కార్యకలాపాలు స్తంభించాయి. మరోవైపు, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సునీల్ శర్మ(బీజేపీ) మాట్లాడుతుండగా.. బారాముల్లా ఎంపీ ఇంజినీర్ రషీద్ సోదరుడు, అవామీ ఇత్తేహాద్ పార్టీ ఎమ్మెల్యే ఖుర్షీద్ అహ్మద్ వెల్ వద్దకు దూసుకొచ్చి, ఆర్టికల్ పునరుద్ధరించాలని బ్యానర్ ప్రదర్శించారు. దాంతో భాజపా నేతలు జోక్యం చేసుకున్నారు. ఆ బ్యానర్‌ను లాగి, చించివేయడంతో అది కాస్తా తీవ్ర గందరగోళానికి కారణమైంది. ఖుర్షీద్‌తో పాటు భాజపా ఎమ్మెల్యేలను మార్షల్స్ బయటకు పంపివేశారు. తమ నేతలను మార్షల్స్‌తో బయటకు పంపించడాన్ని వ్యతిరేకిస్తూ భాజపా వాకౌట్ చేసింది. ఈ పరిణామాల మధ్య సభ 15 నిమిషాలు వాయిదా పడింది. ఆ తర్వాత కూడా సభలో నిరసనలు కొనసాగాయి. అధికరణాలు 370, 35ఏలను పునరుద్ధరించాలంటూ ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకువచ్చిన తీర్మానాన్ని భాజపా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దానిని ఉపసంహరించు కోవాలని చేస్తోన్న డిమాండ్‌ను స్పీకర్ తోసిపుచ్చారు.

## కంటెంట్ క్రియేటర్‌ను వాట్సప్‌లో కాంటాక్ట్ అయిన సుధామూర్తి



**దిల్లీ:** రాజ్యసభ ఎంపీగా తనవంతుగా ప్రజా సమస్యలను లేవనెత్తాలని సుధామూర్తి భావిస్తున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఆహార కల్తీ అంశాన్ని ప్రస్తావించిన ఆమె.. దానికి ముందు కొంత పరిశోధన చేశారు. ఆమేరకు ఫుడ్ ఫార్మర్‌గా ఫేమస్ అయిన కంటెంట్ క్రియేటర్ రేవంత్ హిమత్సింగా ను వాట్సప్‌లో కాంటాక్ట్ అయ్యారట. ఈవిషయాన్ని రేవంత్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు."ఆహారకల్తీ అంశంపై రాజ్యసభలో మాట్లాడేందుకు పలు వివరాల కోసం సుధామూర్తి మేడమ్ నన్ను సంప్రదించారు. ఒక ఫుడ్ ఫార్మర్‌గా ఇది నాకు దక్కిన అతిపెద్ద గౌరవం. ఆమె ఎంతో నిరాడంబరమైన వ్యక్తి. ఆ వివరాల కోసం ఆమె నేరుగా వాట్సప్‌లో ఒక ఫ్రెండ్ మాదిరిగా నన్ను కాంటాక్ట్ అ య్యారు" అని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. అలాగే రాజ్యసభలో ఆహారకల్తీపై ఆమె మాట్లాడుతున్న వీడియోను పంచుకున్నారు. "మనం ఎలాంటి ఆహారం తీసుకుంటున్నాం.. ఎలాంటి వ్యాధులు వస్తున్నాయని ఒకసారి ఆలోచించుకోవాలి. ఆహారకల్తీ, ఇతర కారణాలతో దేశంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి" అని ఆమె అందులో మాట్లాడటం కనిపించింది.అలాగే హోటల్ ఇండస్ట్రీలో వాడుతున్న సింథటిక్ కలర్, సింథటిక్ వెనిగర్, టేస్టింగ్ పౌడర్ గురించి ప్రస్తావించారు. అవి చూడటానికి ఆకర్షణీయంగా కనిపిస్తాయని, కాని భవిష్యత్తులో అవి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని ప్రజలకు తెలియదన్నారు. ఇక ఈ ఆహారకల్తీ అంశంపై రానున్న రోజుల్లో కూడా తాను సుధామూర్తితో కలిసి పనిచేయనున్నట్లు రేవంత్ తెలిపారు. ప్రపంచంలోని శక్తిమంతమైన వ్యక్తులు మంచికోసం పోరాడితే గొప్ప మార్పు చోటుచేసుకుంటుందని వ్యాఖ్యానించారు.

73 ఏళ్ల సుధామూర్తి ప్రస్తుతం 'మూర్తి ట్రస్ట్'కు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. రచయిత్రిగా, విద్యావేత్తగా, వితరణశీలిగా దేశవ్యాప్తంగా సుపరిచితమే. ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్‌లో వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. పలు అనాథాశ్రమాలను నెలకొల్పారు. గ్రామీణాభివృద్ధికి, విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నారు. కర్ణాటకలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్, గ్రంథాలయ వసతులు కల్పించారు. ఆమె సేవలకు గుర్తింపుగా 2006లో కేంద్రం పద్మశ్రీ, 2023లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది.

## అలీగఢ్ యూనివర్సి మైనార్టీ విద్యాసంస్థగా పరిగణించలేంః సుప్రీం



**దిల్లీ:** అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ కి మైనార్టీ హోదా విషయంలో సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. దీనిని మైనార్టీ విద్యాసంస్థగా పరిగణించలేమంటూ 1967లో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తాజాగా ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తోసిపుచ్చింది. అయితే, దీనికి మైనార్టీ హోదా ఉండాలా? వద్దా? అన్న అంశాన్ని తేల్చేందుకు ఈ పిటిషన్లను కొత్త బెంచ్‌కు బదిలీ చేస్తున్నట్లు వెల్లడించింది. ఈమేరకు 4:3 మెజార్టీతో తీర్పు వెలువరించింది.1967లో అజీజ్ బాషా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో భాగంగా అలీగఢ్ ముస్లింవిశ్వవిద్యాలయాన్ని కేంద్రవర్సిటీగా పేర్కొంటూ అప్పటి ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. అందువల్ల, దాన్ని మైనార్టీ విద్యాసంస్థగా పరిగణించలేమని నాడు వెల్లడించింది. కానీ, 1981లో ఏఎంయూ సవరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించడంతో ఈ విద్యా సంస్థకు మళ్లీ మైనార్టీ హోదా లభించింది.అయితే, ఈ చట్ట సవరణను సవాల్ చేస్తూ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఏఎంయూ కు మైనార్టీ హోదా కల్పించే 1981 చట్ట నిబంధనను కొట్టివేస్తూ 2006 జనవరిలో తీర్పు వెలువరించింది. అనంతరం ఈ వ్యవహారం సుప్రీంకోర్టు కు చేరింది.దీనిపై తాజాగా విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. 1967 నాటి ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును తోసిపుచ్చింది. అదే సమయంలో 2006 నాటి అలహాబాద్ హైకోర్టు తీర్పు చెల్లుబాటుపై నిర్ణయం తీసుకునేందుకు కొత్త బెంచ్‌ను ఏర్పాటుచేయనున్నట్లు వెల్లడించింది. 1875లో మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజీగా ఈ విద్యా సంస్థ ప్రారంభమైంది. ఆ తర్వాత 1920లో యూనివర్సిటీగా మార్చారు.

## నాకు అమెరికాలో భవిష్యత్తు లేదు మస్క్ కుమార్తె ఆందోళన

**వాషింగ్టన్:** అమెరికా ఎన్నికల ఫలితాలపై టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ ఖుషీగా ఉండగా.. అతడి కుమార్తె వివియన్ జెన్నా విల్సన్ మాత్రం తీవ్రంగా ఆందోళన చెందుతోంది. తనకు అమెరికాలో భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని పేర్కొంది. ఈ మేరకు సామాజిక మాధ్యమం థ్రెడ్స్‌లో ఓ పోస్టును పెట్టింది. "నేను కొన్నాళ్లుగా భయపడుతున్నది.. నిన్న వాస్తవరూపం ధరిం చింది. అమెరికాలో ఉంటే నాకు ఎటువంటి భవి ష్యత్తు కనిపించడం లేదు. అతడు (ట్రంప్) నాలుగేళ్లే అధ్యక్షుడిగా ఉండనున్నా.. లింగమార్పిడి వ్యతిరేక నిబంధనలు ఒక్కసారిగా అమల్లోకి రాకపోయినా.. వాటిని కావాలని ఓటేసినవారు అంత తొందరగా మారరుగా.." అని ఆవేదన పూరితమైన పోస్టు చేసింది. ఆమె అమెరికాను వీడుతుందన్న పోస్టు గురించి తెలుసుకొన్న మస్క్ కూడా ఎక్స్‌లో స్పందించారు. 'నా కుమారుడిని ఓక్ మైండ్‌సెట్ చంపేసింది' అని మరోసారి పునరుద్ఘాటించారు. దీనిపై జెన్నా స్పందిస్తూ.. తన తండ్రి ట్వీట్ స్క్రీన్ షాట్‌ను థ్రెడ్‌లో పోస్టు చేసింది. "ఇంకా నా బిడ్డకు ఏదో సోకింది.. నన్ను నా బిడ్డ ద్వేషించడానికి అదే కారణం అంటూ మళ్లీ పాత కథలే చెప్పొద్దు. వాటిని పట్టించుకోవద్దు. ఏరకంగా చూసినా నేనే బాధితురాలిని" అని రాసుకొచ్చింది. ఎలాన్ మస్క్ తొలి భార్యకు జన్మించిన సంతానంలో జస్టిన్ విల్సన్ కూడా ఒకరు. 2022లో లింగమార్పిడి చేయించుకొని తన పేరును వివియన్ జెన్నా విల్సన్‌గా మార్చుకొంది. మస్క్‌కు ఇది ఏమాత్రం ఇష్టం లేదు. దీంతో ఆమె తన తండ్రికి దూరంగా ఉంటోంది. "జెన్నాకు కమ్యూనిస్టు భావాలు ఎక్కువ. డబ్బులున్న వాళ్లందరూ చెడ్డవాళ్లు అని భావిస్తుంది. ఆమె అలా మారడానికి తను చదువుకున్న స్కూలే కారణం. తిరిగి ఆమెతో సత్సంబంధాలు ఏర్పరుచుకోవడానికి చాలాసార్లు ప్రయత్నించి విఫలమయ్యాను. కానీ ఆమె నాతో కాస్త సమయం కూడా గడపడానికి ఇష్టపడలేదు.

## విద్వేషాలు రెచ్చగొట్టేవాళ్లకు ప్రజలే గుణపాఠం చెబుతారు : తేజస్వి యాదవ్



**పాట్నా:** దేశంలో జనం మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వాళ్లకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ () అగ్ర నాయకుడు, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ అన్నారు. విద్వేష రాజకీయాలు ఎంతో కాలం మనలేవని, జనం మధ్య విద్వేషాలను ప్రేరేపించే వారికి జనం ఫుల్ స్టాప్ పెడుతారని ఆయన వ్యాఖ్యానించారు.బీహార్‌లో నాలుగు స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలు, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు తేజస్వి యాదవ్ ఈ విధంగా స్పందించారు. బీహార్‌లో ఉప ఎన్నికలు జరుగుతున్న నాలుగు స్థానాలను తామే గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తమ కూటమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.కాగా, జార?ండ్ అసెంబ్లీకి ఈ నెల 13, 20 తేదీల్లో రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలతోపాటే బీహార్ సహా పలు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. అదేవిధంగా మహారాష్ట్రలో కూడా ఈ నెల 20న ఒకే విడతలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరనుంది. ఈ నెల 23న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.

## ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని విశ్వసిస్తున్నాం

### ట్రంప్, కమలాహారిస్‌కు రాహుల్ గాంధీ లేఖ..



**దిల్లీ:** అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ట్రంప్, కమలా హారిస్‌లకు లేఖ రాశారు. ఈసందర్భంగా ట్రంప్ నాయకత్వంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని విశ్వసిస్తున్నట్లు తెలిపారు.'అమెరికాకు 47వ అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌నకు అభినందనలు. భవిష్యత్తు కోసం ప్రజలు మీ విజన్‌పై విశ్వాసం ఉంచారు. ప్రజాస్వామ్య విలువలపై మన దేశాలు చూపుతున్న నిబద్ధత ఇరుదేశాల మధ్య చరిత్రాత్మ కమైన స్నేహాన్ని పంచుకుంటున్నాయి. మీ నాయకత్వంలో పరస్పర ప్రయోజనాల కోసం ఇరుదేశాల సంబంధాలు మరింత బలపడతాయని విశ్వసిస్తున్నాం' అని రాహుల్ రాసుకొచ్చారు.ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అధ్యక్ష ఎన్నికలకు చేసిన కృషిని అభినందిస్తూ రాహుల్ గాంధీ లేఖ రాశారు. 'అధ్యక్ష ఎన్నికల్లో మీ ఉత్సాహవంతమైన ప్రచారానికి నా అభినందనలు. అందరినీ ఏకం చేయాలనే మీ సందేశం అందరికీ స్ఫూర్తినిస్తుంది. బైడెన్ పరిపాలనలో ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాల్లో భారత్- అమెరికా సహకారాన్ని మరింత పెంచాయి. ప్రజాస్వామ్య విలువలపై మన భాగస్వామ్య నిబద్ధత ఇరుదేశాలకు మార్గదర్శకంగా కొనసాగుతుంది' అని పేర్కొన్నారు.

## రష్యా నుంచి చమురు కొనుగోలు చేసి ప్రపంచానికి మేలు చేశాం: హర్దీప్ సింగ్ పురి




దిల్లీః పశ్చిమ దేశాల ఆంక్షల వేళ రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై తాజాగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం వల్ల తాము ప్రపంచానికి మేలు చేశామని చెప్పారు. అలా చేయకపోయి ఉంటే అంతర్జాతీయంగా చమురు ధర మరింత పెరిగేదన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా సుదీర్ఘ పోస్ట్ చేశారు. "రష్యా చమురు కొని భారత్ యావత్ ప్రపంచానికి మేలు చేసింది. ఒకవేళ మేం అలా చేయకపోయి ఉంటే అంతర్జాతీయంగా ఇంధన ధరలు ఆకాశాన్నంటేవి. బ్యారెల్ చమురు ధర 200 డాలర్ల (రూ.16 వేలకు పైమాటే)ను చేరేది. రష్యా నుంచి చమురు దిగుమతులపై ఎలాంటి ఆంక్షలు లేవు.కేవలం ధరల పరిమితి మాత్రమే ఉంది. దాన్ని భారతీయ సంస్థలు కూడా అనుసరిస్తు న్నాయి. ఈ కొనుగోళ్ల కారణంగా భారత్‌పై ఆంక్షలు పడే అవకాశముందని కొందరు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారు. కానీ, ఇదే సమయంలో ఐరోపా, ఆసియాకు చెందిన చాలా దేశాలు రష్యా నుంచి బిలియన్ డాలర్ల విలువైన ముడి చమురు , డీజిల్, ఎల్ఎన్‌జీ, అరుదైన ఖనిజాలను కొనుగోలు చేశారన్న విషయాన్ని మర్చిపోకూడదు" అని కేంద్రమంత్రి రాసుకొచ్చారు.ధరల పరంగా మన చమురు సంస్థల కు ఎక్కడ లాభం చేకూరుతుందో అక్కడి నుంచి ఇంధన కొను గోళ్లను కొనసాగిస్తామని హర్దీప్ సింగ్ పురి మరోసారి స్పష్టం చేశారు. మన దేశ పౌరు లకు అందుబాటు ధరల్లో స్థిరమైన ఇంధన వనరులను అందించడమే తమ అగ్ర ప్రాధా న్యమని తెలిపారు. అంతర్జాతీయంగా చము రు ధరలు పెరుగుతున్నప్పటికీ గత మూడేళ్లుగా ఇంధన ధరలు తగ్గుతున్న ఏకైక దేశం మనదేనన్నారు.

విశ్వంభర V3 NEWS

## ఏలూరు పోలీసులను అభినందించిన సీఎం చంద్రబాబు

విశ్వంభర, ఏలూరు: దొంగలించిన 251 ద్విచక్రవాహనాలను ఏలూరు పోలీసులు స్వాధీనం చేసుకుని, 25 మంది అనుమానితులను అరెస్టు చేయటం సంతోషకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఈ కేసులను ఛేదించి బాధిత కుటుంబాలకు ఉపశమనం కలిగించడానికి సరికొత్త సాంకేతికతను ఉపయోగించడం హర్షనీయమన్నారు. సత్వర చర్యలతో ప్రజలకు సేవ చేసిన ఏలూరు పోలీసులను చంద్రబాబు అభినందించారు. నీలి అలివేణి అనే మహిళ తన తలసేమియా బాధిత కుమార్తెను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఉపయోగించిన స్కూటర్ గతంలో చోరీకి గురైంది. బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని తిరిగి అప్పగిస్తున్నప్పుడు ఆమె భావోద్వేగాలు కదిలించాయని చంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఏపీ పోలీసు శాఖ 'ఎక్స్'లో పోస్టు చేసిన వీడియోను చంద్రబాబు రీట్వీట్ చేశారు. రోజువారీ రవాణా, జీవనోపాధికి వాడే వాహనాలు చోరీకి గురైతే ఆయా కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురవుతాయన్నారు.



## ఏపీని రావణకాష్టం చేయాలనే కుట్ర..

### జగన్‌ను అరెస్ట్ చేయాలి: ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



**విశ్వంభర, వినుకొండ:** వైసీపీ అధ్యక్షుడు జగన్ తన క్రిమినల్, ఫ్యాక్షనిస్ట్ మనస్తత్వాన్ని బయటపెట్టుకుంటున్నారని ఎమ్మెల్యే జీవీ ఆంజ నేయులు విమర్శించారు. డీజీపీనే బెదిరించడం ద్వారా పోలీసులను భయపెట్టాలని కుయుక్తి పన్నుతున్నారని ఆరోపించారు. "రౌడీలను రెచ్చగొట్టి పోలీసులను భయపెట్టాలని జగన్ చూస్తున్నారు. రాష్ట్రాన్ని రావణకాష్ఠం చేయాలని కుట్ర పన్నుతున్నారు. ఏపీలో నేరాలు తగ్గి శాంతి నెలకొనాలంటే ఆయన్ను అరెస్ట్ చేయాలి. రౌడీ షీటర్లు, హంతకులను జైళ్లకు పంపిస్తే వైకాపా దాదాపు ఖాళీ అవుతుంది" అని జీవీ ఆంజనేయులు అన్నారు.

## అసెంబ్లీకి రాని జగన్‌కు రాజకీయ పార్టీ ఎందుకు?: భూమిరెడ్డి



**విశ్వంభర, మంగళగిరి:** ఎన్నికల్లో ఎలా అక్రమాలు చేయాలో జగన్‌కు తెలిసినట్లు మరెవరికీ తెలియదని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విమర్శించారు. బ్యాలెట్ పద్ధతిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆయన ఎందుకు దూరంగా ఉంటున్నారని ప్రశ్నించారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భూమిరెడ్డి మాట్లాడారు. గౌతమ్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించి ఎందుకు వెనక్కి తగ్గారని నిలదీశారు. ఎన్నికల్లో పాల్గొనకుండా, అసెంబ్లీకి రాకుండా జగన్‌కు రాజకీయ పార్టీ ఎందుకని మండిపడ్డారు. పులివెందులలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించలేని ఆయనకు జీతమెందుకన్నారు. వెంటనే రాజీనామా చేస్తే.. పులివెందులకు మరో ఎమ్మెల్యే వస్తారని వ్యాఖ్యానించారు.

## రఘురామకృష్ణ రాజు కస్టోడియల్ టార్చర్ కేసు విచారణ మరోసారి వాయిదా



**విశ్వంభర, అమరావతి:** మాజీ ఎంపీ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ నెల 25న తదుపరి విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసులో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇందుకు సంబంధించి ఏపీ ప్రభుత్వం తాజాగా కౌంటర్ దాఖలు చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ తమకు గురువారమే అందిందని, రిజాయిండర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని విజయ్‌పాల్ తరఫు న్యాయవాదులు కోరారు. ఈక్రమంలో రెండు వారాలు గడువు ఇస్తున్నట్లు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ మహదేవన్ ధర్మాసనం తెలిపింది. ఈ నెల 25న తుది విచారణ చేపడతామని పేర్కొంది. ఆ తర్వాత వాయిదాలు ఉండవని.. ఆరోజే అన్ని విషయాలపై నిర్ణయం ఉంటుందని స్పష్టం చేసింది.

## 'సరస్వతీ పవర్' కేసులో జగన్ పిటిషన్‌పై విచారణ వాయిదా



విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో సరస్వతీ పవర్ కేసుకు సంబంధించి జగన్ పిటిషన్‌పై విచారణ జరిగింది. కౌంటర్ దాఖలు చేయడానికి విజయమ్మ, షర్మిల తరఫు న్యాయవాది సమయం కోరారు. విచారణను ఎన్‌సీఎల్‌టీ డిసెంబర్ 13వ తేదీకి వాయిదా వేసింది. సరస్వతీ పవర్ కంపెనీలో షేర్ల బదిలీపై జగన్ ఎన్‌సీఎల్‌టీలో ఇటీవల పిటిషన్ వేశారు. తనకు తెలియకుండా తల్లి, సోదరి అక్రమంగా షేర్లు బదిలీ చేసుకున్నారని అందులో పేర్కొన్నారు. విజయమ్మ, షర్మిల, జనార్దన్‌రెడ్డిని ప్రతివాదులుగా చేర్చారు. షేర్ల బదిలీ ఫారాలు, ఇతర డాక్యుమెంట్లు ఏమీ సమర్పించకుండానే తమ పేర్ల మీదకు మార్చుకున్నారని జగన్ చెప్పారు. జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ పేరిట షేర్లు కొనసాగేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. 51.01 శాతం షేర్లను యథావిధిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## అసెంబ్లీకి వెళ్లకపోతే పదవి ఎందుకు.. రాజీనామా చేయాలి.. జగన్‌పై షర్మిల ఫైర్



విశ్వంభర, అమరావతి: ఏపీకి బీజేపీ ఇచ్చేది గుండు సున్నా అని వైఎస్ షర్మిల అన్నారు. అయినా చంద్రబాబు పొత్తు పెట్టుకోవడం దారుణమని విమర్శించారు. బీజేపీకి చంద్రబాబు, జగన్ ఊడిగం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జగన్‌పై విరుచుకుపడ్డారు. అసెంబ్లీకి పోనివాళ్లు ఎవరైనా రాజీనామా చేయాలని షర్మిల సూచించారు. జగన్ అయినా, వైసీపీ ఎమ్మెల్యేలు అయినా అసెంబ్లీకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే పదవులు ఎందుకు అని ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లకుంటే జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో తాము అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదని వైఎస్ జగన్ ఇటీవల మీడియాతో తెలిపారు. ప్రతిపక్ష నాయకుడికి మైక్ ఇస్తేనే ప్రజా సమ్యలను అసెంబ్లీలో ప్రస్తావించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం.. వైసీపీకి మైక్ ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు. అటువంటప్పుడు సమావేశాలకు హాజరవ్వడం వల్ల ఉపయోగం ఏంటని ప్రశ్నించారు. అందుకే అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదని స్పష్టం చేశారు.

## వర్రా రవీందర్‌రెడ్డి కోసం కొనసాగుతున్న గాలింపు

**విశ్వంభర, కడప:** వైసీపీసామాజిక మాధ్యమకార్యకర్త, వర్రా రవీందర్‌రెడ్డి కోసం వైఎస్సార్ జిల్లా పోలీసుల గాలింపు కొనసాగుతోంది. 4 ప్రత్యేక బృందాలు అతడి ఆచూకీ కోసం యత్నిస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూరుతో పాటు కమలాపురం, పులివెందుల ప్రాంతాలకు పోలీసు బృందాలు వెళ్లాయి. వర్రా రవీందర్‌రెడ్డి వాడే రెండు ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయని, అన్ని రకాలుగా నిఘా పెట్టామని పోలీసు అధికారులు తెలిపారు. వర్రా రవీందర్‌రెడ్డి సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనిత, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, జగన్ తల్లి విజయమ్మ, మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె సునీతలపై సోషల్ మీడియాలో అత్యంత హేయంగా, జుగుప్సాకరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని కడప పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వర్రా రవీందర్‌రెడ్డిని పోలీసులు వదిలేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీనిపై సీఎం చంద్రబాబు, డీజీపీ ద్వారకా తిరుమలరావు తీవ్రంగా స్పందించారు. కర్నూలు రేంజ్ డీఐజీ ప్రవీణ్‌ను కడపకు పంపి ఆయన ఇచ్చిన నివేదిక మేరకు జిల్లా ఎస్పీని బదిలీ చేయడంతో పాటు మరికొన్ని చర్యలకు ఉపక్రమించింది. పులివెందులకు చెందిన వైకాపా కీలక నేతతో పోలీసులు చేసుకున్న లోపాయికారి ఒప్పందంతో 41-ఏ నోటీసులిచ్చి వదిలేసినట్లు ఆరోపణలున్నాయి. నోటీసులిచ్చి వదిలేసే సమయంలో మరో కేసులో అరెస్టు చేసేందుకు రాజంపేట పోలీసులు కడపకు రాగా, కడప పోలీసులు వారికి అప్పగించకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో రవీందర్‌రెడ్డి పారిపోయాడు. దీంతో అతడి కోసం గాలింపు కొనసాగుతోంది.



## తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కేఏ పాల్ వేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు

విశ్వంభర, తిరుమల: తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. కేఏ పాల్ వేసిన పిటిషన్‌పై శుక్రవారం ఉదయం విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కేఏ పాల్ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తిరుమల దేవాలయాల నిర్వహణ పాలకమండలి చేతిలో కాకుండా పూజారుల చేతుల్లో ఉంచాలని ఆ పిటిషన్‌లో కేఏ పాల్ కోరారు. కేవలం 744 మంది కేథలిక్‌లు ఉన్న వాటికన్ సిటీని ప్రత్యేక ప్రాంతంగా గుర్తించారని.. అలాగే లక్షలాది మంది భక్తులకు ప్రాధాన్యత ఉన్న తిరుపతి కూడా అదేవిధంగా ప్రత్యేక ప్రాంతంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తిరుమల దేవాలయానికి వచ్చే వేల కోట్ల ఆదాయం దుర్వినియోగం అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, సీబీఐ, డీజీపీలను కేఏ పాల్ ప్రతివాదులుగా చేరుస్తూ పిటిషన్ దాఖలు చేశారు.



## గిరిజనుల సమస్యల కోసం పరిష్కార వేదిక: సోమిరెడ్డి



విశ్వంభర, సర్వేపల్లి: నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని 39 వేల మంది గిరిజనుల కోసం పరిష్కార వేదిక ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గిరిజనుల్లో చాలా మందికి ఆధార్, రేషన్‌కార్డులు లేవని, సుమారు 90శాతం మంది నిరక్షరాస్యులు ఉన్నారని చెప్పారు. పింఛన్ సమస్యలు కూడా ఉన్నాయని చెప్పిన ఆయన.. వీటన్నింటినీ పరిష్కరించేందుకే ఓ వేదికను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిరిజనుల దుర్భర జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు." జిల్లా అధికారులంతా గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తున్నారు. గిరిజనుల విషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించకూడదు. 90 శాతం కేంద్ర పథకాలను గిరిజనులకు అందకుండా గత ప్రభుత్వం ఆపేసింది. వాటిని సర్వేపల్లి గిరిజనులకు చేరవేస్తాము. గత ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన గిరిపుత్రులను ఆదుకుంటాం. ప్రతి అధికారి గిరిజనుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదు. స్థానికులకు లోన్లు మంజూరు చేస్తాం. పాఠశాలలను అభివృద్ధి చేస్తాం" అని సోమిరెడ్డి తెలిపారు.

## ఇసుక కోసం వాగులో దిగిన నలుగురు యువకులు గల్లంతు

**విశ్వంభర, అమరావతి :** ఏపీలోని అల్లూరి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది . జిల్లాలోని అడ్డతీగల మండలం తిమ్మాపురంలో ఇసుక కోసం వాగులోకి దిగిన యువకులు నలుగురు గల్లంతయ్యారు . అనధికారికంగా క్వారీలో దిగిన కాకినాడ జిల్లా ఏలేశ్వరం వాసులు భూషణం, బాబు, గొంతయ్య, శ్రీను గల్లంతయ్యారు. ఘటనా స్థలాన్ని రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ సందర్శించారు. గల్లంతైన యువకులకోసం పోలీసులుఈతగాళ్ల సహాయంతో గాలింపు మొదలు పెట్టారు .

## తిరుమలలో భక్తులకు వేడి పాలు అందించాలి : టీటీడీ అడిషనల్ ఈవో



**విశ్వంభర, తిరుమల :** తిరుమల అడిషనల్ ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి నారాయణ గిరి షెడ్లను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. యాత్రికులకు భోజన, పాలు సకాలంలో అందుతున్నాయా అనే అంశంపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. శ్రీవారి సేవకులు భక్తులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. చలికాలం కావడంతో వేడి పాలు నిరంతరాయంగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. తగిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేటట్లుగా చూడాలన్నారు. వైకుంఠ క్యూ కాంప్లెక్స్-2లో వేచి ఉన్న భక్తులకు వీలైనంత త్వరగా దర్శనం చేయిండానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## విజయవాడ-శ్రీశైలం 'సీ ప్లేన్' ట్రయల్ రన్ విజయవంతం



విశ్వంభర, శ్రీశైలం ఆలయం: విజయవాడ-శ్రీశైలం 'సీ ప్లేన్' ట్రయల్ రన్ విజయవంతమైంది. మొదట విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 'సీ ప్లేన్' శ్రీశైలానికి వచ్చింది. అక్కడి జలాశయం నీటిలో సురక్షితంగా ల్యాండ్ అయింది. అనంతరం శ్రీశైలం టూరిజం బోటింగ్ జట్టీ వద్దకు సీ ప్లేన్ చేరుకుంది. ఎస్డీఆర్ఎఫ్, పోలీసు, టూరిజం, ఎయిర్ ఫోర్స్ అధికారుల సమక్షంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ నెల 9న పున్నమిఘాట్‌లో విజయవాడ నుంచి శ్రీశైలం మధ్య 'సీ ప్లేన్' ప్రయోగానికి శ్రీకారం చుట్టనున్నారు. డీ హవిల్లాండ్ ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థ రూపొందించిన 14 సీట్ల సీ ప్లేన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ట్రయల్ రన్ శుక్రవారం విజయవంతమైంది.

## టీడీపీ పెద్దలకు కూడా హిట్లర్ లాంటి గతే పడుతుంది: లక్ష్మీపార్వతి



**విశ్వంభర, అమరావతి:** సోషల్‌మీడియా యాక్టివిస్ట్‌ల అక్రమ అరెస్టులపై వైసీపీ మహిళా నేత లక్ష్మీపార్వతి తీవ్రంగా మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏపీలో నీచమైన సామాజిక వ్యవస్థను తయారు చేస్తుందని విమర్శించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో లక్ష్మీపార్వతి మీడియా తో మాట్లాడారు. ప్రజా సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని లక్ష్మీపార్వతి అన్నారు. హామీల అమలుపై ప్రశ్నిసతే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. సోషల్‌మీడియా కార్యకర్తలను అర్ధరాత్రి ఇంటికెళ్లి మరీ అరెస్టు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేక కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. పాలన చేతగాక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. నీచమైన సామాజిక వ్యవస్థను తయారు చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి మహిళలపై టీడీపీ వాళ్లే దారుణమైన పోస్టులు పెడుతున్నారని లక్ష్మీపార్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి పోస్టుల వల్లే తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. హిట్లర్ లాంటి వ్యక్తే దిక్కుమొక్కు లేకుండా చనిపోయారని.. టీడీపీ పెద్దలకు కూడా అలాంటి పరిస్థితే వస్తుందని విమర్శించారు. ప్రజల కష్టసుఖాలను పట్టించుకోకుండా జనం మీద కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. సోషల్‌మీడియా వల్లే చంద్రబాబు చేస్తున్న అవినీతి బయట పడుతుందని తెలిపారు. తమపైనా అత్యంత దారుణమైన పోస్టులు పెట్టారని తెలిపారు. అప్పట్లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి తనను బూచిగా చూపించారని లక్ష్మీపార్వతి అన్నారు. ఎన్టీఆర్‌ను పిచ్చోడిలా చిత్రీకరించి బొమ్మలు వేశారనిఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు గతంలో ఎన్టీఆర్‌ను కించపరుస్తూ వేసిన కార్టూన్లను మీడియాకు చూపించారు. ఇప్పుడు విజయమ్మ రాసిన లేఖను కూడా ఫేక్ అని టీడీపీ ట్విట్టర్‌లో పెట్టారని అన్నారు. చివరకు విజయమ్మ వీడియో చేసి క్లారిటీ ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు. ఇంత దరిద్రపు పాలనను ఎప్పుడూ చూడలేదని అసహనం వ్యక్తం చేశారు.

## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ధర్నా

గుంటూరు : గుంటూరు ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయం వద్ద ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఆర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నట్లుండి పెన్షన్ నిలుపుదల చేయడంతో విశ్రాంత ఉద్యోగులు ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. వృద్ధాప్యంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. నిలుపుదల చేసిన హయ్యర్ పెన్షన్‌ను తక్షణమే పంపిణీ చేయాలని కోరారు.

## బయటపడిన శ్రీశైలం ఆలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి అవినీతి బాగోతం

**శ్రీశైలం :** శ్రీశైలం దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ అధికారి కె.అయ్యన్న అవినీతి బాగోతం బయటపడింది. భక్తుడికి రూ.10వేలు లంచం డిమాండ్ చేసి రూ.5వేలు తీసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఈనెల 1న ఆలయం సమీపంలోని గణేశ్ సదన్ వద్ద భక్తులు దీపావళి, పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. దీనిపై కె.అయ్యన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా టెంట్, కుర్చీలు ఏర్పా టు చేస్తారా? అని బెదిరించారు. వేడుకలు రాద్ధాంతం అయ్యాయంటూ భక్తుల నుంచి లంచం డిమాండ్ చేశారు. పోలీసులకు తెలిస్తే ఎక్కువ డబ్బులు ఇవ్వాల్సి వస్తుం దని బెది రించారు. దీంతో ఆలయ కార్యాలయంలో వారా కడిమి అనే భక్తుడు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయ్యన్నకు ఫోన్‌పే ద్వారా రూ.5వేలు పంపినట్లు పేర్కొన్నారు.

# అదరగొట్టిన టీమ్ఇండియా..

## తొలి టీ20లో చిత్తుగా ఓడిన సఫారీలు



**డర్బన్:** సఫారీల గడ్డపై భారత యువ జట్టు అదరగొట్టింది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టీ20 పోరులో 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత సంజు శాంసన్ (107: 50 బంతుల్లో 10 సిక్సలు, 7 ఫోర్లు) విశ్వరూపం చూపిన వేళ భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన సఫారీలు.. భారత బౌలర్ల దెబ్బకు 17.5 ఓవర్లలోనే 141 పరుగులకే పరిమితమయ్యారు. ఆ జట్టులో స్టార్ ఆటగాడు క్లాసెన్ (25) టాప్ స్కోరర్. మిగతావారు విఫలమయ్యారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 3, రవి బిష్ణోయ్ 3, అవేశ్ ఖాన్ 2, అర్షదీప్ సింగ్ ఒక వికెట్ పడగొట్టారు.

**అదరగొట్టిన శాంసన్..**

ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన మూడో టీ20లో శతకం చేసిన శాంసన్ దక్షిణాఫ్రికాపై మరోమారు అలాంటి ప్రదర్శనే చేశాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజు నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను మొదలెట్టాడు. కేశవ్ మహరాజ్ వేసిన మూడో ఓవర్‌లో జూలు విదిల్చిన శాంసన్ వరుసగా ఫోర్, సిక్స్ బాది ఒక్కసారిగా ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. నాలుగో ఓవర్లో తొలి బంతికే మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (7) ఔటైనప్పటికీ తర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (21: 17 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించాడు. దీంతో భారత్ ఐదు ఓవర్లకు 49 పరుగులతో నిలిచింది. 8 ఓవర్లో పీటర్ బౌలింగ్‌లో రెండు సిక్సలతో అర్ధశతకం చేసిన సంజు.. ఆ తర్వాత సైతం అదే ఊపును కొనసాగించాడు. 9వ ఓవర్లో పాట్రిక్ బౌలింగ్‌లో సూర్య క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 10 ఓవర్లకు భారత్ 2 వికెట్ల 99 పరుగులతో నిలిచింది. అనంతరం క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ (33)తో కలిసి శాంసన్ విజృంభించాడు. ఈ క్రమంలో శాంసన్ 47 బంతుల్లో శతకం చేశాడు. 15 ఓవర్లకు ముగిసే సరికి భారత్ 167 పరుగులతో నిలిచింది. అయితే 15 ఓవర్లో తిలక్ వర్మ, ఆ తర్వాతి ఓవర్లో శాంసన్ ఔట్ కావడంతో భారత్ స్కోర్ నెమ్మదించింది. తర్వాత వచ్చిన బ్యాటర్లు హార్దిక్ (2), రింకు సింగ్ (11), అక్షర్ పటేల్ (7) భారీ స్కోర్ చేయలేకపోయారు.

# సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు ఘన వీడ్కోలు..



**ఢిల్లీ :** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ విరమణ నేపథ్యంలో శుక్రవారం ఆయనకు ఆఖరి పనిదినం కావడంతో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ వీడ్కోలు సభ నిర్వహించింది. ఈ సందర్భంగా తదుపరి సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన్ను ఆత్మీయ ఆలింగనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ.. సుప్రీంకోర్టును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఆయన నిరంతరాయంగా చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో సుప్రీంకోర్టులో ఒక శూన్యత ఆవరిస్తుందంటూ ఎమోషనల్ అయ్యారు. ''న్యాయం అనే పెద్ద అరణ్యంలో ఒక ఎత్తైన వృక్షం వెనక్కి అడుగు వేస్తే.. పక్షులు తమ కిలకిలరావాలను ఆపేస్తాయి. గాలి దిశ మారుతుంది. మిగతా చెట్లు మారుతూ.. ఆ శూన్యతను భర్తీ చేస్తాయి. కానీ, ఆ అరణ్యం మాత్రం మళ్లీ ఎప్పటికీ ఒకేలా ఉండదు. సోమవారం నుంచి మేం మార్పును ఫీల్ అవ్వాల్సి వస్తుంది. ఈ న్యాయస్థానం స్తంభాల ద్వారా శూన్యత ప్రతిధ్వనిస్తుంది. బార్ అసోసియేషన్ సభ్యులు, బెంచ్ సభ్యుల గుండెల్లో నిశ్శబ్దత నెలకొంటుంది'' అని వ్యాఖ్యానించారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇచ్చిన పలు తీర్పులను ప్రస్తావిస్తూ.. ఆయన ఓ స్కాలర్, ధర్మశాస్త్ర పండితుడు అన్నారు. అనేక గొప్ప తీర్పులను ఇస్తూ వృత్తిపరమైన, వ్యక్తిగతమైన ప్రశాంతతను పొందారంటూ ఆయనలోని సుగుణాలను ప్రశంసించారు. శుక్రవారం ఇచ్చిన రెండు తీర్పులతో పాటు 38 రాజ్యాంగ ధర్మాసనం తీర్పులు ఇచ్చారని.. ఇది ఎవరూ అంత తేలిగ్గా బ్రేక్ చేయలేని రికార్డు అన్నారు. వైవిధ్యమైన అంశాలపై ప్రసంగించడంలో ఆయన సామర్థ్యాన్ని అనుకరించడం కష్టతరమైన మరో ఘనత అని పేర్కొన్నారు. సుదీర్ఘ ప్రసంగాలను అనర్గళంగా చేయగలిగే విలక్షణమైన వక్త అన్నారు.

సీజేఐగా న్యాయ సేవలను అందరికీ అందుబాటులోకి తేవాలని, సుప్రీంకోర్టును మరింతగా మెరుగుపరచాలనే సంకల్పంతో అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. కొత్త ఛాంబర్ల నిర్మాణం మొదలుకొని ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు, సిబ్బంది సంక్షేమం కోసం నిర్విరామంగా కృషిచేశారని ప్రశంసించారు. కోర్టులో జరిగే వాదప్రతివాదాలను లైవ్ స్ట్రీమింగ్, హైబ్రిడ్‌హియరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనువాదం, ఈఫైలింగ్ వంటి సాంకేతికత పద్ధతులను కోర్టులు, న్యాయవాదుల ఇంటి వద్దకు తీసుకొచ్చేలా కృషి చేశారన్నారు. తద్వారా వందలాది మంది న్యాయవాదుల జీవితాలు ప్రశాంతంగా ఉన్నాయని పేర్కొన్నారు. గొప్ప అంకిత భావంతో పనిచేసిన అలాంటి వ్యక్తి పదవీవిరమణతో నిస్సందేహంగా శూన్యత ఏర్పడుతుందని, కోర్టులో భౌతికంగా ఆయన లేకపోయినా.. ఎల్లప్పుడు తమ మనస్సుల్లో నిండి ఉంటారని, తమ మధ్య ఒకరిగా ఉంటారని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు.

# ఎడారి దేశంలో క్రికెట్ జాతర

## 10 జట్లతో సరికొత్తగా టోర్నీ



**దుబాయి:** ఎడారి దేశంలో పొట్టి క్రికెట్ జాతరకు మరికొన్ని రోజుల్లో తెరలేవనుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబీ వేదికగా నవంబర్ 21వ తేదీన ప్రతిష్ఠాత్మక టీ10 లీగ్ షురూ కానుంది. ఈసారి జరుగబోతున్న 8వ సీజన్‌కు ఓ ప్రత్యేకత ఉంది. మునపెన్నడూ లేని విధంగా టైటిల్ కోసం ఈ సీజన్‌లో 10 జట్లు పోటీ పడనున్నాయి. దాంతో, ఈ మెగా టోర్నీ మరింత ఆసక్తికరంగా సాగుతూ.. అభిమానులను అలరించనుంది. అబుదాబీ టీ10 లీగ్ 8వ సీజన్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను నిర్వాహకులు విడుదల చేశారు. టోర్నీలో భాగంగా 40 మ్యాచ్‌లను జయెద్ క్రికెట్ స్టేడియం, అబుధాబీ క్రికెట్ స్పోర్ట్స్ హబ్‌లో నిర్వహించున్నారు. 10 ఓవర్ల ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీ కేవలం 12రోజుల్లోనే ముగియనుంది. రౌండ్ రాబిన్ పద్ధతిన సాగే లీగ్ మ్యాచ్‌ల అనంతరం టాప్ - 5 జట్లు ఫైనల్ బెర్తు కోసం తలపడుతాయి.

రెండు ప్లే ఆఫ్స్ అనంతరం.. ఎలిమినేటర్ 1, ఎలిమినేటర్ 2 మ్యాచ్‌లు ఉంటాయి. ఇక క్వాలిఫయర్ 1, క్వాలిఫయర్ 2లో గెలుపొందిన జట్లు కప్ కోసం అమీతుమీకి సిద్ధమవుతాయి. డిఫెండింగ్ చాంపియన్ న్యూయార్క్ స్ట్రయికర్స్ నవంబర్ 22న తొలి మ్యాచ్ ఆడనుంది. నిరుడు రన్నరప్ దక్కన్ గ్లాడియేటర్స్ జట్టు ఈసారి కప్ ముద్దాడలనే పట్టుదలతో ఉంది.

పది జట్లు ఇవే : న్యూయార్క్ స్ట్రయికర్స్, దక్కన్ గ్లాడియేటర్స్, ఢిల్లీ బుల్స్, టీమ్ అబుదాబీ, నార్తర్న్ వారియర్స్, మొర్రిస్‌విల్లే సాంప్ ఆర్మీ, బంగ్లా టైగర్స్, చెన్నై బ్రేవ్ జాగ్వార్స్, యూపీ నవాబ్స్, బోల్ట్స్ అజ్మన్.

# ఛాంపియన్స్ ట్రోఫీలో హైబ్రిడ్ మోడల్

### ఆ వార్తలను ఖండించిన పాక్!




**ఇస్లామాబాద్:** వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ అతిథ్యమివ్వనుంది. ఈ తరుణంలో టీమ్ఇండియా ఆడే మ్యాచ్‌లకు సంబంధించి సర్దుబాట్లు చేసుకోవడానికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే.. వీటిని పీసీబీ ఖండించినట్లు తెలుస్తోంది. ఆ అంశంపై తాము మాట్లాడలేదని పాక్ బోర్డు వర్గాలు మీడియాకు వెల్లడించాయి. ''పాకిస్థాన్ హైబ్రిడ్ మోడల్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. కరాచీ, లాహోర్, రావల్పిండి వేదికల్లో మ్యాచులు నిర్వహించడానికే ఆసక్తిగా ఉన్నాం'' అని పేర్కొన్నాయి.

నవంబర్ 11న ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ప్రకటిస్తుందనే ఊహాగానాల నేపథ్యంలో పీసీబీ స్పందించినట్లు వార్తలు వచ్చాయి. ఇదిలా ఉంటే.. ఈ ట్రోఫీకి సంబంధించి ఏర్పాట్లను పరిశీలించడానికి ఐసీసీ బృందం వచ్చే వారం పాక్‌లో పర్యటించనుంది.

**పీసీబీకి చెప్పేసిన బీసీసీఐ!**


ఈ ట్రోఫీ నిమిత్తం తమ టీమ్‌ను పంపబోమని పీసీబీకి బీసీసీఐ ఇప్పటికే అధికారికంగా సమాచారం ఇచ్చినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. పాక్‌లో మ్యాచ్‌లకు సంబంధించి తన ఆందోళనలను తెలియజేసిందని, తటస్థ వేదికలపైనే ఆడాలని అనుకుంటున్నట్లు బీసీసీఐ స్పష్టం చేసిందని వెల్లడించాయి. రెండు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్‌లో ఆడేందుకు తిరస్కరిస్తూ వస్తోన్న బీసీసీఐ .. ఎప్పుడో ఈ హైబ్రిడ్ మోడల్‌ను ప్రతిపాదించింది. 2023లో ఆసియాకప్‌ను కూడా పాకిస్థాన్ ఇలాగే హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించింది. పాకిస్థాన్‌లో పర్యటించడానికి భారత ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో... టీమ్ఇండియా తన మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడిన విషయం తెలిసిందే.



# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. రిలయన్స్, ఐసీఐసీఐ, వంటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. దీనికితోడు విదేశీ సంస్థాగత మదుపర్లు క్రమంగా తమ నిధులను మార్కెట్ నుంచి బయటకు తీసుకెళ్లడం సూచీల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ ఉదయం 79,611.90 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,541.79) స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. రోజంతా ఒడుదొడుకుల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 79,117.37 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 55.47 పాయింట్ల నష్టంతో 79,486.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 51.15 పాయింట్లు నష్టపోయి 24,148 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.37గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్, ఎస్‌బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్టీపీసీ, టాటా మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి. ఎంఅండ్ఎం, టైటాన్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, నెస్లే ఇండియా, హెచ్‌యూఎల్, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.63 డాలర్లు వద్ద, బంగారం ఔన్సు 2,696.10 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.

# లోయర్ సర్క్యూట్‌కు రిలయన్స్ పవర్ షేర్లు



**ఢిల్లీ:** అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ లిమిటెట్ షేర్లు భారీగా కుంగాయి. శుక్రవారం ట్రేడింగ్ సెషన్‌లో ఈ షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. రిలయన్స్ పవర్, దాని అనుబంధ సంస్థల పైనా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ మూడేళ్ల పాటు నిషేధం విధించిన నేపథ్యంలో షేర్లు 5 శాతం మేర నష్టపోయాయి. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ జూన్‌లో 1 గిగావాట్ సోలార్ పవర్, 2 గిగావాట్ స్టాండలోన్ బ్యాటరీ ఎనర్జీ సోలార్ సిస్టమ్ కోసం బిడ్లను ఆహ్వానించింది. ఇందులో రిలయన్స్ పవర్ అనుబంధ సంస్థ రిలయన్స్ NU BESS పాల్గొంది. అయితే చివరి రౌండ్ బిడ్డింగ్‌లో ఆ సంస్థ నకిలీ బ్యాంక్ గ్యారెంటీలు అందించినట్లు తమ దర్యాప్తులో తేలిందని ఎస్ఈసీఐ తాజాగా ప్రకటించింది. దీంతో ఆ బిడ్డింగ్ ప్రక్రియను నిలిపివేశామని, రిలయన్స్ పవర్‌పై మూడేళ్ల పాటు నిషేధం విధిస్తూ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. తాజా నిర్ణయంతో భవిష్యత్తులో మూడేళ్ల పాటు ఎస్ఈసీఐ నిర్వహించే బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు రిలయన్స్ పవర్‌కు వీలుండదు. ఈ ప్రకటన కంపెనీ షేర్లపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో నేటి ట్రేడింగ్ బీఎస్ఈలో 4.99శాతం నష్టపోయి రూ.41.47 వద్ద, ఎన్ఎస్ఈలో 5శాతం కుంగి రూ.41.58 వద్ద లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది ఆగస్టులోనే మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ.. సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి ఐదేళ్ల పాటు నిషేధం విధించిన విషయం తెలిసిందే. నిధుల మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో రూ.25 కోట్ల జరిమానా విధించింది. అయితే అక్టోబర్‌లో సెక్యూరిటీ అప్పిలేట్ ట్రైబ్యునల్ సెబీని పెనాల్టీ వసూలుచేయకుండా ఆపినప్పటికీ.. ఆయనపై నిషేధం కొనసాగుతోంది.

# ఎంఆర్ఎఫ్ లాభంలో క్షీణత.. షేర్లు డౌన్

**ముంబయి:** ప్రముఖ టైర్ల తయారీ సంస్థ ఎంఆర్ఎఫ్ త్రైమాసిక ఫలితాలను విడుదల చేసింది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.470.70 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే సమయంలో నమోదైన రూ.586.60 కోట్ల లాభంతో పోలిస్తే 19 శాతం క్షీణత నమోదైంది. ఇక కార్యకలాపాల నుంచి వచ్చే ఆదాయం రూ.6,881.09 కోట్లుగా ఉంది. గతేడాది నమోదైన ఆదాయం రూ.6,217.10 కోట్లతో పోలిస్తే 10 శాతం పెరిగిందని పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో స్టాండలోన్ పద్ధతిలో ఎంఆర్ఎఫ్ నికర లాభం 20 శాతం క్షీణించింది. రూ.571.93 కోట్ల నుంచి రూ.455.43 కోట్లకు తగ్గినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. స్టాండలోన్ పద్ధతిలో ఆదాయం 11.1శాతం పెరిగి రూ.6,087.56 కోట్ల నుంచి రూ.6,760.37 కోట్లకు చేరింది. అదే సమయంలో కంపెనీ మార్జిన్లు కూడా 14.4 శాతం తగ్గాయని పేర్కొంది. మొత్తం ఖర్చులు 16 శాతం పెరిగి రూ.5,497 కోట్ల నుంచి రూ.6,363 కోట్లకు చేరాయని తెలిపింది. ఈ సందర్భంగా మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.3 చొప్పున డివిడెండ్ చెల్లించాలని ఎంఆర్ఎఫ్ బోర్డు నిర్ణయించింది. నవంబర్ 19 రికార్డు తేదీగా ప్రకటించింది. ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేర్లు మధ్యాహ్నం 1:45 గంటలకు ఎన్ఎస్ఈలో రూ.2,052.35 పాయింట్లు తగ్గి (1.70శాతం) రూ.1,18,969.35 వద్ద ట్రేడవుతున్నాయి.

# టాటా మోటార్స్ లాభం రూ.3,450 కోట్లు

### ఓలా నష్టం రూ.495 కోట్లు

**ముంబాయి :** ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.3,450 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,832 కోట్ల నికర లాభంతో పోలిస్తే 9.9 శాతం క్షీణత నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో టాటా మోటార్స్ ఆదాయం రూ.1,00,534 కోట్లుగా ఉంది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఈ ఆదాయం రూ.1,04,444 కోట్లుగా నమోదైంది. మొత్తం ఖర్చులు రూ.97,330 కోట్లుగా ఉందని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఫలితాల నేపథ్యంలో మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేర్ ఎన్ఎస్ఈలో 1.98 శాతం క్షీణించి రూ.803 వద్ద స్థిరపడింది.

నష్టాల్ని తగ్గించుకున్న ఓలా..

విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసిక ఫలితాల్లో ఏకీకృత ప్రాతిపదికన నికర నష్టాన్ని రూ.524 కోట్ల నుంచి రూ.495 కోట్లకు తగ్గించుకుంది. ఆదాయం 39 శాతం పెరిగి రూ.873 కోట్ల నుంచి రూ.1,214 కోట్లకు పెరిగినట్లు ఓలా ఎలక్ట్రిక్ శుక్రవారం ప్రకటించింది. ముడి సరుకు ధరలు తగ్గడం, విక్రయాలు పెరగడంతో నష్టాలు తగ్గినట్లు పేర్కొంది. అక్టోబర్‌లో 50 వేల వాహనాలు విక్రయించి 30శాతం మార్కెట్ వాటాతో ఈ విభాగంలో అగ్రగామిగా కొనసాగుతోంది. ఫలితాల నేపథ్యంలో ఓలా ఎలక్ట్రిక్ షేర్ ఎన్ఎస్ఈలో 2.47శాతం క్షీణించి రూ.72.72 వద్ద ముగిసింది.





# మణిపూర్‌లో గిరిజనుల ఇళ్లకు నిప్పు..

### మంటల్లో కాలి మహిళ మృతి

**ఇంఫాల్:** మణిపూర్ లో కుకీ, మైతీ జాతుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. సాయుధులైన వ్యక్తులు చెలరేగిపోయారు. జిరిబామ్ జిల్లాలోని గిరిజన గ్రామమైన జైరోన్ హ్మార్‌పై గురువారం రాత్రి దాడులకు పాల్పడ్డారు. ఆరు ఇళ్లకు నిప్పుపెట్టారు. ఒక ఇంట్లో ఉన్న ముగ్గురు పిల్లల తల్లి మంటల్లో కాలి మరణించింది. భర్త, పిల్లల కళ్ల ముందే ఆమె చనిపోయింది. ఇళ్లు కాలిపోవడంతో పలువురు గిరిజనులు నిరాశ్రయులయ్యారు. తమ ప్రాణాలను రక్షించుకునేందుకు కాలుతున్న ఇళ్ల నుంచి పరుగులు తీశారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే భద్రతా దళాలు అక్కడకు చేరుకున్నాయి. కాగా, మణిపూర్‌లో కొనసాగుతున్న సంఘర్షణకు శాంతియుత పరిష్కారం కోసం మైతీ, కుకీ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు ఢిల్లీలో చర్చలు జరిపారు. అయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. సెప్టెంబర్ 7న జిరిబామ్ జిల్లాలో జరిగిన కాల్పుల్లో ఆరుగురు చనిపోయారు. మణిపూర్‌లో గత ఏడాది నుంచి కొనసాగుతున్న ఘర్షణల్లో 200 మందికిపైగా మరణించగా వేలాది మంది ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు.

# గ్రెనేడ్ దాడికి పాల్పడ్డ ముగ్గురు లష్కరే ఉగ్రవాదుల అరెస్ట్




**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం ముగ్గురు లష్కర్ ఎ తోయిబా ఉగ్రవాదుల ను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన ముగ్గురు ఉగ్రవాదులు ఒసామా యాసిన్ షేక్, ఉమర్ ఫయాజ్ షేక్, అర్ఫాన్ మన్సూర్ షేక్‌లుగా పోలీసులు గుర్తించారు. ముగ్గురు ఉగ్రవాదులు శ్రీనగర్‌లో ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రైడ్ చేసి పట్టుకున్నారు. కశ్మీర్ ఐజీ వీకే బిర్డి ప్రెస్ మీట్ పెట్టి వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న ఈ ముగ్గురు ఉగ్రవాదులు శాంతి భద్రతల సమస్యను సృష్టించాలనే ఉద్దేశంతో గ్రెనేడ్ దాడికి పాల్పడ్డారని, ఈ దాడిలో 12 మంది పౌరులు గాయపడ్డారని బిర్డి తెలిపారు. ఈ ముగ్గురు టెర్రరిస్టులతోపాటు వారికి సహకరించిన వారిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పాకిస్థాన్‌లో ఉన్న సూత్రదారుల సూచన మేరకు ఇక్కడ గ్రెనేడ్ దాడి జరిగిందని అన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ ఏపీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని పోస్టుకు రేవంత్‌రెడ్డి రిప్లై ఇచ్చారు. మీ విషెస్‌కు ధన్యవాదాలు అని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రేవంత్‌రెడ్డి మరెన్నో పుట్టిన రోజు వేడుకలు చేసుకోవాలన్నారు.

# టెన్త్ పరీక్ష రుసుం తేదీల ఖరారు

విశ్వంభర, హైదరాబాద్: పదో తరగతి పరీక్ష రుసుం చెల్లింపు తేదీలను తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు వెల్లడించారు. ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఈ నెల 18 వరకు చెల్లించుకునేందుకు గడువు ఇచ్చారు. ఆ తర్వాత రూ.50 ఆలస్య రుసుంతో డిసెంబర్ 2 వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. రూ. 200 ఆలస్య రుసుంతో డిసెంబర్ 12 వరకు, రూ. 500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 21 వరకు చెల్లించుకోవచ్చని సంచాలకులు ప్రకటనలో పేర్కొన్నారు.

### తెలంగాణ రాకపోయి ఉంటే

# రేవంత్ సీఎం అయ్యేవారా?

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చెరిపేస్తానని గతంలో వ్యాఖ్యానించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆయన కట్టిన ఆలయంలోనే పుట్టిన రోజు వేడుకలు చేసుకున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరి గుట్ట పర్యటనపై హరీశ్‌రావు స్పందించారు. మూసీకి మంచినీళ్లను కాళేశ్వరం నుంచే తరలిస్తామని సీఎం రేవంత్ చెప్పారనన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చిన కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని, భూమి ఉన్నంతకాలం కేసీఆర్ రాష్ట్ర ప్రజల గుండెల్లో ఉంటారని చెప్పారు. 'కేసీఆర్ లేకుండా తెలంగాణ వచ్చేదా? ప్రత్యేక రాష్ట్రం రాకపోయి ఉంటే మీరు సీఎం అయ్యేవారా?' అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.





# ఆర్యవైశ్యులకు అండగా ఉంటా..









**(మొదటి పేజీ తరువాయి)** సుజాత ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య పండితుల ఆశీర్వాదంతో తన ఛాంబర్ లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛైర్ పర్సన్ పదవి తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ కార్పొరేషన్ లో ప్రతి నిరుపేద, బలహీన ఆర్యవైశ్యులకు అండగా ఉండి వారిని అన్ని రంగాలలో ముందుకు తీసుకువచ్చేలా ప్రయత్నం చేస్తానని అన్నారు. పేద ఆర్యవైశ్యులకు అండగా ఉంటానన్నారు. వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యత తో పాటు పార్టీ కోసం పని చేసిన వారికి పదవులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం రోజే తాను పదవీ బాధ్యతలు చేపట్టం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆర్యవైశ్యులలో ఉన్న వైషమ్యాలను నిర్మూలించి అందరినీ ఒక్కతాటిపై చేర్చి వారి అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు.

### కార్లు, బైకులతో భారీ ర్యాలీ

ప్రమాణ స్వీకారానికి ముందు కల్వ సుజత్ పారడైజ్ నుండి అభిమానులు , నాయకులు, కార్యకర్తలతో వందలాది బైకులతో , కార్లతో ర్యాలీ నిర్వహించి బాణాసంచా , డప్పుచప్పుళ్ల నడుమ కార్పొరేషన్ కార్యాలయం వరకు భారీ జనంతో తరలి వచ్చారు. ప్రమాణ స్వీకార మహోత్సవంలో వైశ్య వికాస వేదిక ఛైర్మన్ , వి-3 న్యూస్ ఛానల్ , విశ్వంభర దిన పత్రిక ల ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ , ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్ రావు , ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, మాజీ మంత్రి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి. చిన్నారెడ్డి , కాంగ్రెస్ రాష్ట్ర నాయకులూ నిర్మల జగ్గారెడ్డి, పట్నం సునీత రెడ్డి , మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య , మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి, పోలీస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ గుప్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులూ కేవీ ప్రతాప్ ,వీబీజీ రాజు, కాశం వెంకట హరి , చకిలం రమణయ్య , ఎల్వీ కుమార్, ఆవోపా నమశ్శివాయ, సంగారెడ్డి జిల్లా ఆర్య వైశ్య నాయకులు తొప్పాజి అనంత కిషన్ , తెలంగాణ రాష్ట్ర డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ఆర్యవైశ్య మహిళా సంఘాల ప్రతినిధులు నాగావర్ధిని గుండ జ్యోతి, మంజుల, కొత్త వనజ , సి హెచ్ కవిత , చిదానంద కుమారి , వాణి , ప్రతిభ , పందిరి గీత, రజిని , సరస్వతి, నిర్మల, అనంత లక్ష్మి , ప్రసన్న లక్ష్మి , మోహనమ్మ , లక్ష్మి , యశోధర, పలు జిల్లాల ఆర్యవైశ్య సంఘాల నాయకులు , వాసవీ క్లబ్బుల ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.










తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ కార్యాలయం ప్రారంభోత్సవ సందర్భంగా ఛైర్ పర్సన్ కల్వ సుజాత గుప్తాని శాలువ తో సన్మానించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాసం వెంకటారి గుప్తా, నంగునూరు అశోక్ గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రాయల శ్రవణ్ గుప్తా, రెబెల్లి శ్రీనివాస్ గుప్తా, కండే శివ గుప్తా, సముద్రాల హరినాథ్ గుప్తా.

# వైశ్యులంటే ఇంత చిన్నచూపా?

- కార్పొరేషన్ ఏర్పాటు తూతూ మంత్రమేనా?
- ప్రమాణ స్వీకారానికి ఒక్క మంత్రీ రారా?
- ఇదేనా ప్రభుత్వం ఇచ్చే గౌరవం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైశ్యులకు రాజకీయంగా కొంత ప్రాధాన్యం ఉండేది. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమంలో వైశ్యులు ఘననీయమైన పాత్ర పోషించారు. చరిత్ర మరువలేని రీతిలో వారు కొట్లాడారు. ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా ఉద్యమానికి అన్ని విధాలుగా అండగా నిలిచారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రాజకీయంగా తమకు సముచిత ప్రాధాన్యం లభిస్తుందని ఆశించారు. కానీ 2014 ఎన్నికలలోఉద్యమపార్టీ టీఆరెస్ వైశ్యులకు ఒకే ఒక్క టికెట్ ఇవ్వగా కాంగ్రెస్ ఒక్కరికికూడా అభ్యర్థిత్వం ఇవ్వలేదు. బీజేపీ ముగ్గురికి అవకాశం కల్పించింది. 2019 ఎన్నికల్లోనూ టీఆరెస్ నిజామాబాద్ అర్బన్ స్థానాన్ని మాత్రమే కేటాయించింది. కాంగ్రెస్ ఈసారి కూడా మొండిచెయ్యే చూపింది. కాగా బీజేపీ ఒక ఎంపీ స్థానాన్ని , మూడు అసెంబ్లీ టిక్కెట్లు ఇచ్చింది. ఎన్నికల ప్రచార సమయంలో టీఆరెస్ అధినేత కేసీఆర్ వైశ్యులపై ప్రశంసలు కురిపించారు. ఎంతో గౌరవాన్ని ప్రకటించారు.

కోటి ఇచ్చయినా కోమటిని మంచిచేసుకోవాలని చెప్పడం ద్వారా వైశ్యుల ఆదరణ పొందారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పడమే కాకుండా మేనిఫెస్టోలో కూడా పొందుపరచడంతో వైశ్య సమాజం ఎన్నో ఆశలు పెంచుకుంది. కానీ 11 మున్సిపల్ ఛైర్మన్ పదవులు, 6 కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, ఒక ఎమ్మెల్సీ పదవిని మాత్రమే వైశ్యులకు ఇచ్చి కార్పొరేషన్ మాత్రం ప్రకటించకుండా దాటవేశారు. దీంతో వైశ్య సమాజంలో ఒకింత అసహనం మొదలైంది. అసంతృప్తికి దారి తీసింది. ఈ దశలో 2023 ఎన్నికలలో మళ్లీ వైశ్య కార్పొరేషన్ హామీ తెరమీదికి వచ్చింది. వైశ్యుల మనోభావాలను గుర్తించిన అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే వైశ్య కార్పొరేషన్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ విజయఢంకా మోగించి అధికారంలోకి వచ్చింది. అనంతరం అనేక కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ప్రకటించిన క్రమంలో వైశ్య కార్పొరేషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఆర్యవైశ్య మహాసభలో కోశాధికారిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న మహిళా నాయకురాలు కల్వ సుజాతను ఛైర్‌పర్సన్‌గా నియమించింది. అయితే నాలుగు నెలలు దాటినా ఎలాంటినిధులు కేటాయించకపోవడం, పదవీబాధ్యతలు అప్పగించకపోవడంతో వైశ్య సమాజంలో తిరిగి నిరాశా నిస్పృహలు అలుముకున్నాయి. ఈ దశలో కల్వ సుజాత శుక్రవారం (నవంబరు 8) పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆమె ప్రమాణ స్వీకారానికి ఒక్క మంత్రి కూడా హాజరుకాకపోవడం వైశ్యులను తీవ్రంగా నిరాశపరిచింది. ఒక మహిళ, చురుకైన కార్యకర్తకు ఛైర్‌పర్సన్ పదవిని కేటాయించడం గౌరవమే అయినా ప్రమాణ స్వీకారం వేళ వ్యవహరించిన తీరు మాత్రం సమంజసంగా లేదు. సమయాభావమో...మరో కారణమో.. ఏమైనా సరే కాంగ్రెస్ ప్రభుత్వం వైశ్య కార్పొరేషన్‌కు సముచిత గౌరవం ఇవ్వకపోగా అవమాన పరిచే విధంగా వ్యవహరించింది. ఇతర కార్పొరేషన్ ఛైర్మన్ల ప్రమాణ స్వీకారాలకు మంత్రులు హాజరై తమ మద్దతు ప్రకటించగా వైశ్య కార్పొరేషన్‌ను మాత్రం చిన్నచూపు చూసింది. ఇది వైశ్యుల మనోభావాలను గాయపరిచింది. చట్ట సభలకు పోటీచేసే అవకాశం ఇవ్వకపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పదకొండు నెలలైనా నిధులు కేటాయించకపోవడం, వైశ్య కార్పొరేషన్ ను కూడా తూతూమంత్రంగా ఏర్పాటు చేయడం వైశ్యులను నిర్లక్ష్యం చేయడమే. తమను అవహేళన పరిచే విధంగా వ్యవహరించడం , అధమ స్థాయికి నెట్టివేయడాన్ని వైశ్య సమాజం గర్హిస్తోంది. వైశ్యుల మనోభావాలు దెబ్బతిన్న ప్రభావం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీపై తప్పకుండా పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన ధోరణి మార్చుకోవాలి. వైశ్యుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పాటుపడాలి.

### కులగణనలోనూ ...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కులగణనను చేపట్టింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 ఆగస్టు 19న అప్పటి టీఆరెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టింది. నాటి నుంచి నేటి వరకు తిరిగి సర్వే జరగలేదు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మానసపుత్రికగా బీసీల కులగణన ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. చాతుర్వర్ణ వ్యవస్థ ప్రకారం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా సమాజంలో విభజన ఉంది. అయితే అగ్రవర్ణంగా గుర్తింపు పొందిన వైశ్య కులానికి కాలక్రమంలో గొప్ప పదం (ఆర్య) చేర్చి లేని ఆర్యవైశ్య కులాన్ని సృష్టించారు. ఇదే వాడుకలోకి రావడంతో వైశ్యకార్పొరేషన్ ను కూడా ఆర్యవైశ్య కార్పొరేషన్ గా ప్రకటించారు. దీనిని వైశ్య కార్పొరేషన్‌గా మార్చాలి. అలాగే 009 సెక్షన్ కింద వైశ్య, గుప్త, కోమటి, శెట్టి అని ఉపకులాలుగా పేర్కొన్నారు. వైశ్యులలో ఉపకులాలు లేవు. అందువల్ల ఈ అన్ని పేర్లను వైశ్యులుగానే గుర్తించాలి.



-డాక్టర్ కాచం సత్యనారాయణ
వైశ్య వికాస వేదిక ఛైర్మన్